# జాతీయ సూర్తి

పక్షపత్రిక

2020 ఆగస్టు 1-31

వెల : రూ.30/-

ద్వేషం లేని దేశం కోసం కావలసింది సయోధ్య

రామ మందిరంలో రాజకీయ తంత్రం

చరిత్ర అంటే కొందరికి ఎందుకంత భయం?

నూతన విద్యా విధానం పెద్ద వెనకడుగు

విద్యా వ్యవస్థలో సమస్యలు గుర్తించని కొత్త విధానం

మానవత్వం పరిమళించిన కవి తిలక్

ప్రజాకవి, జానపద శిఖరం వంగపండు

కుల, వర్గ జమిలి పోరాట సిద్ధాంతకర్త ఉసా

కోవిడ్ మన సమాజ రోగలక్షణాల్ని కూడా ప్రతిబింబిస్తున్న అద్దం

ఉపశ్రేణుల ప్రవక్త గ్రాంసీ

మార్క్సిజాన్ని సుసంపన్నం చేసిన ఎంగెల్స్

21-22

జాతీయ **స్ఫూర్తి** పక్షపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు

2020 ఆగస్టు 1-31 సంపుటి : 28 సంచిక : 21,22

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

వెల : 30/- రూపాయలు

## ఈ సంచికలో...

3 ద్వేషం లేని దేశం కోసం కావలసింది సయోధ్య - మాడభూషి శ్రీధర్
4 రామ మందిరంలో రాజకీయ తంత్రం - తెలకపల్లి రవి
6 చరిత్ర అంటే కొందరికి ఎందుకంత భయం? - డాక్టర్ దేవరాజు మహారాజు
8 నూతన విద్యా విధానం పెద్ద వెనకడుగు - ప్రభాత్ పట్నాయక్
11 విద్యా వ్యవస్థలో సమస్యలు గుర్తించని కొత్త విధానం - డా॥ అమిత్ దాస్ గుప్తా
13 మానవత్వం పరిమళించిన కవి తిలక్ - డా. పీవీ సుబ్బారావు
14 నూరేళ్ళ తిలక్ ఈనాటి మనం - రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
17 ప్రజాకళల దారిదీపం - బి.ఎస్. రాములు
18 ప్రజాకవి,జానపద శిఖరం వంగపండు - వాడ్రేవు చిన వీరభద్రుడు,
20 మార్క్సిజం నుంచి దళిత బహుజనం దాకా.. - ప్రొ॥ కంచ ఐలయ్య
21 కుల, వర్గ జమిలి పోరాట సిద్ధాంతకర్త ఉసా - సుజాత సూరేపల్లి
25 కోవిడ్ మన సమాజ రోగలక్షణాల్ని కూడా ప్రతిబింబిస్తున్న అద్దం - అవిజిత్ పాఠక్
27 అస్తవ్యస్త కాలంలో ఆన్‌లైన్ విద్య - అవిజిత్ పాఠక్
29 ఉపశ్రేణుల ప్రవక్త గ్రాంసీ - కొప్పర్తి
32 మార్క్సిజాన్ని సుసంపన్నం చేసిన ఎంగెల్స్ - డి వి వి ఎస్ వర్మ
34 నేటికీ ఏంగెల్స్ కృషి శ్లాఘనీయమే - గుడిపాటి నరసింహారావు
36 మార్క్సిజం ఎందుకు మెరుగైన తత్వశాస్త్రం?
38 నీవూ మార్క్సిస్టువే - డా॥ బి. రమేష్ చంద్రబాబు
40 మార్క్సిజాన్ని మించిన కరదీపిక లేదు - హెచ్చార్కే

# అంతరాల చదువు

**సంపాదకీయం**

మోదీ ప్రభుత్వం కొత్త విద్యావిధానాన్ని ప్రకటించింది. అంతరాల చదువుకి ద్వారాలను పెద్దది చేసింది.

చదువు మనిషికి సంపద. వ్యక్తి శక్తి సామర్థ్యాలను చదువు అనేక రెట్లు పెంచుతుంది. అందరికీ స్వతంత్ర జీవనాన్ని ఇస్తుంది. అందుకే దేశానికి చదువు సంపద అయింది.

అలాంటి చదువు పట్ల ప్రభుత్వాలు ఉదాశీన వైఖరిని అనుసరిస్తున్నాయి. ప్రకటనల నటన తప్ప ఆచరణకు అడుగులు పడడం లేదు. అందరికీ విద్య కోసం కమిషన్ల మీద కమిషన్లు వెయ్యడం. ఆయా రిపోర్టుల ఆధారంగా కొత్త కొత్త విద్యా విధానాలను ప్రకటించడం పరిపాటి అయ్యింది.

ఇప్పుడు మోదీ ప్రభుత్వం అలాంటి కొత్త అదే కోవకు చెందిన కొత్త విద్యా విధానాన్ని ప్రకటించింది. ఇప్పటి వరకు పిల్లలకు 14 ఏళ్ల వరకు చదువుకు దిక్కు లేదు గాని ఇప్పుడు 18 ఏళ్ల చదువుకు కొత్త వాగ్దానం వచ్చింది. అందరికీ చదువు అన్న నినాదానికి షరా మామూలుగా 2030 సంవత్సరానికి గడువు ప్రకటించింది.

ఇప్పటి వరకు 10+2+3 గా వున్న విద్యా పద్ధతిని 5+3+3+4గా మార్పు చ చేసింది. రెండు పద్ధతుల్లోనూ అంకెలు కూడితే 15 వస్తుంది. సంఖ్యాపరమైన జ్యోతిష్యం ఈ అంకెల కూడికల అద్భుతంగా కనిపిస్తుంది.

ఇప్పటికే ఉన్న వారికో చదువు, లేనివారికో చదువు అన్నది నడుస్తున్నది. విద్యారంగంలో కార్పొరేట్ శక్తుల ప్రవేశం వల్ల ఈ పరిణామం సాగుతున్నది. ఇప్పుడు విద్యను ప్రయివేటీకరించడానికి ఈ కొత్త విద్యా విధానం మరింతగా దోహదం చేస్తుంది. ఆ మేరకు ప్రభుత్వం విద్యారంగం నుండి తప్పుకోవడానికి దారులు వేసింది.

అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తున్న విధానంలో భాగంగానే మోదీ ప్రభుత్వం ఈ కొత్త విద్యా విధానాన్ని తెచ్చినట్టు కనిపిస్తున్నది.

ఈ దేశంలో బహుళత్వాన్ని రూపుమాపి ఏకరూపం చెయ్యాలన్న తలంపులో భాగంగా దీనిని చూడాలి.

ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం, ఒకే ఎన్నిక, ఒకే పన్ను వగైరా చర్యలలో భాగంగా ఒకే విద్య పేరుతో కేంద్రీకరణ కోసం ఇది ఉద్దేశించబడింది.

విద్యలో ప్రాదేశిక, భాషా వైవిధ్యాలను తుడిచిపెట్టడం, ప్రజాస్వామ్య భావజాలాన్ని తొలగించడం లక్ష్యంగా కాషాయీకరణకు దారులు వేస్తున్నారు.

ప్రయివేటీకరణ వల్ల విద్యలో మరింత అంతరాలు పెరుగుతాయే తప్ప అందరికీ సమాన విద్య మాత్రం ఎండమావిగానే మిగులుతుంది. ❑



# ద్వేషం లేని దేశం కోసం కావలసింది సయోధ్య

**మాడభూషి శ్రీధర్**
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్

సమానత రాజ్యాంగ నియమం మాత్రమే కాదు. ప్రకృతి నియమం. సహజ న్యాయ సూత్రం. నిజానికి ఆర్టికల్ 14 ఒక నిర్దేశిక సూత్రం. కాని హక్కు అని నిర్ణయించకపోతే సమానత గురించి ఏ పాలకులూ పట్టించుకోరు. సమానత అంటే గాడిద గుర్రం కూడా సమానం అంటామా? అ

క్కడ సమత (ఈక్విటీ) పాటించాలి. మనుషులంతా ప్రాథమికంగా ఒకటే అని ఒప్పుకుందామా? సర్వజీవులు ఒకటే అని మతం చెబుతుంది. కనీసం సర్వమానవులు ఒకటి అనుకోలేమా? వసుధైవ కుటుంబకం అనే తాత్విక చింతనను ప్రపంచానికి ఇచ్చిన విశ్వగురువు భారతదేశమే అని మనమంతా గర్వంగా మళ్లీ చెప్పుకున్నాం. ఈ కుటుంబంలో అన్ని మతాలవారు సభ్యులేనా? ఆర్టికల్ 14 భారత రాజ్యాంగంలో మూలభూతమైన హక్కుగా ఆ సమానతా సమతా భావనే కూర్చారు.

ఆర్టికల్ 14 నుంచే సర్వమత సమానత వచ్చింది. సెక్యులరిజం కొందరు ద్వేషించే మాటగా మార్చారు. దాని అర్థం అన్ని మతాలను దూరం పెట్టడం కాదు. సమదూరం పాటించడం. వదులుకోవడం కాదు సమంగా గౌరవించడం. అన్ని మతాలను గౌరవించు, ఆదరించు, నీకు ఇష్టమైన మతాన్ని అనుసరించు ఆరాధించు అనేదే సర్వమత సమానత. అన్ని మతాలంటే నిరీశ్వరవాదులు కూడా ఉంటారు. వారిదీ ఒక మతమే. నేను అన్ని మతాల దేవుళ్లనూ ఆరాధిస్తాం అంటే అదీ ఒక మతమే. కొత్త మతాలు కూడా పుట్టవచ్చు. ఆడమగా మాత్రమే లింగ వర్గాలనుకున్నాం మొదట్లో. ఇప్పుడు మూడో లింగవర్గాన్ని గుర్తించాలనడానికి కారణం సమానతా సిద్ధాంతం.

ప్రతి వ్యక్తికి మతం వ్యక్తిగతం, రాజ్యాంగం కూడా ఈశ్వరుడి సాక్షిగా ప్రమాణం చేయవచ్చునని, దేవుడే లేడనే వ్యక్తి అంతరాత్మ సాక్షిగా ప్రమాణం చేయాలంటున్నది. నిజానికి దేవుడు కాదు నన్ను నా అంతరాత్మే నడిపిస్తుందని నిజంగా నమ్మేవాడు గొప్ప సచేతనుడై ఉండాలి. దేవుడే అన్ని చూసుకుంటాడు అని అన్నీ ఈశ్వరునికే వదిలే వారు ఉంటే వారిని పరమభక్తులనాలి. మతాన్ని అనుసరించే వారిలో ఎందరు భక్తులు?ఎందరు పరమభక్తులు? ఈ భక్తిని ఓట్లకోసం వాడుకోవడం కొంగజపం కాదా?

అంబేద్కర్ ఒక రాజ్యాంగ ప్రసంగంలో భక్తి గురించి మాట్లాడుతూ భక్తి కేవలం మతానికి పరిమితం చేయాలని, దాన్ని రాజకీయాల్లోకి, సామాజిక జీవనంలోకి తీసుకురాకూడదని అన్నారు. రాజకీయాల్లో భక్తి ప్రమాదకరం అంటాడు. గుడ్డిగా ఆయనే చూసుకుంటాడులే అనేదే భక్తి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వమే చూసుకుంటుందిలే అని వదిలేసి నిశ్చింతగా ఉండగలిగే స్థితి ఉందా?

అయోధ్యలో రామజన్మభూమి పూజ జరిగింది. అయోధ్యాధీశుడైన రాముడు పుట్టినాడనే కోట్లాది మంది నమ్మకానికి అనుగుణంగా అక్కడ రాంబాబుకు (రాంలల్లా) భవ్యమైన ఆలయాన్ని నిర్మిస్తారు. ఆగస్టు 5వ తేదీ. నిరుడు ఇదే రోజు ఆర్టికల్ 370ని కూలంకషంగా మార్చారు, జమ్ము కాశ్మీర్, లడాఖ్ విభజించి, కేంద్ర పాలిత ప్రాంతాలుగా నిర్ధారించి, ఇంటర్నెట్‌తో సహా అన్ని రకాల సమాచార, సంచార, విద్యా విజ్ఞాన సాధనాలన్నింటినీ నిషేధించి, ఆ ప్రాంత రాజకీయ నాయకులను ఇంటి నిర్బంధానికి పరిమితం చేసిన రోజు. ఏడాదిగా 1975 నాటి అప్రజాస్వామిక అత్యయిక స్థితి కన్న కఠినమైన రీతిలో అప్రకటిత ఎమర్జన్సీ అమలవుతూన్న రోజు. కొన్ని విమర్శ విశ్లేషణా వ్యాసాలు రాసుకున్న చోట్లు తప్ప మొత్తం దేశమంతా రామజన్మభూమిలో శంకుస్థాపన విశేషాల చర్చతో గడిపారు. టివి మీడియా మొత్తం ఆ వార్తలతోనే దేశాన్ని ముంచెత్తింది. పత్రికలూ కూడా.

బాబ్రీ మసీదు–రామజన్మభూమి అత్యంత పాత కోర్టు దావా, వీధుల్లో మతకలహం, రాజకీయంలో మతపరమైన ఎన్నికల ప్రణాళిక, ఓట్లను భావోద్వేగాలతో ప్రభావితం చేసే ప్రచారం, ఇవన్నీ ఈ శంకుస్థాపనతో ముగుస్తాయా? ముగిస్తే బాగుంటుంది కదా. ఇప్పటికైనా కోర్టులకు ఈ వివాదాన్నుంచి ముక్తి లభిస్తే అది గొప్ప విజయమే. రెండు ప్రధానమైన మతాల మధ్య ఘర్షణ కారణంగా అయోధ్య కొనసాగేనా లేక శాంతి కారణంగా సయోధ్య నెలకొనేనా? శాంతి భద్రతలవైపు, అభివృద్ధివైపు పరిపాలకులు చూసే వీలు, మతాతీతమైన, సర్వమత సమానమైన, సర్వమత గౌరవనీయమయిన విధానాలు వికసించే వీలు కలుగుతుంది.

☞ మిగతా 16వ పేజీలో

# రామ మందిరంలో రాజకీయ తంత్రం



**తెలకపల్లి రవి**
ఎడిటర్, ప్రస్థానం మాసపత్రిక

అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. పాలక వర్గాల అవకాశవాదం మతతత్వ రాజకీయ పథకాల కారణంగా దశాబ్దాలుగా నలుగుతూ దేశంలో విపరీతమైన కల్లోలానికి, విధ్వంసానికి కారణమైన అయోధ్య వివాదం పరస్పర అవగాహనతో గాని, కోర్టు తీర్పు ద్వారా గాని ముగిసిపోవాలని ప్రతివారూ కోరుకున్నారు. 1980వ దశకం మధ్య కాలంలో ఒక వైపున అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ నిర్ణయాలు మరో వైపున ఆరెస్సెస్ బిజెపి సంఘ పరివార్ వ్యూహాలతో ఈ సమస్య రాజకీయాలలో కేంద్ర స్థానంలోకి వచ్చింది. 1984లో రెండు సీట్లకు పరిమితమైన బిజెపి దాని ఆధారంగానే 82 సీట్లకు ఎదిగింది. రాజీవ్ తర్వాత వి.పి.సింగ్ నాయకత్వంలో వచ్చిన లౌకిక ప్రభుత్వాన్ని (కాంగ్రెస్‌తో కలసి) 1990లో కూల్చడానికీ ఎల్.కె.అద్వానీ రథయాత్ర సాధనమైంది. అద్వానీ తదితరుల ప్రత్యక్ష నాయకత్వంలో కరసేవ అంటూ 1992 బాబ్రీ మసీదు కూల్చివేయడానికి నాటి పి.వి ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో భారత దేశ లౌకిక ప్రతిష్ట కళంకితమైంది. కలహాలు, పేలుళ్లలో దేశం తల్లడిల్లిపోయింది. కూల్చివేత నేపథ్యంలో బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలను ప్రజలు చాలా వరకూ ఓడించారు కాని వామపక్షేతర పార్టీలు మతతత్వ రాజకీయాలపై పోరాడకపోగా అధికారం కోసం బిజెపితో రాజీ పడ్డాయి.

1996, 98, 99లో వాజ్‌పేయి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసినా బిజెపి ఓట్లు మాత్రం 24 శాతం లోపే. అవి తర్వాత 18 శాతానికి పడిపోయాయి కూడా. గుజరాత్‌లో 2002 మారణకాండ అనంతరం పదేళ్లకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోడీ ప్రధాని పీఠమెక్కిన సమయంలోనూ 37 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇవన్నీ రాముడికీ రామాయణానికి సంబంధించిన అంశాలు కాదు. రాజకీయ భారత పర్వాలు. రాముడిని తరతరాలుగా దేశంలో కోట్ల మంది పూజిస్తూనే వున్నారు. రామాయణ పారాయణం చేస్తున్నారు. వారివల్ల అప్పుడూ ఇప్పుడూ సమస్య లేదు. వారి విశ్వాసాన్ని రాజకీయ పాచికగా చేసుకున్న శక్తుల కుయుక్తుల గురించే చర్చ.

ఇన్నాళ్లకు రామ్‌లల్లా తాత్కాలిక గుడారంలోంచి గుడిలోకి వస్తున్నారని మోడీ ఊగిపోతూ మాట్లాడారు. తెలుగువారి భద్రాద్రి నుంచి అయోధ్యలోని ఇతర మందిరాలలో కూడా రాముడు పూజలందుకుంటూనే వున్నాడు. రాజకీయ గుడారంలో ఆయనను బందీని చేసింది బిజెపి ఆరెస్సెస్ నేతలే. రాముడిని మర్యాద పురుషోత్తముడంటారు. రామో విగ్రహవాన్ ధర్మః అంటారు. మర్యాద అన్నా, ధర్మం అన్నా పద్ధతి. రాజ ధర్మం. ఇప్పుడు



రాజులు లేరు గనక రాజ్యాంగ ధర్మం. ప్రభుత్వాధినేతలు మత క్రతువుల్లో అధికారికంగా పాల్గొనరాదనేది లౌకిక రాజ్యాంగ ధర్మం. సుప్రీంకోర్టు తీర్పు ఆలయ నిర్మాణం కోసం ఒక ప్రత్యేక ట్రస్టును ఏర్పాటు చేసి బాధ్యత దానికి అప్పగించాలని చెప్పింది. కాని అయోధ్య వేడుకలో వేదికపై ప్రధాని మోడీ, ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్, యు.పి సి.ఎం యోగి, గవర్నర్ ఆనందిబెన్ ఆసీనులయ్యారు. తీర్పు ప్రకారం ట్రస్టుకు వదిలి పెట్టకుండా ప్రభుత్వాధినేతలు, సంఘ్ సంచాలకులు తయారవడం ఆ స్ఫూర్తిని ఉల్లంఘించడమే. ట్రస్టు చైర్మన్‌గా వున్న నిత్యగోపాల్‌దాస్ బాబ్రీ విధ్వంసం కేసులో నిందితుడు. బాబ్రీ విధ్వంసం ఘోరమైన నేరమని చెప్పిన సుప్రీం కోర్టు దాని బాధ్యులైన వారికి శిక్షల విషయం వదిలేయడమే గాక వివాద స్థలాన్ని అవతలి పక్షానికి ఇవ్వడమే తీవ్ర విమర్శలకు గురైనప్పటికీ ఏదో ఒక పరిష్కారం అని ప్రజలు సర్దుకున్నారు. అద్వానీ వంటి వారిని ఈ సందర్భంలో దూరం పెట్టడానికి బిజెపి అంతర్గత కారణాలే చెబుతున్నారు గాని గత కళంకాల ముద్రనూ, న్యాయపరమైన చిక్కులను తప్పించుకోవాలనే వ్యూహం అది. ఈ సమయంలో ప్రధాని ప్రసంగం ఏకీకరణ వైపు, సామరస్య సాధన వైపు కాకుండా ఉద్వేగం రగిలించడానికి, భక్తులను (లేదా ఓటర్లను) ఆకట్టుకోడానికి అంకితమైంది. 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ...' అన్న రాముడి మాట ఉటంకించారు. అనేక మతాల వారికి ఇది జన్మభూమి కదా, భారత మాత బిడ్డలందరూ హిందువులే కాదు కదా. రాజ్యాంగ పరంగా మోడీ వారందరికీ ప్రధాని కదా! 'రామో విగ్రహవాన్ ధరః:' అన్నప్పుడు రాజ్యాంగ ధర్మాన్ని కూడా పాటించవద్దా? ఒక ఆలయ శంకుస్థాపనకు అధికారిక హోదాలో ప్రధాని హాజరయ్యేట్టయితే రేపు మరో గుడికి లేదా మసీదుకు, చర్చికి, గురుద్వారాకు కూడా వెళతారా? ఇదే వేడుకలో యు.పి ముఖ్యమంత్రిని 'అయోధ్యలో మసీదు శంకుస్థాపనకు వెళతారా?' అని అడిగితే 'నన్ను పిలవరు...నేను వెళ్లను' అని జవాబివ్వడం యాదృచ్ఛికం కాదు. ఇక కరోనా కరాళ నృత్యం చేస్తున్న వేళ దేశ, రాష్ట్ర పాలకులు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం ఏం సంకేతాలిస్తుంది?

రాముడు ఈ దేశ సంస్కృతికి ప్రతీక అని ప్రధాని ప్రకటించారు. అలాంటప్పుడు బిజెపి వారికే ఉత్సవం ఎందుకు పరిమితమైంది? ఇతర పార్టీల వారినీ లేదా సంస్థల వారిని ఎందుకు విశ్వాసంలోకి తీసుకోలేదు? హిందువుల విశ్వాసం అన్నప్పుడు పరివార్ మాత్రమే మందిర నిర్మాణ బాధ్యత తీసుకోవాలని కోర్టు చెప్పలేదే? కనుకనే కట్టేది రామ మందిరమా లేక బిజెపి, ఆరెస్సెస్ దుర్గమా అని కొందరు పరిశీలకులు ప్రశ్న వేశారు. మీడియా అంతా రామమయం శీర్షికలిచ్చింది గాని అక్కడంతా మోడీ మయమే! 370వ అధికరణం రద్దుకు ఏడాది గడచిన రోజునే అయోధ్య శంకుస్థాపన ముహూర్తం ఊరికే పెట్టలేదు. కాశ్మీరును, రాముణ్ని కూడా మేమే విముక్తి చేశామన్నది ఇక్కడ ప్రచారాస్త్రం.

అయోధ్యకాండలో బిజెపి పథకాలు ఫలించడానికి కాంగ్రెస్ ప్రధానులు దోహదం చేస్తూనే వున్నారు. ఇప్పుడూ తామెక్కడ వెనకబడి పోతామోనని కాంగ్రెస్ తరపున రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ట్వీట్లు చేశారు. అత్యధిక ప్రాంతీయ పార్టీలకు బిజెపితో ప్రత్యక్ష పరోక్ష భాగస్వామ్యం. 1998లో ఈ ప్రక్రియను పెంచిన చంద్రబాబునాయుడు అమరావతిని అయోధ్యతో ముడిపెట్టి మాట్లాడారందుకే. ఎ.పి, తెలంగాణ అధికార పీఠాలకు సన్నిహితులైన స్వాములిద్దరూ అయోధ్య ఆహ్వానాలు అందుకున్నారు. వేడుకకు మోడీ హాజరవడాన్ని వ్యతిరేకించిన మజ్లిస్ నాయకుడు ఒవైసీ వంటి వారు ఈ పార్టీల మిత్రులే! కేరళ ముస్లింలీగ్ బాబ్రీ విధ్వంస సమయంలో కూటమి భాగస్వామిగా వుండటాన్ని ముఖ్యమంత్రి విజయన్ సూటిగా ప్రస్తావించారు. ఈ కాలమంతటా మతతత్వ రాజకీయాలను నికరంగా వ్యతిరేకించింది నిలదీసింది వామపక్షాలు, ప్రజాస్వామిక వాదులు, ప్రజాపక్ష మేధావులు మాత్రమే. మోడీ సర్కారు వారిపై వేట సాగిస్తున్న కారణం కూడా అదే (ప్రజాశక్తి 1992 లోనే అయోధ్యపై లక్షల ప్రతులు ప్రత్యేక సంచిక వేసింది). ఈ సమయం లోనూ అలాంటి గొంతులు వినిపిస్తూనే వున్నా ఒక తెలుగు పత్రిక సంపాదకీయంలో వామపక్షాలే విఫలమైనట్టు రాయడం విస్మయకరం. మోడీ సర్కారుపై సన్నాయి నొక్కులు, వారి మిత్రులతో నెయ్యం, కాంగ్రెస్‌పై కఠిన విమర్శలు, కమ్యూనిస్టులపై వైఫల్య ముద్రలు ఈ తరహా వ్యాఖ్యాతలకు వెన్నతో పెట్టిన విద్య. ఆ సంగతి ఎలా వున్నా లౌకిక రాజ్యాంగాన్ని మత సామరస్యాన్ని కాపాడుకోవడం నేటి కీలక కర్తవ్యంగా వుంది. త్వరలో యు.పి, బీహార్ ఎన్నికలు వస్తున్న కారణంగా ఇది మరింత తక్షణ ప్రాధాన్యత సంతరించుకుంటుంది. భిన్న మతాలకు విశ్వాసాలకు నిలయమైన ఈ దేశంలో మత విద్వేషాలు కరోనా వైరస్ కన్నా ఎక్కువ హాని కలిగిస్తాయి. అలాంటి అవాంఛనీయ పరిణామాలు లేకుండా అయోధ్య కాండ ముగిసిపోవాలంటే అప్రమత్తంగా వుండక తప్పదు. ❑

# చరిత్ర అంటే కొందరికి ఎందుకంత భయం?

డాక్టర్ దేవరాజు మహారాజు
సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్



దేశచరిత్ర అనేది ఒక యూనివర్సిటీకి లేదా ఒక పరిశోధకుడి పరిశోధనకు సంబంధించిన విషయం కాదు. ప్రపంచ వ్యాప్తంగా పరిశోధకులంతా ఏండ్ల తరబడి పరిశోధనలు చేస్తే వచ్చే ఫలితమే చరిత్రగా నిలుస్తుంది. ఎంతో మంది చరిత్రకారులు, ఆర్కియాలజిస్ట్లు, ఇండాలజిస్ట్లు పరిశోధించి చెప్పిన దానికి ఆర్ఎస్ఎస్ వారు ఎందుకు బెంబేలెత్తుతున్నారూ? అసలు చరిత్ర పుస్తకాల్ని మార్చి తిరగరాయించాలనే కోరిక బీజేపీ ప్రభుత్వ పెద్దలకు ఎందుకొచ్చిందీ? ఇప్పుడున్న చరిత్ర గ్రంథాలంటే వారికెందుకంత గుబులూ? ఇది ఇలా ఉంటే, ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీల్లో విజిటింగ్ ప్రొఫెసర్గా ఉంటూ, ప్రపంచ మేధావుల్లో ఒకరైన భారతీయ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ (83) పుస్తకాల్ని తగుల బెట్టాలని ఎందుకు పిలుపునిస్తున్నారూ?

తన కృషిని గుర్తించి ఇచ్చే అకడమిక్ అవార్డులు తప్ప, మరే ఇతర అవార్డులూ తీసుకోనని, భారత ప్రభుత్వం ఇచ్చే పద్మభూషణ్ని రెండుసార్లు నిరాకరించిన విశిష్ట వ్యక్తిత్వం కదా ఆమెది? అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అమెరికన్ 'లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ క్లూగ్ చైర్'కి నియమితులైనవారు కదా ఆమె? అలాంటి నిజాయితీ, నిబద్ధత గల చరిత్రకారులంటే ఆర్ఎస్ఎస్-బీజేపీలకు ఎందుకంత వణుకూ? వారి ఉనికికి భంగం కలిగించే పరిశోధనా ఫలితాలు వారు వెల్లడిస్తున్నందుకా? బహుశా ఆర్యన్ దండయాత్రే వారి భయానికి కారణమై ఉంటుంది.

ఆర్యులు - అంటే ఇప్పుడు భారతీయ సమాజంలో ఉన్నత వర్గాల వారు, ఒకప్పుడు విదేశాల నుంచి వలస వచ్చారన్న సిద్ధాంతం- బహుశా వారికి మింగుడు పడటం లేదేమో! ఆర్య బ్రాహ్మణ, ఆర్య క్షత్రియ, ఆర్యవైశ్యగా చెప్పుకునే ఆర్యులు, ఒకప్పుడు ఇరాన్ ప్రాంతం నుంచి వలస వచ్చినవారు. ఇక్కడ సింధూ నాగరికతను అభివృద్ధి పరుచుకున్న ఈ దేశ మూల వాసుల్ని ఆర్యులు విభజించారు. శూద్రులుగా, చండాలురుగా చేసి కుల వ్యవస్థను స్థిరపరిచారు. ఆనాడు భూమి ఉన్న రైతుల్ని ఊరి బయటికి పంపి, అంటరానితనాన్ని అంటగట్టారు. బలవంతంగా బెదిరించి, వారి భూముల్లో పంటలు పండించు కున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్కియాలజిస్టులు, మానవ శాస్త్రవేత్తలు, భాషా శాస్త్రవేత్తలు ఇంకా ఇతర పరిశోధకులంతా గత రెండు వందల ఏండ్లుగా ఎన్నో తవ్వకాలు జరిపి ఎంతో శ్రమించి, పరిశోధించి వెలికి తీసిన విషయమిది.

టైమ్స్ ఆఫ్ ఇండియా దినపత్రిక 21 మే 2001నాడు ప్రచురించిన వార్తా కథనం ప్రకారం, అమెరికా ఉట్టా విశ్వవిద్యాలయం - బయోటెక్నాలజీ డిపార్టుమెంట్ హెడ్ మైఖేల్ బమ్శాద్ పరిశోధించి చెప్పిందేమంటే.. భారత్లోని బ్రాహ్మణులు ఈ దేశ మూలవాసులు కాదనీ, వారు యురేషియనులని తేల్చాడు. ఆయన ఒక్కడే కాదు, ఆయనతోపాటు మరికొంతమంది శాస్త్రవేత్తలు కూడా ఆ పరిశోధనలో పాలుపంచుకున్నారు. ఆ బృందంలో డాక్టర్ జయదీక్షిత్ కూడా ఒకరు. ఈయన పూనాకు చెందినవాడు. అమెరికాలో స్థిరపడ్డ భారతీయ బ్రాహ్మణుడు. మైఖేల్ బమ్శాద్ వలె ఇదే విషయం మీద పరిశోధనలు చేసి ఆ విషయాన్నే ధృవపరచాడు.

ఇప్పుడు యధార్థాలు తెలుసుకుని ఆలోచిస్తే ఆర్ఎస్ఎస్-బీజేపీలు ఎక్కడివీ? యురేషియా నుంచి వలసవచ్చిన వారి వారసత్వాన్ని అంటే ఆర్యుల వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న వారివన్నమాట! అందుకే చూడండి వారికి భారత రాజ్యాంగం కన్నా మనుస్మృతే విలువైంది. వారికి జాతీయ పతాకం కన్నా వారి ఆర్ఎస్ఎస్ జెండానే ముఖ్యమైంది. ఆర్యుల వర్ణ చరిత్ర మాత్రమే ఉన్న వేదాల్ని గొప్పవిగా భావిస్తారు. అందుకే వీరి పట్టుపూర్వోత్తరాల గూర్చి చెప్పే చరిత్రకారులంటే వీరికి వెన్నులో వణుకు పుడుతుంది. ఈ విషయాలన్నీ తెలిస్తే, ప్రజలు ఎలా స్పందిస్తారోనని భయపడుతుంటారు. క్రీ.పూ. వైదికమతంలో విగ్రహారాధన లేదు. బ్రాహ్మణులు మాంసాహారులు. యజ్ఞ యాగాలలో ఆవుల్ని బలిఇచ్చి తిని, తాగి వేడుకలు చేసుకునేవారు. అప్పటి నుంచే అగ్నిని దేవుడిగా, ఇంద్రుణ్ణి దేవుడిగా, వరుణుణ్ణి దేవుడిగా గుర్తిస్తూ దేవతల సంఖ్య పెంచుకుంటూ పోయారు.

క్రీ.పూ.బౌద్ధం దేశమంతా వ్యాపించి స్వేచ్ఛ, సమానత్వాల గురించి చెప్పింది. అహింసను బోధించింది. ఆత్మ, పరమాత్మలు లేవని చెపుతూ అందరూ హేతుబద్ధంగా ఆలోచించాలని చెప్పింది. బుద్ధుడి ప్రభావాన్ని, అతడి బోధనల ప్రభావాన్ని తట్టుకోలేక,

హిందూమత వాదులు తమ మతంలో, తమ జీవన విధానంలో కొన్ని మార్పులు చేసుకోవాల్సి వచ్చింది. నేరుగా బుద్ధుణ్ణి తమ దశావతారాల్లో చేర్చుకోవడం, మాంస భక్షణ మానేయడం, బౌద్ధారామాల్ని హిందూ దేవాలయాలుగా మార్చుకోవడం వగైరా జరిగాయి. బుద్ధుడి వ్యక్తిత్వానికి ధీటుగా రాముడు, కృష్ణుడు వంటి కల్పిత పాత్రల్ని సృష్టించి, కథలల్లడం జరిగింది.

బౌద్ధ జాతక కథల స్ఫూర్తితో హిందూపురాణాల్లోని ఎన్నో ఘట్టాలు రాసుకోవడం జరిగింది. సునిశితంగా విశ్లేషించుకుంటే ఆ విషయాలు గ్రహించొచ్చు. ఇక వైదిక మతం క్రమంగా రూపాంతరం చెందుతూ బ్రాహ్మణమతంగా మారింది. క్రీ.పూ. ఒకటో శతాబ్దంలో అంటరానితనాన్ని ప్రవేశపెట్టి సమాజంలో తమదే అత్యున్నతమైన స్థానమని ఆర్య బ్రాహ్మణులు ప్రకటించు కున్నారు. కులాలు, వర్ణాలు సజావుగా వర్ధిల్లేటట్టు కట్టడి చేశారు. ఇతర కులాల వారిని విద్యకు, సంపదకు దూరం పెట్టి– వారు విధి లేక కులవ్యవస్థను, వర్ణవ్యవస్థను పాటించాల్సిన దుస్థితి ఏర్పరిచారు. ఒక దశలో శూద్రులు దేవుడైన శంకరుడికి బ్రహ్మ, విష్ణులతో సమానమైన స్థాయి కల్పించారు. గోవుకు పవిత్రత ఆపాదించి, గోవధ నిషేధించారు.

ఈ దేశ మూలవాసులైన శూద్రులు, పంచములు, ఆర్యబ్రాహ్మణుల వల్ల విపరీతమైన చిత్రహింసలకు గురయ్యారు. ఊపిరి మెసలని కట్టుబాట్లు, నిబంధనలతో విసిగిపోయారు. పన్నెండో శతాబ్దంలో దేశంలోకి ముస్లింలు రావడంతో వారిలో కొందరు ముస్లిం మతంలోకి మారారు. 1792లో విలియం కేర్ దేశంలో అడుగుపెట్టినప్పుడు మరికొందరు క్రైస్తవం స్వీకరించారు. ఆర్య బ్రాహ్మణులు హిందూ మతంలో విధించినన్ని కఠినమైన నిబంధనలు ఇతర మతాల్లో లేకపోవడం వల్ల, ఇక్కడలేని సౌకర్యాలు, సౌలభ్యాలు, వెసులుబాట్లు అక్కడ ఉండటం వల్ల కొంత మంది ముస్లిం మతంలోకి, మరికొంత మంది క్రైస్తవంలోకి మారడం జరిగింది. జైన, బౌద్ధ మతాలు అప్పటికే తగ్గుముఖం పట్టాయి. అసలైతే ముస్లిం, క్రైస్తవ మూలాలు భారతదేశంలో లేవు. ప్రస్తుతం దేశంలో ఉన్న ముస్లింలైనా, క్రైస్తవులైనా ఈ దేశ మూలవాసులే. బహుజనులే. విదేశీయులు కాదు. దానికి తోడు సుదీర్ఘకాలం దేశం ముస్లిం చక్రవర్తుల పాలనలోనూ, బ్రిటిష్ రాణి పాలనలోనూ ఉండటం వల్ల కూడా మత మార్పిడులు వేగవంతమయ్యాయి.

ఆర్య సమాజ్ అంటే అది యురేషియన్ సమాజం. అంటే విదేశీ సమాజం. భారతదేశంలో బ్రాహ్మణులు 'ఆర్యులు' అని పిలవబడేవారు. అందువల్లే దయానంద్ సరస్వతి ఆర్యసమాజ్ స్థాపించాడు. దేశంలోని ఇతర కులాల వారు, వర్ణాలవారు బ్రాహ్మణుల్ని 'ఆర్యా!' అని సంభోదించాలన్న నియమం ఉండేది. ఇటీవలి కాలం వరకు ఆర్య అనే పదం వాడుకలో ఉన్న విషయం మనకు తెలుసు. ముస్లింలు దండయాత్ర చేసి భారతదేశాన్ని ఆక్రమించుకున్నట్టు, బ్రిటిష్ వారు ఆక్రమించుకుని రాజ్యమేలినట్టు, ఇంకా ఇంకా చాలా యేండ్ల క్రితం ఆర్యబ్రాహ్మణులు కూడా యురేషియా నుంచి అంటే ఇరాన్ ప్రాంతం నుంచి వచ్చి ఈ దేశాన్ని ఆక్రమించుకున్నారని పరిశోధకులు ధృవీకరించారు.

మనం చిన్నప్పుడు ఆర్యుల ప్రవేశం, ఆర్యావర్తనం లాంటివి చరిత్రలో చదువుకున్నవే కానీ అప్పుడు ఇంత విపులంగా విషయాలు తెలియలేదు. ఇప్పుడు హిందూ మతంగా పిలువబడే బ్రాహ్మణిజం ఎప్పుడో ఇరాన్ ప్రాంతం నుంచి వచ్చినవారు రూపొందించింది. మనుషులు మాట్లాడుకోవడానికి ఏర్పరచుకున్న భాషని కర్మ–ధర్మ సిద్ధాంతాల మాటున మంత్రాలు, తంత్రాలుగా మార్చి తమదైన ముద్రవేసుకున్నారు. శ్రమించి, ప్రకృతిని మనిషికి అనువుగా మార్చుకునే పనిని తక్కువదిగా చేశారు. తోటి మనుషుల్ని అంటరానివాళ్ళుగా గుణం తక్కువ వాళ్ళుగా శూద్రులుగా, పంచములుగా ప్రకటించారు. ఒక పందిని దేవుడి అవతారంగా వర్ణించారు.

రుగ్వేదం (3:9:11) ప్రకారం దేవుళ్ళను 3339 వర్గాలుగా, మనుషుల్ని ఆరువేల కులాలుగా విడగొట్టారు. దేవుడి పేరుతో ఆచారాలు ఏర్పరిచి ఒక 'పవిత్రమైన' పురోహిత వర్గాన్ని ఏర్పరిచారు. సమాజంలో తొంభైశాతంగా ఉన్న శూద్రుల్ని, అంటరానివారిని ఆత్మన్యూనతా భావానికి లోను చేశారు. తమ కులం ఏమిటో చెప్పుకోవడానికి సిగ్గుపడేలా చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని ఒక వర్ణవ్యవస్థని, ఒక మానసిక రుగ్మతని భారతీయ సమాజంలో ప్రవేశపెట్టి స్థిరపరిచారు. ఆ దుష్ప్రభావంలోంచి శతాబ్దాలు గడిచినా మన సమాజం కోలుకోలేకపోతోంది. ఇరాన్ ప్రాంతమంటే (యూరోప్+ ఆసియా=యురేషియా) ఇప్పటి ఇరాన్ అని కాదు. వేల వేల ఏండ్ల క్రితం ఆ ప్రాంతం ఇస్లామీకరించ బడక పూర్వం ముందున్న ప్రాంతం. అప్పుడు అక్కడ మాట్లాడిన భాషలు అవెస్తన్ – సంస్కృతం. ఇవి వేరువేరు భాషలుకావు. ఒక మూల భాషకు ఏర్పడ్డ రెండు మాండలికాలు.

☞ **మిగతా 26వ పేజీలో**

# నూతన విద్యా విధానం పెద్ద వెనకడుగు



ప్రభాత్ పట్నాయక్

ఈ నూతన విద్యా విధానం వంటి పత్రాలలో మనం కొన్ని గంభీరంగా కనపడే ప్రకటనలకు, కొత్తగా ప్రతిపాదిస్తున్న మార్పులకు తేడా గమనించగలగాలి. 'ప్రజలందరికీ విద్య', 'జిడిపి లో 6 శాతానికి తగ్గకుండా విద్యా రంగానికి కేటాయించాలి' వంటివి ఇటువంటి ఉత్తుత్తి ప్రకటనలే. వాటిని సాధించడానికి నిర్దిష్టమైన ప్రతిపాదనలు కాని, కార్యాచరణ ప్రణాళిక కాని లేకుండా కేవలం లక్ష్యాలను ప్రకటించడం అంటే గాలికబుర్లేనని మనం గ్రహించాలి. ఈ సంగతి గమనించనందువల్లనే కొందరు విద్యారంగంలో నిపుణులైనప్పటికీ, బిజెపి ప్రభుత్వం ప్రకటించిన నూతన విద్యా విధానంలో చాలా అంశాలు స్వాగతించదగ్గవి అంటూ స్పందిస్తున్నారు. వాస్తవానికి ఈ విద్యా విధానం పూర్తిగా తిరోగమన దిశలో ఉంది. సమ సమాజానికి పునాది వేయవలసిన విద్యా విధాన మౌలిక లక్ష్యం నుంచి వెనకడుగు వేయడమే ఈ నూతన విద్యా విధాన (ఎన్ఇపి) సారాంశం.

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులను విద్యా రంగానికి దూరం చేయడం ఈ నూతన విధానంలో కనపడే పెద్ద వెనకడుగు. ఈ సామాజికంగా వెనకబడిన తరగతుల రక్షణ కోసం రూపొందిన రిజర్వేషన్లు వంటి గ్యారంటీ చర్యల గురించిన ప్రస్తావన ఏదీ ఈ విధాన పత్రంలో మనకు కనిపించదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నేరుగా నిర్వహించే జెఎన్‌యు వంటి విశ్వ విద్యాలయాల్లో రిజర్వేషన్లను అమలు జరపకుండా ప్రభుత్వమే నీరుగారుస్తున్న తీరు గమనిస్తే ఈ విధాన పత్రంలో దళిత, ఒబిసి తరగతుల విద్యార్థులను విద్యారంగం నుంచి పక్కకు నెట్టివేసే ధోరణి వెనుక ప్రభుత్వ పాత్ర స్పష్టంగా కానవస్తుంది.




ఎన్ఇపి ప్రైవేటీకరణను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నది. ఆర్థిక అంశాలతో సహా ఇతర విషయాలలో కూడా స్వయంప్రతిపత్తిని కల్పించాలన్న ప్రతిపాదన సారాంశం ఇదే. అధిక సంఖ్యలో కళాశాలలకు ఈ స్వయంప్రతిపత్తిని కల్పించాలన్న ప్రతిపాదన అమలు జరిగితే ఆ సంస్థలన్నీ ఇకముందు అధిక ఫీజులను వసూలు చేయడం ప్రారంభిస్తాయి. దాని ఫలితంగా పేద కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులు, ముఖ్యంగా అణగారిన తరగతులకు చెందిన విద్యార్థులు ఈ కళాశాలలలో అడుగుపెట్టే వీలు లేకుండా పోతుంది.

అటువంటి పేద విద్యార్థుల కోసం ఉపకార వేతనాలు ఉంటాయి కదా అని ఈ విధానాన్ని సమర్థించే వారు వాదించవచ్చు. ఒకసారి స్వయంప్రతిపత్తి ఇచ్చాక కొందరికి స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం అంటే ఆ మేరకు తక్కిన విద్యార్థుల నుండి అదనంగా ఫీజు వసూలు చేయడమే అవుతుంది. అప్పుడు 'మా డబ్బుతో మీరు చదువుతున్నారు' అనే విధంగా కొందరు సంపన్న తరగతుల విద్యార్థులు మరికొందరు విద్యార్థులను చిన్నచూపు చూడడం, వారిని వేరుగా పెట్టడం జరుగుతుంది. విద్యార్థులందరి లోనూ ఒక సమభావన నెలకొనాల్సిన విద్యా సంస్థలలో ఇటువంటి చీలికలు అవాంఛనీయ పరిస్థితులకు దారి తీస్తాయి. ప్రజాధనంతో, ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లతో నడిచే విద్యా సంస్థలు లేకుండా చేయాలనేది ఈ నూతన విద్యావిధానపు లక్ష్యంగా ఉంది. అప్పుడే నయా ఉదారవాదం నిర్దేశంచే విద్యా వ్యాపారానికి ప్రాతిపదిక ఏర్పడుతుంది. అందువలన పేద తరగతుల విద్యార్థులు చదువులకు దూరమైనా అవుతారు, లేకపోతే రెండవ తరగతి

విద్యార్థులుగా తక్కిన విద్యార్థుల చేత చిన్నచూపు చూడబడుతూ చివరికి ఆ వివక్షను తట్టుకోలేక ఏకంగా చదువు మానేసే స్థితికి నెట్టబడతారు.

ముసాయిదా విద్యా విధానం–2019లో దాతృత్వ స్వభావం లేని ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహించరాదన్న అర్థం వచ్చేలా కొన్ని వాక్యాలున్నాయి. ఇప్పుడు తాజాగా ప్రకటించిన విద్యా విధాన పత్రంలో అటువంటి వాక్యాలన్నీ తొలగించబడ్డాయి. ఇదొక ఆసక్తి కలిగించే వాస్తవం. అదే విధంగా ముసాయిదాలో విద్యాహక్కు చట్టానికి సంబంధించిన ప్రస్తావనలు ఏవైతే ఉన్నాయో వాటిని తుది పత్రంలో పూర్తిగా తొలగించారు.

మన పరిశీలన ప్రకారం ఈ నూతన విధానం ఫలితంగా పలువురు విద్యార్థులు విద్యా రంగం నుండి వైదొలగే అనివార్య పరిస్థితులు ఏర్పడతాయి. ఇలా వైదొలగడాన్ని 'సర్దుబాటుకు వీలుండే విధానం' అనే మాటలతో కప్పిపుచ్చి మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు. ఈ విధానంలో నాలుగేళ్ళ డిగ్రీ కోర్సును ప్రతిపాదించారు. దాని వెనుక కారణాలేమిటో స్పష్టత లేదు. ఇటువంటి ప్రతిపాదనే యుపిఎ–2 హయాంలో కపిల్ సిబాల్ చేసినప్పుడు దానికి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మోడీ ప్రభుత్వం తొలి విడత అధికారంలోకి రాగానే స్మృతి ఇరానీ విద్యా మంత్రిగా ఉండి ఆ ప్రతిపాదనను వెనక్కి తీసుకున్నారు. అప్పుడది కేవలం ఒక్క ఢిల్లీ యూనివర్సిటీకి మాత్రమే పరిమితంగా చేసిన ప్రతిపాదన. దానిని వెనక్కు తీసుకున్న బిజెపి ప్రభుత్వం ఇప్పుడు ఏ కారణాలనూ వివరించకుండానే ఏకంగా దేశం మొత్తానికే ఆ నాలుగేళ్ళ డిగ్రీ కోర్సును విస్తరిస్తూ ప్రతిపాదన చేశారు. ఈ కొత్త ప్రతిపాదన ప్రకారం ఏ విద్యార్థి అయినా ఒక ఏడాది లేదా రెండేళ్ళు చదివాక ఇక కొనసాగించకుండా మధ్యలోనే ఆగిపోతే అటువంటి వారికి ఒక ఏడాది పూర్తి చేస్తే సర్టిఫికెట్, రెండేళ్ళు పూర్తి చేస్తే డిప్లొమా ఇస్తారు.

అంటే ఈ నూతన విద్యా విధానం డిగ్రీ చదువును మధ్యలో ఆపివేసి అర్థాంతరంగా వైదొలగడాన్ని అధికారికంగా ప్రోత్సహిస్తున్నదన్నమాట. డ్రాపౌట్లు లేకుండా నివారించడం ఎలా అన్నది వదలిపెట్టి ఆ డ్రాపౌట్లనే చట్టబద్ధం చేయడానికి పూనుకున్నదన్నమాట. ఆ విధంగా ఆగిపోయేవారికి ఓదార్పుగా ఓ సర్టిఫికెట్ గాని, ఓ డిప్లొమా గాని ఇవ్వనున్నారు. ఆ సర్టిఫికెట్లతో వారికెటువంటి ఉద్యోగాలూ వచ్చేది లేదు. పూర్తి కాలం కాలేజీలో చదవకుండా మధ్యలో ఆగిపోయినందువలన వారికి ఎటువంటి విజ్ఞానమూ అదనంగా లభించదు. కాలేజీ జీవితం ద్వారా వారెటువంటి ప్రయోజనకరమైన అనుభవాన్నీ పొందజాలరు. మొత్తంగా చూస్తే ఈ నూతన విద్యా విధానం వలన చాలామంది అరకొర చదువుతో ఆగిపోడానికి, తాము చదువుకున్నామనే భ్రమలు వారికి కలగడానికి దారితీస్తుంది తప్ప ఆ 'చదువు' వలన వారికెటువంటి ప్రయోజనమూ ఒనగూరదు. ఇటువంటివారంతా అత్యధికులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తరగతుల నుండి ఉంటారని మనం స్పష్టంగానే గ్రహించవచ్చు.

స్వాతంత్ర్యం సాధించినప్పుడు మన దేశం అన్ని ప్రాంతాల, అన్ని తరగతుల ప్రజలకూ విద్య అందుబాటులోకి తీసుకు రావాలన్న లక్ష్యం నిర్దేశించుకుంది. ఆనాటి నూతన చైతన్యానికి ఇది సంకేతం. ఆనాటి లక్ష్యం నుండి ఇప్పుడీ కొత్త విధానం పూర్తిగా వైదొలగినట్టే. అదే విధంగా ఉపాధి అవకాశాలను కల్పించే కోర్సులన్న పేరుతో వొకేషనల్ విద్య వైపుగా ఎక్కువ మందిని నెట్టడం ఈ విధానంలో కనపడుతుంది. సాధారణ విద్యను కనీస స్థాయి వరకూ అభ్యసించకుండానే, అందుకవసరమైన కాలం ఉమ్మడిగా చదవకుండానే చిన్న పిల్లలను కూడా వొకేషనల్ విద్య వైపు నెట్టడం బట్టి ఈ ప్రభుత్వం యువతకు విద్య గరపవలసిన తన బాధ్యత నుండి వైదొలగదలచుకుందని మనకు అర్థం అవుతోంది. కొద్దిపాటి శిక్షణనిచ్చి దానితో సరిపెట్టుకుని ఉపాధి కోసం వేటలో పడమని యువతకు ఈ ప్రభుత్వం సూచిస్తోంది.

పాఠశాల విద్యలో తొలి సంవత్సరాలలో పిల్లలు తమ తమ మాతృభాషలలో చదువుకోవాలని, ఆ భాష ఆ రాష్ట్రం యొక్క అధికార భాష కాకున్నా పిల్లలు మాత్రం తమ మాతృభాషలోనే చదువుకోవాలని నూతన విద్యా విధానం చెప్తోంది. ఇది మంచిదే (మన రాష్ట్రంలో సవర, కోయ భాషలలో చదువు నేర్పే విధానం కొన్ని చోట్ల అమలులో ఉంది). అయితే ఆ విధంగా చదువుకున్న వారు తర్వాత కాలంలో ఇతరులతో బాటు దీటుగా అధికార భాషా మాధ్యమంలో చదువుకోవాలన్నా, తక్కినవారితో బాటు పోటీ పడగలిగేలా ఉండాలన్నా అందుకు కొన్ని అదనపు చర్యలు అవసరం. అటువంటి వారికి పై చదువులలో రిజర్వేషన్లు కల్పించడం అవసరం. అటువంటి చర్యలేవీ ఈ నూతన విధానంలో ప్రతిపాదించలేదు. దీని ఫలితంగా తమ తమ మాతృ భాషల్లో (అధికార భాష కాని స్థానిక భాషల్లో– కోయ, సవర వగైరా) చదువుకునే పిల్లలు ఇక ఆ స్థాయిని దాటి పై చదువులు నేర్చుకోలేని దుస్థితిలో పడిపోతారు. ప్రాథమిక స్థాయితోనే వారి చదువులు ముగిసిపోతాయి.

నూతన విద్యా విధానం ఆ విధంగా విద్యా రంగంలో ఉన్నత తరగతుల విద్యార్థులకు తక్కిన వారికి మధ్య ఒక చీలికను తీసుకు వస్తుంది. ఇది ఏ మాత్రమూ సహించరాని విషయం. ఇంతటితో ఆగక, ఆ చీలికను సమర్థించే తాత్విక దృక్పథాన్ని కూడా ఈ నూతన విధానం ముందుకు తెచ్చి ప్రజలు ఈ చీలికలను ఆమోదించేటట్టు వారిని ప్రభావితం చేస్తుంది. 'భారతీయత' ఒక గర్వించదగ్గ వారసత్వం అని ప్రతీ విద్యార్థీ భావించే విధంగా చేయాలన్నది ఒక లక్ష్యంగా ప్రకటించారు. అయితే మన సంస్కృతిలో వారసత్వంగా మనకు అత్యంత అమానవీయమైన అంటరానితనం అనేది సంక్రమించింది. ఇటువంటి అంశాల పట్ల ఎవరైనా ఏ విధంగా గర్వపడగలరు? అందుకే సిలబస్ నుండి అటువంటి వాస్తవిక అంశాలను మరుగుపరిచి మన భారతీయ వారసత్వాన్ని 'అందంగా కనపడేలా' సవరించనున్నారు.

'నిష్కామ కర్మ' అనేది మనకు సంక్రమించిన ఇంకొక తాత్విక వారసత్వం. వ్యక్తిగతంగా ఎవరికి వారు ఈ దృష్టిని అలవరచు కోవడం అనేది వారి ఇష్టం. కాని దానినే విద్యార్థులకు ఒక సిలబస్‌లో భాగంగా బోధిస్తే అది అనివార్యంగా దోపిడీని కప్పి పుచ్చేందుకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఈ 'నిష్కామకర్మ' భావన తలకెక్కిన కుర్రవాడు తన తండ్రి గనుక జీతం పెంచమని సమ్మె చేస్తే ఆ సమ్మెను ఎట్టి పరిస్థితిలోనూ బలపరచడు.

విద్య యొక్క ప్రయోజనం ఇప్పుడున్న ప్రపంచం కన్నా మెరుగైన ప్రపంచాన్ని రూపొందించుకోవడం. అలా జరగాలంటే ఇప్పుడున్న ప్రపంచంలోని పరిస్థితుల పట్ల విద్యార్థులకు అసంతృప్తి కలగాలి. అప్పుడే వారు దానిని మెరుగుపరిచేందుకు సిద్ధమౌతారు. అలా గాక, ఇప్పుడున్న పరిస్థితుల పట్ల, మరీ చెప్పాలంటే ఇంకా పాతకాలం నాటి పరిస్థితుల పట్ల సంతృప్తిని కలిగించి సర్దుబాటు ధోరణిని ప్రోత్సహిస్తే అటువంటి విద్యా విధానం ఒక తిరోగమన దిశ వైపే మనల్ని నడిపిస్తుంది. ఈ నూతన విద్యా విధానం అటువంటిదే.

ఈ విద్యావిధానంలో విద్యార్థులకు వారి ప్రాథమిక హక్కుల గురించి ఏమీ బోధించరు. కేవలం వారి ప్రాథమిక విధుల గురించి మాత్రమే బోధిస్తారు. ఈ విధాన పత్రం మొత్తం మీద 'లొంగి వుండడం' అనే స్వభావాన్ని విద్యార్థులకు ఎక్కించడమనేదే అంతర్లీన సూత్రంగా ఉంది. ఉన్నత తరగతులకు చెందిన విద్యార్థులేమో అధికార పదవులు పొంది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలకు లొంగి వుంటూ వ్యవహరిస్తారు. అటువంటి అవకాశాలేవీ అందుబాటులోకి రాని వెనుకబడిన సామాజిక, ఆర్థిక తరగతుల విద్యార్థులంతా ఈ వ్యవస్థకు లొంగి పడివుండే శ్రామిక వర్గంలో చేరుతారు. ఇంకోవక్క నానాటికీ ఉద్యోగావకాశాలు తగ్గిపోతుండడంతో అలా లొంగి పడివుండే స్వభావమూ పెరుగుతుంది. ఈ పరిస్థితుల్ని ఎదిరించి పోరాడే మేథోపరమైన శక్తియుక్తులూ సన్నగిల్లుతాయి. ఇదే ఈ నూతన విధాన రూపకర్తల అసలు లక్ష్యం. మన దేశానికే గాదు, ఏ దేశానికీ బొత్తిగా పనికిరాని విధానం ఇది.

'సర్దుబాటుకు వీలుండే విధానం', 'అందరికీ అవకాశాలు', 'విద్యార్థులపై భారం తగ్గించడం' వంటి పదాల మాటున వాటికి పూర్తి వ్యతిరేకదిశలో ఫలితాలు వచ్చే విధానాలను తీసుకు వస్తున్నారు. ఎక్కువ మంది విద్యకు దూరమవడమే గాక, అలా దూరం కావడానికి వారు సర్దుకుపోయే విధంగా తయారు చేయబడతారు. ఇంకోవైపు నుండి చూస్తే ఈ విధానం ఇంకా బాగా అర్థమౌతుంది. ఇప్పటి పెట్టుబడిదారీ వ్యవస్థకు ఒకే మూసలో పోసిన చదువు నేర్పడం అవసరం. అదే భూస్వామ్య సమాజంలోనైతే ఎక్కడి వారక్కడే పనుల్లో కుదురుకునేవారు. తమ స్వస్థలాలను వదిలిపెట్టడం అరుదు. కాని ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థకు ఏ ప్రాంతానికి చెందినవాడైనా ప్రపంచంలో ఎక్కడికైనా పోయి పని చేయడానికి సిద్ధపడే కార్మికులు కావాలి. అందుకే ప్రపంచమంతటా ఒకే విద్యా విధానం ఉండాలన్న నినాదాన్ని పెట్టుబడిదారులు ముందుకు తెస్తున్నారు (మన పాలకులు మనకు ప్రపంచ స్థాయి విద్యను నేర్పుతామంటూ చెప్పి విద్యావ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నారు) కాని స్వతంత్ర భారతదేశం కోరుకున్నది ఈ తరహా విధానం కాదు. ఆయా ప్రాంతాల, తరగతుల ప్రత్యేకత లను, అసమానతలను గ్రహించి వాటిని అధిగమించేందుకు అవసరమైన సామర్థ్యాన్ని పొందగలగాలి.

కాని నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడికి ఏ మేరకు అవసరమో ఆ మేరకు మాత్రమే చదువు నేర్పి, తన దోపిడీని ఎల్లకాలమూ కొనసాగించడానికి వీలుగా ఎలాంటి ప్రతిఘటనా లేని పరిస్థితులను నెలకొల్పడం విద్యా విధాన లక్ష్యంగా ఉంటుంది. ఏయే హక్కులను, అవకాశాలను నిరాకరిస్తున్నదో, ఏయే అంశాలలో ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకోజూస్తున్నదో పరిశీలిస్తే అప్పుడు ఈ నూతన విద్యా విధానం అసలు రంగు ఏమిటో బోధపడుతుంది. ❑

# విద్యా వ్యవస్థలో సమస్యలు గుర్తించని కొత్త విధానం

డా॥ అమిత్ దాస్ గుప్తా

భారతదేశ విద్యా వ్యవస్థలో నెలకొని వున్న సమస్యలను తెలుసుకొనేందుకు జాతీయ విద్యా విధానం ఏనాడూ ప్రయత్నించ లేదు. కొత్తగా ప్రకటించిన జాతీయ విద్యా విధానం– 2020 కొవిడ్–19 సంక్షోభం కాలంలో ప్రవేశపెట్టిన అనేక చర్యలు లాంటిదే. ఈ సంక్షోభాన్ని అవకాశాలుగా మలుచుకోవాలని, భారతదేశాన్ని 'ఆత్మనిర్భర్ శీల్'గా తయారు చేయాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. ఇంత ముఖ్యమైన విధానాన్ని దేశం విధ్వంసకర పరిస్థితులను ఎదుర్కొంటున్న స్థితిలో ప్రకటించారు. విధ్వంసం చేసే చర్యలలో ఇదొకటి. ఇస్రో మాజీ చైర్మన్ డా॥ కె.కస్తూరి రంగన్ అధ్యక్షతన కమిటీ నూతన విద్యా విధానం ముసాయిదాను కొవిడ్–19 కంటే ముందే రూపొందించింది. ప్రధానమంత్రి భారత స్వయంసంవృద్ధి లక్ష్యాన్ని ఈ విధానం ప్రతిబింబించితీరాలి. దేశం స్వయంసంవృద్ధి సాధించేందుకు అత్యంత కీలకమైన ఈ సాధనంలో మార్పులు చేయకుండా మంత్రివర్గం ఆమోదించకుండా ఉండవలసింది. ప్రధానమంత్రి కంటే కాస్త ముందుగానే కస్తూరి రంగన్ ఆలోచించినట్లుగా ఉంది. ఈ విధానం విదేశీ విశ్వవిద్యాలయాలకు తలుపులు తెరుస్తుంది. సమస్యలు గుర్తించకుండా గత ప్రభుత్వాల వైఫల్యాలను కప్పి పుచ్చేందుకు, భారతదేశ యువతకు సార్వత్రిక విద్యను అందించేందుకు మాత్రమే ఈ విధానం పరిమితమైంది. దేశ విద్యావ్యవస్థలో ఏం జరుగుతుంది? లేదా ఏం జరిగిందనే అంశాన్ని ప్రస్తావించనేలేదు. దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థలలో జరుగుతున్న దానికి సంబంధం లేకుండా విద్యా వ్యవస్థ లేదు. కుల ఆధారిత, అత్యంత అసమాన సమాజం, ఆర్థిక వ్యవస్థ అందరికి న్యాయమైన, సమానమైన విద్యను అందించలేదు.

**తినడానికి లేనిచోట సార్వత్రిక విద్య? :** కోట్లాదిమంది పేదలున్న దేశంలో ఆర్థికరంగం కుంగిపోయి ఉంది. ప్రపంచంలోని ఐదుగురు అత్యంత సంపన్నులలో ఒకరు భారత దేశంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అన్ని జీవన రంగాలలోను తీవ్రమైన వ్యత్యాసాలతో ప్రజలు అల్లాడుతున్నారు. విద్య లేదా ఆరోగ్యరంగం ఏదైనా కావచ్చు. ఈ పరిస్థితులే ఉన్నాయి. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో ఆరోగ్యరంగం అలాగే విద్యారంగాల సేవలు అందుబాటులో లేవు. వలస కార్మికులు తిరిగి ఇళ్ళకు నడిచి వెళుతున్న దృశ్యాలు హృదయ విదారకరంగా ఉన్నాయి. పేదరికం వల్ల కార్మికుల పిల్లలు స్కూళ్ళకు ఎంతమంది వెళ్ళడం లేదనేది గణాంకాలు తెలియజేస్తాయి. తినడానికి, నివాసానికి అవకాశం లేకుండా సార్వత్రిక విద్య అసాధ్యం. బట్టీ పట్టడం, పరీక్షల ద్వారా అధ్యయనం చేయడం సాధ్యం కాదని ఈ విధానం స్పష్టం చేసింది. అవగాహన ఏర్పర్చుకోవాలని గట్టిగా నొక్కి పలికింది. ఇదే సమయంలో విద్య ఒక వస్తువుగా మారి, వాణిజ్యీకరణ అయిన అంశాన్ని ఈ విధానం ప్రస్తావించలేదు. ప్రస్తుతం ఈ విధానమే విద్యా వ్యవస్థను అల్లుకొని ఉంది. ఉద్యోగ మార్కెట్లో మంచి ఉద్యోగాలకు ఉన్న పోటీని తట్టుకొని అలాంటి ఉద్యోగాలను ఇతరులకంటే ముందుగా చేజిక్కించుకునేందుకు తల్లిదండ్రులు బట్టీ పట్టే, పరీక్షల ద్వారా చదువుకునే విధానాన్నే కోరుకుంటున్నారు. పోటీ పడుతున్న ఈ పద్ధతిని పూర్తిగా ఎలా లేకుండా చేస్తారో కొత్త విద్యా విధానం ప్రస్తావించలేదు. వాణిజ్యీకరణ అయిన విద్యా విధానంలో బట్టీ పట్టడం, పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి నిబంధన అయింది. పేరు పొందిన విద్యా సంస్థలలో ప్రవేశం కోసం ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. కొత్త విధానంలో ఈ విద్యా సంస్థలన్నీ బహుళ అంశాలను చదువు కొనేవిగా మారతాయి. ఎర్లీకేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) విద్యను 3 నుంచి 5 ఏళ్ళ మధ్య గల పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా అందించాలని ఈ విధానం నొక్కి చెబుతున్నది. డీటీహెచ్, స్మార్ట్ ఫోన్ల ద్వారా విద్యను అందించేందుకు వీలుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు అవసరమైన శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. రోజు వారీ చేసే పనులతో పాటు ఈ శిక్షణ కూడా తీసుకోవాలి. అంగన్‌వాడీ కార్యకర్తలకు అతి తక్కువగా వేతనాలు చెల్లిస్తున్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించలేదు. అలాంటప్పుడు గుర్తింపు లేకుండా వారికి ఇంత భారమైన కార్యక్రమాన్ని ఎలా అప్పగిస్తారు? రెండవ అంశం మధ్యతరగతి, ఉన్నతస్థాయి తరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీలకు పంపిస్తారా? బాల్యదశలోనే వివక్ష ప్రారంభమవుతుంది. విద్య అసమానతలను తొలగిస్తుందన్న మాట నిరుపయోగమైనది. ఈ వివక్ష విద్యలోనే కాదు, బోధనా భాషలోనూ కొనసాగుతుంది.

ఇంగ్లీషు భాషా విద్యా విధానానికి పాలకవర్గాలు ప్రాధాన్యత నిస్తున్నాయి. ఫలితంగా స్కూలు విద్య క్రమంగా ప్రైవేటీకరణ అవుతుంది. దాదాపు అన్ని నగరాల్లోనూ ప్రభుత్వ స్కూళ్లలో మాతృభాషలో విద్యా విధానం లేదు. తల్లి దండ్రులు ఇంగ్లీషు మీడియం స్కూళ్ళలోనే తమ పిల్లలను చేర్పించేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. విద్యార్థుల్లో సమానత్వం కల్పించేందుకు 5వ తరగతి వరకు అటు ప్రభుత్వ ఇటు ప్రైవేటు స్కూళ్ళలో ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశ పెట్టవలసి ఉంటుంది. అయితే 5వ తరగతి వరకు, వీలైతే 8వ తరగతి వరకు అవకాశం వున్న అన్నిచోట్ల మాతృభాష లేదా ప్రాంతీయ లేదా స్థానిక భాషలలో విద్యను అందించాలని ఈ విధానం కోరుతుంది. అవకాశం ఉన్న చోట ఈ విధానం అమలు చేయాలని కోరుకోవటంలోనే అంతా స్పష్టమవుతుంది. ప్రభుత్వం నిజంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టగలిగితే సంపన్నులు తమ పిల్లలను చేర్చే అంతర్జాతీయ స్కూళ్ళను భారీగా పెంచవలసి ఉంటుంది. సైన్సు, ఆర్ట్స్, వాణిజ్యం సబ్జెక్టులను రద్దు చేస్తున్నారు. విద్యార్థులు పలు సబ్జెక్టులను ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించటం మంచిదే. అయితే ఇది ఏనాడూ ఆచరణకు రాదు. పశ్చిమబెంగాల్లో స్కూలు స్థాయిలో ఇలాంటి విభజన లేదు. 11, 12 తరగతులు చదివే విద్యార్థులు తమకు కావాల్సిన సబ్జెక్టులను ఎంపిక చేసుకునే అవకాశం అక్కడ ఉంది. ఆచరణలో ఇబ్బందులు, సంస్థాగతమైన ఆంక్షలు ఉన్నాయి. పైగా ఒక పీరియడ్‌లో ఒక సబ్జెక్టును మాత్రమే బోధించడానికి వీలుంటుంది. ఇలాంటి ఆచరణాత్మకమైన కారణాల వల్ల విభజన అనేది అనివార్యమవుతుంది. ప్రారంభంనుంచి మూడు భాషలను తప్పనిసరి చేశారు. ఒకవైపు పాఠ్యాంశాల భారాన్ని తగ్గిస్తామని చెబుతూ మరోవైపు మూడు భాషలను బోధిస్తామని చెప్పడం పరస్పర విరుద్ధంగా ఉంటుంది. ప్రారంభ సంవత్సరంలో విద్యార్థులు తేలికగా భాషలను నేర్చుకుంటారనేది అంగీకరించ వచ్చు. అంటే దీని అర్థం మూడు భాషలు నేర్చుకోవాలని కాదు. ఒకవేళ ఇదే తర్కం ఉన్నట్లయితే నాలుగు లేదా అంతకంటే ఎక్కువ భాషలను ఎందుకు నేర్చుకోరాదు? మూడు భాషల విధానంలో హిందీని తప్పనిసరిగా అమలు చేయాలన్న ఆలోచన దాగి వుంది. విధానపత్రాన్ని పూర్తిగా చదివినప్పుడు అగోచరంగా ఉన్న అంశాలు కనిపిస్తాయి.

**కేంద్రీకరణ స్పష్టమే :** ఉన్నత విద్యలో కేంద్రీకరణ స్పష్టంగానే ఉంది. ఉన్నత విద్యా సంస్థలన్నింటినీ బహుళ సబ్జెక్టుల బోధన సంస్థలుగా తీర్చిదిద్దుతామనే మాట డొల్లగానే ఉంటుంది. అన్ని ఉన్నత విద్యాసంస్థలను స్వయం ప్రతిపత్తి సంస్థలుగా మార్చడమనేది వాస్తవ విరుద్ధం. విద్య, పాలన, ఆర్థిక విభాగాలలో స్వయం ప్రతిపత్తి కల్పిస్తామని ఈ విధానం ప్రతిపాదిస్తుంది. నిజంగా ఇలా కోరుకున్నట్లయితే అనేక ఉన్నత విద్యా సంస్థలు అంతిమంగా మూతపడతాయి. ప్రస్తుతం ఈ ఉన్నత విద్యాసంస్థల పాలన నిర్వహణలో వున్న ప్రజాస్వామ్యాన్ని రూపుమాపాలనే ప్రభుత్వం కోరుకుంటుంది. ఈ విద్యాసంస్థల గవర్నర్ల బోర్డులలో (బీఓజీ) టీచర్లకు లేదా ఉద్యోగులకు ఎలాంటి పాత్ర ఉండబోదు. ఈ విధానం దాతృత్వం గురించి మాట్లాడుతున్నది. ఇలాంటి అన్ని స్థాయిల విద్యా సంస్థలు ప్రైవేటు యాజమాన్యాల ఆధ్వర్యం లోనే నడుస్తున్నాయి. ఇవి నడుస్తున్న తీరు, వాటి ఉద్దేశాలు అనుభవంలో స్పష్టమవుతున్నాయి. ఒకవేళ ఫీజులను నియంత్రించినప్పటికి డొనేషన్ల రూపంలో వసూలు చేసే కాపిటేషన్ ఫీజులను ఎలా నిలువరిస్తారు? ప్రైవేటు సంస్థలను అనుమతించి ఆహ్వానించినట్లయితే వివక్ష ఉండదని చెప్పడానికి అవకాశం లేదు. బోధనా యూనివర్సిటీలకు, పరిశోధన యూనివర్సిటీలకు మధ్య విధానం తేడాను పేర్కొన్నది. అయితే ఈ తేడా నిరుపయోగం, అవాంఛితం. అన్ని యూనివర్సిటీలలో బోధన, రీసెర్చి కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. ప్రభుత్వం పరిశోధనకు కేటాయించే నిధులను ఎక్కువగా కేంద్రీకరించాలని కోరుకుంటున్నది. స్వయం ప్రతిపత్తి పేరుతో ఉన్నత విద్యలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుకుంటున్నది.

**కాషాయీకరణ స్వరం :** నూతన విద్యావిధానం అంతటా ఎప్పుడూ చెబుతున్న కాషాయీకరణ స్వరం ఉన్నది. ప్రాచీన భారతం, ఆనాటి విద్యా సంస్థలను కీర్తించటం కనిపిస్తుంది. తక్షశిల, విక్రమశిల, బల్లావి, నలంద విశ్వ విద్యాలయాలు గర్వకారణమయ్యాయని కీర్తించారు. ఇదే సమయంలో ఈ విశ్వ విద్యాలయాల్లో కుల ఆధారిత సంకుచిత వారసత్వం కొనసాగింది. ఈ విద్యాలయాల్లో దళితులకు, అంటరానివాళ్ళకు ప్రవేశమే లేదు. మన వారసత్వం ఇంత క్రూరమైనది. ఉన్నత కులాల వారికి సంస్కృతం గుత్త సొత్తయింది. ఈ విధానంలో సంస్కృతాన్ని అతిగా కీర్తించడం ఉంది. దేశంలో విద్యా వ్యవస్థ ఉమ్మడి జాబితాలో ఉంది. ఈ విధానంలో అత్యధిక కేంద్రీకరణ ద్వారా కేంద్ర ప్రభుత్వం రుద్దుతున్న విధానాన్ని రాష్ట్రాలు విధిగా అంగీకరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. 1986 విద్యా విధానం ప్రాంతీయ, స్థానిక అంశాలను, ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రాలు విద్యా విధానాన్ని రూపొందించుకోవడానికి, వీలులేని వాటి పాత్ర లేని అమలులోకి వచ్చింది. రాజ్యాంగంలో మిగిలి ఉన్న సమాఖ్య వ్యవస్థను క్రమంగా ధ్వంసం చేసి కేంద్ర నిర్ణయం అమలు జరిగేలాగా ఈ విధానం ఉంది. ❑



# మానవత్వం పరిమళించిన కవి తిలక్

**డా. పీవీ సుబ్బారావు**
సాహితీ విమర్శకులు



**స**oదర్భం

ఆధునిక కవిత్వంలో మానవతా కేతనాన్ని నిలిపిన మహాకవి తిలక్. అనుభూతి వాద కవిగా ప్రకటించుకొన్న తిలక్ చేపట్టిన ప్రతి వస్తువునీ కవితామయం చేసి కవిత్వంలో వెలుగులు విరజిమ్మిన రవి. శైలీ రమ్యత సాధించిన నవకవి.

### జీవిత విశేషాలు :

తిలక్ పూర్తి పేరు దేవరకొండ బాలగంగాధర తిలక్. ఆయన 1921 ఆగస్టు 1న పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండపాక గ్రామంలో సామాన్య కుటుంబంలో జన్మించారు. తండ్రి సత్యనారాయణకు లోకమాన్య బాలగంగాధర తిలక్‌పై ఉన్న అభిమానంతో ఆ పేరు పెట్టారు.

### రచనా వ్యాసంగం :

ఆధునిక సాహితీ ఉద్యమాల్లో అప్పట్లో ప్రముఖంగా ఉన్న భావకవితా ఉద్యమ ప్రభావంతో 1937లో ప్రభాతము-సంధ్య అనే పద్యకవితా సంకలాన్ని వెలువరించాడు. బొంబాయిలో 1942లో జరిగిన అఖిల భారత అభ్యుదయ సంఘం ప్రతినిధిగా పాల్గొన్నారు. అనారోగ్యం వల్ల 1945 నుండి 1955 వరకు సాహిత్య కృషి అంతగా సాగలేదు. 1961 నుండి కవిత్వంలో కొత్త పోకడలు చూపించాడు. కవిత్వంతో పాటు కథలు, నాటకాలు, నాటికలు, వ్యాసాలు, లేఖా సాహిత్యం మొదలైన ప్రక్రియలన్నింటినీ సుసంపన్నం చేశాడు. మరణానంతరం 1968లో ఆయన వచన కవితలను విశాలాంధ్ర పబ్లికేషన్ వారు 'అమృతం కురిసిన రాత్రి' పేరిట ప్రచురించారు. ఈ సంకలానికి 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించాయి.

### కవితా తత్త్వ వివేచన :

తన కవితా లక్ష్యాన్ని వివరిస్తూ 'నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయా పారావతాలు, ప్రజాశక్తుల విజయ ఐరావతాలు/ వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు' అందమైన ఆర్ద్రమైన భావాలను అందమైన శైలిలో చెప్పడమే తన కవితా లక్ష్యమన్నాడు. ఆధునిక కవిత్వ తత్త్వాల్లో తన కవిత్వం దేనికీ చెందదని స్పష్టీకరించాడు. తిలక్ కవితా విమర్శకుడిగా 'నవత-కవిత' ఖండికల్లో 'కవిత్వం ఒక అల్కెమి. దాని రహస్యం కవికే తెలుసు. కాళిదాసుకు తెలుసు, పెద్దన్నకు తెలుసు, కృష్ణశాస్త్రికి తెలుసు, శ్రీశ్రీకి తెలుసు. అని కవితా కళను రసవాదవిద్యతో పోల్చాడు. కవితా పరమావధిని వివరిస్తూ 'కవిత్వం అంతరాంతర జ్యోతి స్సీమల్ని బహిర్గతం చేయాలి, విస్తరించాలి. చైతన్య పరిధి. అగ్ని చల్లినా/అమృతం కురిసినా అందం ఆనందం దాని పరమావధి కావాలని వివేచించాడు. తిలక్ హైదరాబాద్ నగరాన్ని స్త్రీతో పోల్చి నగరం మీద ప్రేమగీతం ఖండిక రాశాడు. ట్యాంక్‌బండ్‌ను స్త్రీ నడుముతో, అబిడ్స్‌ని కళ్లతో పోల్చాడు. నౌబత్‌పహాడ్‌ని నాగరంగా భావించి వర్ణించాడు.

తపాలాశాఖ వార్షికోత్సవ సందర్భంగా తిలక్ మిత్రుడు డాక్టర్ తంగిరాల వెంకటసుబ్బారావు అభ్యర్థన మేరకు తపాలా బంట్రోతు ఖండిక రాశాడు. అప్పటి కవుల దృక్పథాన్ని అన్యాపదేశంగా అధిక్షేపిస్తూ 'ఈ నీ ప్రార్థన కడుంగడు అసహ్యం సుబ్బారావు/ ఉత్త పోస్టుమన్ మీద ఊహలు రానే రావు' అంటూ ప్రారంభించి తపాలా బంట్రోతు స్థితిని 'ఎండలో వానలో ఎండిన చివికిన చిన్న సైజు జీతగాడు' అంటూ వర్ణించాడు. ఆర్తగీతం ఆరంభంలో 'నా దేశాన్ని గూర్చి పాడలేను, నీ ఆదేశాన్ని మన్నించ లేను. ఈ విపంచికలో శృతి కలుపలేను' అని నిర్మోహ మాటంగా ప్రకటించాడు. తిలక్ కవితా ఖండికల్లో అధిక్షేపాత్మకాలెన్నో ఉన్నాయి. ప్రత్యేకించి 'న్యూ సిలబస్' ఖండికలో భారతదేశంలో అధిక జనాభాను, ఆర్థిక పరిస్థితిని అధిక్షేపిస్తూ 'అమెరికాలో డాలర్లు పండును/ఇండియాలో సంతానం పండును' అంటారు. స్త్రీలపై జరిగే అత్యాచారాలను, వేధింపులను అధిక్షేపిస్తూ 'గజానికొక గంధారీ కొడుకు, గాంధీగారి దేశంలో... అంటాడు.

ఆధునికాంధ్ర కవిత్వంలో అద్భుతమైన శైలీ విన్యాసంతో మానవతావాదానికి మకుటాయమానమైన ఖండికలతో అభ్యుదయానురక్తితో అమృతం కురిసిన రాత్రి సంకలాన్ని సృష్టించిన తిలక్ చిరస్మరణీయుడు. ఆధునిక కవులకు అనుసరణీయుడు.

(ఆగస్టు 1న మహాకవి తిలక్ శతజయంతి) ❑

# నూరేళ్ళ తిలక్ ఈనాటి మనం



రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

తనది సామ్యవాదం కాదని తిలక్ చెప్పుకున్నా, తన సాహిత్యం నిండా సామ్యవాదులు చిత్రించిన దృశ్యాలనే, సన్నివేశాలనే, సందర్భాలనే చిత్రించారు. తిలక్ గారిని 21వ శతాబ్దం యువ రచయితలు, యువ విమర్శకులు అధ్యయనం చేయాలి. ఇది వరకే చదివినవాళ్ళు మారిన ప్రపంచ సందర్భంలో కొత్తగా చదవాలి. వాదాలకు లొంగనంత మాత్రాన ఆయన దేనికీ చెందని రచయిత కాదు.

"దేవుడా! రక్షించు నా దేశాన్ని.../ లక్షలాది దేవుళ్ళ నుండి/ వారి పూజల నుండి/ వారి వారి ప్రతినిధుల నుండి" అని తిలక్ అయిదున్నర దశాబ్దాల క్రితం చేసిన ప్రార్థన అప్పటికన్నా ఇప్పటి మన సమాజానికి బాగా నప్పుతున్నది. ఈ కవితలో కవి పేర్కొన్న వారు ఇప్పుడు కుప్పలు తెప్పలుగా పెరిగిపోయి శాసించే దశకు చేరుకున్నారు. ఇది తిలక్ ముందు చూపు. "మాకు నటనలు వద్దు" అన్నాడు కవి. ఈ నటననే తర్వాత దిగంబర కవులు ఎండగట్టింది. ఇప్పుడు నటనే రాజ్యమేలుతున్నది.



*వయస్సు సగం తీరకముందే*
*అంతరించిన ప్రజాకవి*
*నభస్సు సగం చేరకముందే*
*అస్తమించిన ప్రజారవి*

– అని శ్రీశ్రీగారు తిలక్ గారిని గురించి సరిగ్గానే అన్నారు. తిలక్‌గా ప్రసిద్ధులైన దేవరకొండ బాలగంగాధర తిలక్ బతికింది నలభై అయిదేళ్ళే (01.08.1921 – 02.09.1966). నడీడు కూడా తీరకుండా మరణించిన భారతీయ రచయితలలో తిలక్ ఒకరు. తిలక్ గారితో తెలుగు సమాజానికి చాలా అవసరం ఉండింది. అది తీరకుండానే అనారోగ్యం ఆయన్ని కబళించింది. ఎన్నేళ్ళు బతికామన్నది కాదు, బతికినన్నాళ్ళలో ఏమి చేశామన్నది ప్రధానం. తిలక్ గారు బతికిన నలభై అయిదేళ్ళలోనే ముప్పై ఆరేళ్ళ రచనా జీవితం గడిపారు (1932–66). ఆ రచనలలో చాలా వరకు ఈనాటికీ ప్రామాణికంగా ఉన్నాయి. ప్రాసంగికత కలిగి ఉన్నాయి.

తొంభై తొమ్మిదేళ్ళ క్రితం 1921 ఆగష్టు ఒకటవ తేదీన ఒక సుసంపన్నమైన కుటుంబంలో, పశ్చిమ గోదావరి జిల్లా మండపాకవాసులు రామసోదెమ్మ, సత్యనారాయణ మూర్తి దంపతులకు రెండవ సంతానంగా పుట్టిన తిలక్ అప్పటి రచనా రంగంలో మాత్రం అద్వితీయులలో ఒకడుగా నిలిచారు. స్వాతంత్ర్యోద్యమకారుడైన సత్యనారాయణమూర్తి లోకమాన్య బాలగంగాధర తిలక్ మొదటి వర్ధంతినాడు పుట్టిన కుమారునికి అభిమానంతో, గౌరవంతో ఆ పేరును పెట్టుకున్నారు. ఆత్రేయ, కుందుర్తి, అనిసెట్టి, ఆరుద్ర, గజ్జెల మల్లారెడ్డి, రా.రా., రెంటాల, మధునాపంతుల మొదలైన రచయితలంతా ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో ఒకరి మెడలు ఒకరు తొక్కుకుంటూ తెలుగు నేలను చీల్చుకుంటూ పుట్టుకొచ్చారు. ఈ తానులో పోగే తిలక్. ఆయన పుట్టి నేటికి తొంభై తొమ్మిదేళ్ళు ముగిసాయి. నూరో సంవత్సరం మొదలైంది. ఆయనను స్మరించుకుందాం.

తిలక్ గారు కవి, కథకుడు, నాటక రచయిత, విమర్శకుడు. నవలా రచన కూడా ప్రారంభించారు. పూర్తి కాలేదు. ఆధునిక సాహిత్య ప్రక్రియలన్నిటినీ చేపట్టారు. కవిగా, కథకునిగా మంచి గుర్తింపు పొందారు. తన పదకొండవ ఏటనే 1932లో తిలక్ గారు కథ రాశారనీ, అది 'మాధురి' అనే పత్రికలో అచ్చయిందనీ, కాని అది దొరకడం లేదనీ విమర్శకులు చెబుతున్నారు. చిన్న వయసులోనే రచనలు మొదలుబెట్టిన తెలుగు రచయితలలో ఒకరుగా తిలక్ చేరారు. కవిగా ఆయన పద్యాలు, వచన కవితలు రాశారు. 'ప్రభాతము–సంధ్య' (1937), 'అమృతం కురిసిన రాత్రి' (1941–66 మధ్య రాసినవి), 'గోరువంకలు' (1942–66 మధ్య రాసినవి) ఆయన కావ్యాలు. తిలక్ రాసిన కథలు 1961లో రెండు సంపుటాలుగా వచ్చాయి. తర్వాత అన్నీ కలిసి 'తిలక్ కథలు' పేరుతో 1967లో వచ్చాయి. 'ఇరుగు పొరుగు' (1960), 'సుచిత్ర ప్రణయం' (1961), 'సుప్తశిల' (1967), 'పొగ' (1968) అనే నాటికలు, 'భరతుడు' అనే ఏకపాత్రాభినయం, 'సుశీలపెళ్ళి' (1961), 'సాలెగూడు' (1980 ప్రచురణ) అనే నాటకాలు రాశారు. వీటి రచనా కాలాలు, ప్రచురణ కాలాలు వేరు వేరు.

కొన్ని వ్యాసాలూ ఉన్నాయి. 'అమృతం కురిసిన రాత్రి' అనే వచన కవిత్వ సంపుటికి 1969లో ఆం.ప్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చాయి.

ఆ మధ్య కొన్నాళ్ళు 1955-65 మధ్య తెలుగు సాహిత్య చరిత్రలో స్తబ్ధత కాలం అని అంటుండేవారు. దీని మీద సుదీర్ఘ చర్చలూ జరిగాయి. అయితే ఆ పదేళ్ళలో గొప్ప రచనలు చాలా వచ్చాయి. తిలక్ గారు రాసిన ముప్ఫై కథలలో పదహారు కథలు 1955-65 మధ్యనే వచ్చాయి. నాటకాలు దాదాపు అన్నీ ఆ కాలంలోనే వచ్చాయి. 'అమృతం కురిసిన రాత్రి'లోని 93 కవితలలో యాభై కవితలకు పైగా ఆ పదేళ్ళలోనే వచ్చాయి. అయినా అది స్తబ్ధతా యుగం కావడం విచిత్రం.

తిలక్ సహాయ నిరాకరణోద్యమ కాలంలో పుట్టారు. విప్లవోద్యమ తూర్పు పటం ఎగురుతున్న సమయంలో కన్ను మూశారు. భారత స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ రైతాంగ పోరాటం, చైనా విప్లవం, రెండవ ప్రపంచ యుద్ధం, ఆంధ్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అవతరణ చూశారు. విద్యార్థి దశలో ఆయన వామపక్షవాదిగా ఉండేవారు. తర్వాత రాయిస్ట్ అయ్యారు. ఆ తర్వాత గాంధియన్ అయినట్లున్నారు.

తిలక్ తనను తాను 'అనభూతివాది'గా ప్రకటించుకున్నారు. "స్వాతంత్ర్యంలో సామ్యవాదం పనికిరాదు" అన్నారు. "ఏదో ఒక సిద్ధాంతానికి కట్టుబడి ఉంటే కవికి లాభదాయకం కాదు. ఉత్తమ కవితా సృష్టికి సరిపడదు," అన్నారు. "నా కవిత్వం కాదొక తత్వం/ మరి కాదు మీరనే మనస్తత్వం/ కాదు ధనికవాదం, సామ్యవాదం/ కాదయ్యా అయోమయం, జరామయం" - అని 1941లో 'నా కవిత్వం' అనే కవితలో ప్రకటించుకున్నారు. ఈ అభిప్రాయాలన్నీ ఆయన కాలంలో ప్రధాన స్రవంతిగా ఉన్న అభ్యుదయ, మార్క్సియ సాహిత్య ధోరణిని ప్రతిఘటించేవిగా కనిపిస్తాయి. ఆయన అభిప్రాయాలు ఆయన ఒక అనిబద్ధ రచయిత అనే అభిప్రాయం కలిగిస్తాయి.

"కాదేదీ స్థిరబిందువు" అని ప్రకృతిలో సమాజంలో మార్పును గుర్తించారు. మధ్యతరగతి జీవుల ఊగిసలాటను, క్రింది తరగతి జీవుల నిజాయితీని చిత్రించారు. పెట్టుబడి దారీ వ్యవస్థ దుర్మార్గాలను ఖండించారు. మానవత్వాన్ని ఆలింగనం చేసుకున్నారు. ప్రపంచ యుద్ధాన్ని చాలా కాలం వస్తువుగా చేసుకుని రచనలు చేశారు. ప్రపంచ శాంతిని కోరుకున్నారు. సమాజంలో కనిపించే వ్యథార్త జీవుల యథార్థ గాథలను సాహిత్యీకరించారు. చైనాతో మన దేశానికి యుద్ధం వచ్చినప్పుడు చైనాను వ్యతిరేకించారు. తిలక్ సాహిత్యంలో అంతర్జాతీయ సమాజం కనిపిస్తుంది. జాతీయ దృష్టి ఉంది. ఏమైనా ఆయన కాల్పనిక లక్షణాలను వదులుకోకున్నా, ప్రజా వ్యతిరేక, తిరోగమనవాద రచయిత కాలేదు. సమకాలీన సామాజిక వాస్తవికత విమర్శనాత్మకంగా, కళాత్మకంగా ఆయన సాహిత్యంలో ప్రతిబింబిస్తుంది. అది ఈనాటికీ మనకు ఆదర్శం.

"తత్వాల పేర, విప్లవాల పేర/ ఒకరినొకరు చంపుకోలేము", "మరచిపోకు అసలువాణ్ణి/ నీ సోదరుడైన మానవుణ్ణి" -అన్నది తిలక్ ఆలోచనను ప్రతిబింబిస్తున్నది. రాజకీయ పార్టీలకూ, పాలక వర్గానికీ రచయితలు లోబడి ఉండడం ఆయనకు నచ్చలేదు. 'కవివాక్కు' కవితలో ఈ విషయం ప్రకటించారు. మార్క్సిజం కన్నా ఆయనకు దేశీయమైన బౌద్ధం బాగా ఇష్టమైనట్లుంది: "పరదేశీ స్తుతిలో స్వకీయ సంస్కృతి విస్మరించకు/ ఇంకా కరిగి నీరైపోలేదు హిమాలయ శిఖరాలు/ ఇంకా మరచిపోలేదు తథాగతుని మహాత్ముని ప్రవచనాలు" అని ప్రకటించారు.

తనది సామ్యవాదం కాదని తిలక్‌గారు చెప్పుకున్నా, తన సాహిత్యం నిండా సామ్యవాదులు చిత్రించిన దృశ్యాలనే, సన్నివేశాలనే, సందర్భాలనే చిత్రించారు. స్తబ్ధతా యుగంగా ప్రచారం జరిగిన 1955-65 మధ్య తిలక్ రాసిన ఆరు కవితలు చాలు వారిలోని అభ్యుదయ కవిని గుర్తించడానికి. అవి ఆర్తగీతం (1956), ప్రార్థన (1963), నవత-కవిత (1964), తపాలా బంట్రోతు (1959), సిఐడి రిపోర్టు (1965), మన సంస్కృతి (1965).. ఇవి అప్పటికే కాదు, ఈనాటికి మన సమాజంతో, మన సాహిత్యంతో ప్రాసంగికత కలిగి ఉన్నాయి. 'ఆర్తగీతం'లో కవి చూసిన దృశ్యాలు 'కవితా! ఓ కవితా!'లో శ్రీశ్రీ గారికి కనిపించిన దృశ్యాలను తలపిస్తాయి: "నా దేశాన్ని గురించి పాడలేను../ ఒక్క నిరుపేద వున్నంత వరకు/ ఒక్క మలినాశ్రుబిందు వొలకినంతవరకు/ ఒక్క ప్రేగు ఆకలి కనలి నంతవరకు" అని 65 ఏళ్ళ క్రితం అన్నారు తిలక్. దేశం వెలిగిపోతోంది, అంతా బావుంది, స్వర్ణ భారత్, స్వచ్ఛ భారత్ వంటి ఆకర్షణీయమైన స్వీయ ముద్రలనడుమ కరోనా కాలంలో లాక్‌డౌన్ సడలింపు నేపథ్యంలో ఆరు వారాలు పనిలేక తిండి దొరక్క, నగరాల నుండి స్వస్థలాలకు రోడ్లమీదికి వచ్చి కాలి నడకన బయలుదేరిన 15 కోట్ల మంది వలస కూలీలను చూస్తే తిలక్ నిరసనకు మనకు ఉన్న సంబంధం అర్థమౌతుంది. "ఏ వెలుగులకీ ప్రస్థానం" అని శ్రీశ్రీ ప్రశ్నించినట్లు "ఈ ఆర్తి ఏ సౌధాంతరాలకు పయనింప గలదు" అని తిలక్ ప్రశ్నించారు.

"దేవుడా! రక్షించు నా దేశాన్ని.../ లక్షలాది దేవుళ్ళ నుండి/ వారి పూజల నుండి/ వారి వారి ప్రతినిధుల నుండి" అని తిలక్

అయిదున్నర దశాబ్దాల క్రితం చేసిన ప్రార్థన అప్పటి కన్నా ఇప్పటి మన సమాజానికి బాగా నప్పుతున్నది. ఈ కవితలో కవి పేర్కొన్నవారు ఇప్పుడు కుప్పలు తెప్పలుగా పెరిగిపోయి శాసించే దశకు చేరుకున్నారు. ఇది తిలక్ ముందు చూపు. "మాకు నటనలు వద్దు" అన్నాడు కవి. ఈ నటననే తర్వాత దిగంబర కవులు ఎండగట్టింది. ఇప్పుడు నటనే రాజ్యమేలుతున్నది. గిరీశాలు ఇప్పుడు ఎందెందు వెదకి చూచిన అందందే కనిపిస్తున్నారు. "బ్రతుకు పొడుగునా స్వతంత్రం" కావాలని కోరుకున్నారు తిలక్ గారు. ఈ మాట ఇప్పటికీ అవసరమే.

"మనగలిగినదీ/ కాలానికి నిలబడగలిగినదీ/ వద్దన్నా పోదు.../ మనుశిక్షాస్మృతికి/ గౌరవం లేదని వీరికి లోపల దిగులు.../ అయిదు ఖండాల మానవ సంస్కృతి/ అఖండ వసుధైక రూపాన్ని ధరిస్తోందనీ/ గ్రహించలేరు పాపం వీరు"– ఈ మాటలు గత కొంత కాలంగా మన సమాజంలో నెలకొన్న పిడివాద పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయి. "గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్" అని నమ్మే వాళ్ళకు, "మంచి గతమున కొంచెమేనోయ్" అని నమ్మే వాళ్ళు శత్రువులుగా కనిపిస్తున్నారు. అణచివేయవలసిన వాళ్ళుగా కనిపిస్తున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నివారించడానికి భౌతిక దూరం పాటించమని తెలిసిన వాళ్ళు సూచిస్తే, ఇదే అదను అనుకొని 'చూశారా! మా పూర్వీకులు చెప్పిందే ఇప్పుడు ప్రపంచానికి ఆదర్శమైంది' అంటూ గతకాలపు దుర్మార్గాన్ని పద్యాలుగా రాసి రాగాలు తీసినవాళ్ళని మనం ఇటీవల చూశాం. కవిగా తిలక్‌గారు ఇలాంటివాళ్ళ కన్నా ఎంత ముందున్నారో కదా! వీళ్ళ నుంచే దేశాన్ని రక్షించమని ఆయన ప్రార్థించింది. "కవి ప్రవక్తా కాలం కన్నా ముందుంటారు" అని గురజాడ అన్నది మనం గుర్తు చేసుకోవాలి.

తిలక్ గారు మధ్యతరగతి రచయితగా పేరొందారు. క్రింది తరగతి వాళ్ళను గురించి కూడా ఆయన రాశారు. అయినా ఆయన సాహిత్యంలో 'మధ్యతరగతి మందహాసం' వాస్తవిక రూపంతో ప్రతిబింబిస్తుంది. ఆయన కథలలో ఇది బాగా కనిపిస్తుంది. సీతాపతి కథ, ఆశాకిరణం, నల్లజర్ల రోడ్డు, సుందరీ సుబ్బారావు వంటివన్నీ మధ్యతరగతి కథలే. 'సముద్రపు అంచులు', 'ఊరి చివరి ఇల్లు' వంటి కథలు క్రింది తరగతి జీవిత ప్రతిఫలనాలు.

తిలక్ గారిని 21వ శతాబ్దం యువ రచయితలు, యువ విమర్శకులు అధ్యయం చేయాలి. ఇదివరకే చదివినవాళ్ళు మారిన ప్రపంచ సందర్భంలో కొత్తగా చదవాలి. వాదాలకు లొంగనంతమాత్రాన ఆయన దేనికీ చెందని రచయిత కాదు.

"మతం నల్ల మందు
గతం ముదిమికి విందు" ('న్యూసిలబస్' 1962) ❑

*(ఆగస్టు 1తో తిలక్ శతజయంతి సంవత్సరం ప్రారంభం)*

*ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...*

---

## ద్వేషం లేని దేశం కోసం కావలసింది సయోధ్య

**(3వ పేజీ తరువాయి)**

రామాలయానికి నాటిన తొలి వెండి ఇటుక, ద్వేషం లేని దేశానికి వేసిన బంగారు ఇటుక అయితే మానవత్వం బతుకుతుంది కదా. అయోధ్యకు మించిది సయోధ్య. దేశానికి స్వాతంత్ర్యం రాగానే సోమనాథ్ వివాదాన్ని పరిష్కరించిన సయోధ్యే అయోధ్య వంటి మతభేదాలకు పరిష్కారం అని జనం పరిష్కరించుకోవాలి. మతానికి ప్రభుత్వాలతో న్యాయస్థానాలతో సంబంధం లేదు. అయోధ్య రాజకీయ సమస్య కాదు, రాజకీయం చేయబడిన సమస్య. మతం ప్లస్ రాజకీయం ప్రమాదకరమైన విషమిశ్రమం.

రామాలయంతో రామరాజ్యం వస్తుందని, పాలకులతో సహా ఎవరూ అనుకోవడం లేదు. గ్రామరాజ్యమైనా తెస్తే రాజ్యాంగ లక్ష్యం కొంతమేరకైనా నెరవేరుతుంది.

రామాయణంలో కొన్ని ఘట్టాలపై వివాదాలు విమర్శలు ఉన్నాయి. కాని రాముడు తనకు రాజ్య పట్టాభిషేకాన్ని నిర్ణయించి అన్ని ఏర్పాట్లు పూర్తయి కొన్ని ఘడియల్లో కిరీటం ధరించే సందర్భంలో పినతల్లి, తండ్రి, "కాదు నీకు రాజ్యం లేదు, నగరం లేదు, రాజభవనమూ లేదు, కుటుంబ సాంగత్యమూ లేదు, వెళ్లు అడవుల్లో 14 ఏళ్లు ఉండు" అని ఆదేశిస్తే వనవాసానికి వెళ్లిపోయాడనే ఘట్టాన్ని మాత్రం కాదన్న వారు లేరు. 14 ఏళ్లు ఎందుకంటే రాజ్యాన్ని కోరే కాలపరిమితి దాటించి ఆ అడిగే అధికారాన్ని కూడా తొలగించే శాశ్వతంగా అయోధ్యకు దూరం చేసే ప్రణాళిక అది. అది తెలిసి కూడా వెళ్లిపోయాడు. పొమ్మన్నవారే రమ్మని బతిమాలినా 14 ఏళ్ల దాకా రాలేదు. పుట్టిన స్థలాన్ని, పెరిగిన రాజభవనాన్ని, తను ఎదిగిన నగరాన్ని, రాజ్యాపాలనార్హతను కూడ వదులుకుని అడవులకు వెళ్లిన వ్యక్తిత్వం ఎక్కడా ఏ కథలోనూ మనకు కనిపించదు. "ఇది నీ స్థలం అనడానికి పూర్తి సాక్ష్యాలు లేవు రాంబాబూ, అయినా అక్కడ నీకు ఇల్లు కట్టొచ్చు అని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెబితే, ధన్యోస్మి అని అక్కడికి వచ్చి శాశ్వతంగా ఉండే వ్యక్తిత్వమేనా రాముడది? ఈ మాటను ప్రతి వాడిలోఉండే రాముడిని ఒకసారి అడిగితే బాగుండదూ? ❑



# ప్రజాకళల దారిదీపం

**బి.ఎస్. రాములు**

జనం గొంతుక వంగపండు ప్రసాదరావు గళం శాశ్వతంగా మూగబోయింది. నక్సల్బరీ, శ్రీకాకుళం ఉద్యమ స్ఫూర్తితో ఎదిగిన సీనియర్ తరంలో మరొకరు అమరులయ్యారు. ఉద్యమంతో స్ఫూర్తి పొంది ఉద్యమాలకు ఎదిగి వచ్చిన మహోన్నత కళాకారుడు, మహా కవి, రచయిత వంగపండు. వంగపండు విశాఖపట్నంలో నౌకలు తయారు చేసే కేంద్ర ప్రభుత్వం సంస్థలో ఉద్యోగం చేసేవారు. 'విప్లవాల యుగం మనది విప్లవిస్తే జయం మనది' అని చెప్పిన సుబ్బారావు పాణిగ్రాహి స్ఫూర్తి వంగపండు జీవితాన్నే మార్చేసింది. కళా సాంస్కృతిక రంగాల ద్వారా ప్రజలను చైతన్యం చేయాలని, మధ్యలోనే ఉద్యోగం వదిలేసారు. గద్దర్‌తో పాటు జననాట్యమండలి వ్యవస్థాపకుల్లో ఒకరు. వేలాది కళాకారులను తీర్చి దిద్దారు. వేలాది యువజనులు స్ఫూర్తి పొంది ఉద్యమాల్లో కార్యకర్తలుగా, నాయకులుగా ఎదిగారు. యువకిశోరాలు అమరులవుతుంటే వంగపండు కన్నీరు పెట్టారు. వారి త్యాగాలను ఆయన గానం చేశారు. వంగపండు 400 పాటలు రాశారు. పలు పాటలు పన్నెండు భాషల్లోకి అనువాదమైనాయి. 'కార్మిక విజయం' వంటి అనేక నృత్య నాటికలు ప్రదర్శించారు. వంగపండు ఉద్యోగం వదిలేయడంతో కుటుంబం అతలాకుతలమైంది. ఆ భారమంతా కుటుంబంపై, పిల్లల జీవితాలపై పడింది. సంసారాన్ని ఈదిన విజయలక్ష్మి అక్క ధైర్యం, త్యాగం మరువలేనిది. వంగపండు పాటలు జగత్ ప్రసిద్ధం. వంగపండు పాటల ద్వారా, చెణుకులు ద్వారా, ప్రసంగాల ద్వారా మూఢ విశ్వాసాలను వివరించి, శాస్త్రీయ, హేతువాద దృష్టితో నవ్వించే వారు. దోపిడి, పీడన, అణిచివేత, ఎన్ని రూపాల్లో సాగుతున్నదో అర్థం చేయించేవారు.

1980 నుండి వంగపండు, గద్దర్ సహచరులుగా, అనేక సభలు సమావేశాల్లో కలిసి నడిచాము. రాష్ట్రంలోనే గాక ఢిల్లీ, సింద్రీ అఖిల భారత మహాసభలు, సింగరేణి సభలు, దశాబ్దాలుగా అంకిత భావంతో ఈ దేశంలో సమ సమాజం నిర్మాణం కోసం కృషి చేశారు. దోపిడి, పీడన లేని కార్మిక వర్గ సమత, మమతలు, స్వేచ్ఛా సమానత్వ రాజ్యం కోసం శాస్త్రీయ విజ్ఞానం కోసం సృష్టించారు. కలలు సాకారం కావడానికి జీవితాన్ని అంకితం చేశారు. మేము 1990లో సాయుధ ఉద్యమం నుండి వైదొలగి సమస్త వర్ణ వర్గ కుల లింగ జాతి మత ప్రాంత భాష వివక్షకు వ్యతిరేకంగా దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్య వేదిక నిర్మాణం ప్రారంభించినప్పుడు నైతిక మద్దతు నిచ్చారు వంగపండు. గురజాడ కన్యాశుల్కంపై చర్చ చేసినపుడు మద్దతుగా నిలిచారు. 'జ్ఞానమొకడి సొత్తు కాదన్నా! అది సకల జాతుల సంపదోరన్నా' అని ఎలుగెత్తి చాటారు. బీసీగా తాను ఉద్యమం ఇంటా బయటా ఎదుర్కొన్న వివక్ష అనుభవాలను మాతో పంచుకున్నారు. వంగపండు పాటలు కొన్ని పుస్తకంగా బి నర్సింగరావు ప్రచురించారు. 'కొండ కింది పందికొక్కు' వంటి అనేక కథలు పత్రికలలోనే ఉండిపోయాయి. ఒక నవల కూడా రాసినట్టు గుర్తు. ఆర్ నారాయణ మూర్తి, కమలహాసన్ వంటి సుప్రసిద్ధ నటులు పార్వతీపురం వెళ్ళి మరీ సినిమాలకు పాటలు రాయించుకున్నారు. ఉద్యమ నాయకత్వం, ఇతర మిత్రులు వద్దనడంతో సినిమాలకు రాయడం ఆగిపోయింది. వంగపండు ప్రభుత్వ పురస్కారాలను వద్దనేవారు. వంగపండు లేని లోటు తీర్చ లేనిది. మహా కవిగా, మహా కళాకారుడుగా, ఉద్యమకారుడుగా నమ్మిన ఆశయాలకోసం జీవితాన్ని అంకితం చేసిన వంగపండు సాహిత్య సాంస్కతిక రంగాలలో చిరంజీవి. వందలాది పాటలతో, వేలాది కళా ప్రదర్శన లతో కొన్ని తరాలకు స్ఫూర్తి నిచ్చారు.

ఉత్తరాంధ్ర గద్దర్‌గా ప్రసిద్ధి చెందారు. వంగపండు చరిత్ర ఉద్యమాలతో ముడిపడి ఉంది. ఆయన చరిత్ర ఉద్యమ చరిత్రలో భాగం. వంగపండు సాహిత్య సాంస్కృతిక ఆకాశంలో వేగు చుక్క. ఒక మహోన్నత మానవుడు. ప్రజాసాహిత్యం, ప్రజాకళల్లో వంగపండు కలకాలం వెలుగు దీపంగా దారి దీపంగా నిలిచి ఉంటాడు. వంగపండు ప్రసాదరావు పేరిట విశాఖ, అమరావతి, కర్నూలు, తిరుపతి కేంద్రాలలో ఆడిటోరియాలు కట్టి, కళాకారులకు ఆయన పేరిట స్కాలర్ షిప్‌లు, పెన్షన్లు ఇవ్వాలి. కళాకారులకు ప్రత్యేక ఉద్యోగ కల్పన ద్వారా ఆయన స్ఫూర్తిని సమాజానికి అందించాలి. వంగపండు పేరిట విశ్వ విద్యాలయాల్లో ప్రజా కళలు, జానపద కళల అధ్యయన పీఠాలు నెలకొల్పడం ఆయనకు అర్పించగలిగే ఘన నివాళి. ❑

# ప్రజాకవి, జానపద శిఖరం వంగపండు

**వాడ్రేవు చిన వీరభద్రుడు,** IAS
డైరక్టర్ పాఠశాల విద్య



చాలా ఏళ్ళ కిందటి సంగతి. రాజమండ్రిలో పని చేస్తున్నప్పటి రోజులు. అప్పట్లో బెంగాల్ నుంచి ఒక విప్లవ రచయితల బృందమొకటి ఏ కారణం చేతనో రాజమండ్రిలో కొన్నాళ్ళున్నారు. బహుశా తలదాచుకున్నారేమో, తెలీదు, కాని అట్లాంటి బృందమొకటి అక్కడికి వచ్చినట్లు మా మిత్రులకి ఎట్లా తెలిసిందో ఏమో గానీ, వాళ్ళని పోయి కలిసారు.



ఆ తర్వాత చాలా రోజులు రాత్రిపూట సాహిత్య చర్చలు జరుగుతుండేవి. ఒకసారి అట్లాంటి గోష్టికి నన్ను కూడా తీసుకెళ్ళారు. నేను వాళ్ళని చూడగానే వాళ్ళతో ఎట్లా మాటలు కలపాలా అని ఆలోచించి, వాళ్ళు విప్లవకవులు కాబట్టి, టాగోర్ గురించి ప్రస్తావించి లాభం లేదనుకుని, నజ్రుల్ ఇస్లాం గురించి నాకు తెలిసిందేదో చెప్పబోయాను. ఊరు కాని ఊళ్ళో, తమ భాష కాని భాష మాట్లాడేవాళ్ళ మధ్య తమ కవి గురించిన ప్రస్తావన వచ్చినందుకు వాళ్ళల్లో ఆశ్చర్యం గాని, సంతోషంగానీ ఏమీ కనిపించలేదు. నేను చెప్పాలనుకున్న నాలుగు మాటలూ చెప్పేదాకా ఆగి, ఆ బృంద నాయకుడు అన్నాడు కదా 'నజ్రుల్ ఏనాటి మాట! ఈ మధ్య మేమొక గీతం విన్నాం. ఆ కవి ఎవ్వరో తెలీదు, ఏ భాషకి చెందిన కవినో తెలీదు, కాని ఎట్లాంటి కవిత! కవిత రాస్తే అలా ఉండాలి! అట్లాంటి కవిత బెంగాలీలో పుట్టాలంటే ఇంకా ఎన్నేళ్ళు పడుతుందో' అంటూ ఒక కవిత బెంగాలీలో వినిపించాడు. ఆ కవిత వింటోనే నాలో ముందేదో జ్ఞప్తిలో కదలాడి, ఆ పైన తెలియని ఒక ఉద్విగ్నత ఒళ్ళంతా విద్యుచ్ఛక్తిలాగా కదలాడింది.

'కష్ట జీవులం, మేం కమ్యూనిష్టులం
ఎవరన్నా ఏమన్నా అదే ఇష్టులం.'

అనిసెట్టి సుబ్బారావు గేయం

తెలుగులో ఆ గీతాన్ని చాలామంది చదివి ఉండవచ్చుగానీ, నజ్రుల్ ఇస్లాంని కూడా మరిపించేటంతటి సముజ్జ్వల గీతంగా దాన్ని కీర్తించే వారుంటారని ఊహించి ఉండరు.

బహుశా నేడు అనేక భారతీయ భాషా సాహిత్యాల్లో, పీడిత ప్రజలు పోరు బాట పట్టక తప్పని ప్రతి చోటా, వంగపండు ప్రసాదరావు అటువంటి కవిగా గుర్తింపబడుతూ ఉండవచ్చు. మనిషి ఒక పాటగా మారే అత్యంత అపురూపమైన సామాజిక సందర్భం మన కళ్ళముందే సంభవిస్తున్నా కూడా వంగపండుని ఒక ప్రజా గాయకుడని పేర్కోడాన్ని మించి మనం అతడికీ, అతడి పాటకీ ఇవ్వవలసిన గౌరవాన్ని ఇవ్వకుండానే ఇన్నాళ్ళూ గడిపేసాం.

మామూలుగా ఒక కవి మన మధ్యనుంచి నిష్క్రమించిన తర్వాతనే మనం మన రాగద్వేషాల్నీ, ఉదాసీనతనీ విడిచిపెట్టి, అతడి కవిత్వ మూల్యాంకనం మొదలుపెడతాం కాబట్టి, బహుశా ఇవాల్టి నుంచీ వంగపండు కవిత్వం గురించిన నిజమైన అంచనా మొదలవుతుందని ఆశిద్దాం. ఉదాహరణకి, అతడి పేరు తలవగానే ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చే, "ఏం పిల్లో ఎల్దమొస్తవా, ఏం పిల్లడో ఎళ్దమొస్తవా" అన్న పాటనే తీసుకోండి. దేశంలోనూ, ప్రపంచంలోనూ సంభవిస్తున్న అన్ని రకాల పోరాటాల్నీ ఒక్కచోట, ఒక్కసారిగా తలుచుకోవడం కోసం తానా గీతం కూర్చానని చెప్పుకున్నాడాయన. అంటే ఒక విధంగా 1950 ల తర్వాతి దేశ చరిత్ర అంతా ఆ పాటలో ఉంది. కాని ఆ పాట మీద ఒక సవివరమైన విశ్లేషణ, వ్యాఖ్యానం ఏదీ కూడా ఇప్పటిదాకా ఎక్కడా ఎవరూ రాసినట్టు నేను చూడలేదు.

ఉత్తరాంధ్రలో వినవచ్చే ఒక జానపద బాణీని ఆధునీకరిస్తూ తానా గీతం కట్టానని ఆయన చెప్పాడు. ఆ జానపద గీతాన్ని ఆయన ఏ విధంగా ఆధునీకరించాడు, దాని జానపద, ప్రజారంజక లక్షణాల్ని ఏ మేరకు నిలిపాడు, ఏ మేరకు ఆ రంజకత్వంలోని వైయక్తిక, గ్రామీణ అంశాల స్థానంలో సామూహిక, చారిత్రిక అంశాల్ని చొప్పించాడు, అందుకు ఆయన ఎటువంటి నిర్మాణ వ్యూహాలు అనుసరించాడు, గాయకుడిగా సరే, జననాట్యమండలి కళాకారుడిగా సరే, అసలు ఒక కవిగా, శిల్పిగా ఆయన ఆ గీతరచనలో కనపరిచిన మౌలికమైన ప్రజ్ఞ ఏమిటి అన్నదాని మీద ఎంత చర్చ జరిగి ఉండాలి ఇప్పటిదాకా!

బహుశా ప్రపంచంలోని మరేదో భూభాగం నుంచి, ఒక సైప్రస్ నుంచో, ఒక క్రొయేషియా నుంచో, ఒక కాంగో నుంచో, ఒక శ్రీలంక నుంచో ఎవరో ఒక సాహిత్య విద్యార్థి ఈ అంశం మీద సమగ్రంగా పరిశోధన చేసి మనకి చెప్పేదాకా మనం ఈ పాటని కూడా చాలా సినిమా పాటల్లో ఒకటిగా వింటో విన్నంతసేపూ పులకిస్తూ, విన్నాక పక్కన పెట్టేస్తూ ఉంటాం.

వంగపండు రాసిన ప్రతి పాట మీదా, ఆ మాటకొస్తే గద్దర్ రాసిన ప్రతి పాట మీదా కూడా ఇట్లాంటి విశ్లేషణా, విమర్శా రావాలని కోరుకుంటాను. వారు రాసిన కొన్ని పాటల పల్లవులు విన్నప్పుడు, మహనీయులైన పూర్వ వాగ్గేయకారుల పల్లవులు విన్నప్పటిలానే నిశ్చేష్టుణ్ణవుతూ ఉంటాను. పాటకి పల్లవి ప్రాణం అని ఊరికే అనలేదు. పల్లవి అంటే ఒక కవి గుండె తెరుచుకునే చప్పుడు. కొన్నిసార్లు అతడి గుండె బద్దలయ్యే చప్పుడు కూడా.

'నిధి చాలా సుఖమా, రాముని సన్నిధి సుఖమా'

అనే పల్లవి త్యాగరాజాత్ములైన వారిని ఎట్లా సంభ్రమపరుస్తుందో

'నీ పాదము మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా
తోడబుట్టిన ఋణం తీర్చుకుంటనే చెల్లెమ్మా'
కొండలు పగలేసినం, బండలను పిండినం
మా నెత్తురె కంకరగా ప్రాజెక్టులు కట్టినం
శ్రమ ఎవడిదిరో
సిరి ఎవడిదిరో

అనే పల్లవులు ఎంత విద్యుత్తును సృష్టిస్తాయో

"యంత్రమెట్లా నడుస్తు ఉందంటే ఓరన్నో లచ్మీ రైలూ లారీ కారూ బస్సూ మిల్లూ మిషనూ, మోటారు సైకిలు యంత్రమెట్లా నడుస్తు ఉందంటే.."

అనే పాట మొదలుకాగానే నా వళ్ళంతా విద్యున్మయం కాకుండా ఉండలేదు. అయితే, ఆ పల్లవి ఆయనకెట్లా స్ఫురించిందో ఆ ఆల్కెమీనీ మనం వివరించలేకపోవచ్చుగానీ, ఆ పల్లవిని ఆయన నిర్మించిన తీరు నిస్సందేహంగా మనం మరింత మరింత అధ్యయనం చెయ్యవలసిన అంశం కాదా.

పల్లెటూర్లలో పంటలు ఇంటికొచ్చినప్పుడు జంగాలు ఇంటింటికీ తిరిగీ పాడుకునే ఒక జంగం పాట బాణీలో షిప్ యార్డు కార్మికుల కోసం రాసిన ఆ పాటలో ఒక ఫిట్టరుగా వంగపండు కార్మికానుభవం మాత్రమే కాదు, శిల్పిగా ఆయన కనపరిచిన అసామాన్యమైన నిర్మాణ కౌశల్యం గురించి కూడా మనం గురించవలసి ఉంటుంది. ఇంతకీ శిల్పి అంటే ఏమిటి? Fitter of words మాత్రమే కదా. గాయకుడంటే ఎవరు? Fitter of sounds నే కదా.

కవిత్వం వసంతం లాంటిది, అది అన్ని వేళలా అందరిమీదా వాలదు. శ్రీశ్రీకి ఈ రహస్యం తెలుసు. ఆయన కవిత్వం రాయడం మొదలుపెట్టినప్పుడు అది చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిమీదా, కృష్ణశాస్త్రి మీదా, విశ్వనాథ మీదా వికసిస్తుండటం చూసాడు. తన జీవిత చరమదినాల్లో అది చెరబండురాజులోనూ, వంగపండులోనూ వికసిస్తున్నదని గుర్తుపట్టాడు. 'జంగమదేవర్ల గంటల చప్పుళ్ళల్లో నేను నా కవిత్వాన్ని వెతుక్కున్నాను 'అని ఆయనొక చోట రాసుకున్నాడు గాని, అది ఆయనకి ఒక కల మాత్రమే. నిజంగా జంగం దేవర్ల పాటల్లోంచి కవిత్వం తెచ్చుకోవడమెలా ఉంటుందో వంగపండుని చూసాకే ఆయనకి అర్థమయింది.

బహుశా ప్రపంచంలోని ఏ భాషలోనూ లేనంతమంది శక్తిమంతులైన ప్రజాగాయకులు నేడు తెలుగు భాషలో మాత్రమే కనవస్తున్నారు. నా మాటమీద అనుమానం ఉన్నవాళ్ళు, protest song గురించిన సమాచారం నెట్‌లో శోధించి చూడవచ్చు. తక్కిన నేల కన్నా తెలుగు నేల మరిన్ని పోరాటాల పురిటిగడ్డ అని నేను చెప్పలేను గానీ, పోరాటాన్ని పాటగా మార్చగలిగే ఒక సౌలభ్యం, ఒక వేగం, ఒక సంప్రదాయం తెలుగు సాహిత్యంలో పుష్కలంగా ఉంది. తెలుగులో ఒక కవి ప్రయత్నం మీద పద్యకవి కాగలడు, చాలా కష్టపడితే మంచి వచనకవి కాగలడు, కాని అప్రయత్నంగా ఒక గీతకారుడు కాగలడు. కావలసిందల్లా కొంత తడి గుండె. అటువంటి గుండె కనుక ఉంటే, నండూరి సుబ్బారావు లాంటి వకీలుకి కూడా ఒక సాయంకాలం ట్రాము బండిలో ఇంటికొస్తున్నప్పుడు 'గుండె గొంతుకలోన కొట్లాడటం' అప్రయత్నంగా అనుభవంలోకి వస్తుంది. ఇక అతడు వంగపండు ప్రసాద రావే అయితే, అతడి పార్వతీపురం నేపథ్యం, శ్రీకాకుళం పురిటినొప్పులు అతణ్ణొక అసమాన కవిగాయకుడిగా మార్చేస్తా యనడంలో ఆశ్చర్యమేముంది!

పార్వతీపురం గిరిజన ప్రాంతాల్లో పనిచేసే అదృష్టానికి నోచుకున్నవాడిగా, వంగపండు గీతాలు అక్కడి నేల మీద నేనెన్నోసార్లు విన్నాను. పాఠశాలల్లో పిల్లలు మొదలుకుని, గ్రామాల్లో కళాకారులదాకా భూమిబాగోతం ప్రదర్శించగా చూసాను. బహుశా భూషణంగారో మరెవరో పరిచయం చేయగా వంగపండుని ఒకసారి కలుసుకోగలిగాను. కాని, ఆయన కవిత్వాన్ని అధ్యయనం చేయవలసినంతగా అధ్యయనం చేయలేదని మాత్రం ఇప్పుడు గ్రహిస్తున్నాను.

పాట చాలా చిత్రమైనది. ఒకరికి అది జయమాల, మరొకరికి ఉరితాడు. ఒకరినది అందలమెక్కిస్తుంది. పద్మశ్రీ, పద్మవిభూషణుల్ని చేస్తుంది. మరొకరిని ప్రవాసానికీ, కారాగారానికీ పంపిస్తుంది. కాని, శ్రోతల్ని మాత్రం ఒక్కలానే పరవశింపచేస్తుంది. గీతకారుడికి పాటనుంచి ఏమి దక్కుతుందనేది అతడి సామాజిక-రాజకీయ సందర్భాన్ని బట్టి ఆధారపడుతుంది. కానీ, జాతికి మాత్రం ఆ పాట మిగులుతుంది. గీతకారుడి సుఖసంతోషాలూ, కష్టనష్టాలూ పాటగా మారి ఆ పాట విన్న ప్రతి ఒక్క గుండెలోనూ గూడుకట్టుకోవడం మొదలుపెడతాయి.

తెలుగు భాష, తెలుగు పాట, తెలుగు శ్రోత ఉన్నంతకాలం వంగ పండు చిరంజీవి...." ❑

# మార్క్సిజం నుంచి దళిత బహుజనం దాకా..



**ప్రొ॥ కంచ ఐలయ్య,** షెపర్డ్
డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

## నివాళి

ఉసాగా తెలుగు రాష్ట్రాల్లో అందరికీ సుపరిచితుడైన ఉ. సాంబశివరావు (1950 –2020) హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో కరోనా వైరస్‌కు చికిత్స చేయించుకుంటూ శనివారం వేకువజామున కన్నుమూశారు. వేలాది మంది తన అభిమానులు, అనుయాయులకు కనీస సమాచారం తెలియకుండానే ఆయనను కోవిడ్–19 వైరస్ బలి తీసుకుంది. దళిత– బహుజన వర్గాలకు, ఆయన అభిమానులకు ఇది కచ్చితంగా అశనిపాతం లాంటి వార్తే అవుతుంది. తెనాలి సమీపంలోని కుగ్రామంలో ఒక నాయిబ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన ఉసా 1960ల ప్రారంభంలో తెనాలి డిగ్రీ కాలేజీలో యువ విద్యార్థిగా ఉంటున్నప్పుడు హేతువాదిగా జీవితం ప్రారంభించారు. నక్సల్బరీ ఉద్యమం బద్దలయ్యాక ఉసా కమ్యూనిస్టు విప్లవ సిద్ధాంతం వైపు ఆకర్షితులై తరిమెల నాగిరెడ్డి పార్టీలో చేరారు.

బహుముఖ ప్రతిభాపాటవాలతో ఉసా సిద్ధాంతకారుడిగా, రచయితగా, గాయకుడిగా పరిణమించారు. సాయుధపోరాటం వైపు మొగ్గుచూపి తూర్పుగోదావరి జిల్లా కొండమొదలు గిరిజన విముక్తి పోరాటంలో పాల్గొనడానికి వెళ్లి 1980ల వరకు అక్కడే నివసించారు.

తెలంగాణలో ప్రత్యేకించి నల్లగొండ జిల్లాలో తీవ్రమైన కరువు వ్యాపించడంతో తాగునీరు, సాగునీరు సౌకర్యం కల్పించాలనే డిమాండుతో మోత్కూరు రైతులను సంఘటితం చేసేందుకు బాధ్యతలను చేపట్టారు. మోత్కూరులోనే అయిదేళ్లు నివసించిన ఉసా కులంతో పని లేకుండా రైతు కుటుంబాల్లో ఒకరిగా కలిసిపోయారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అనేక వ్యవసాయ సమస్యలపై వేలాదిమందిని కదిలించారు.

అదే సమయంలో 1985లో కారంచేడు దళితులపై హత్యాకాండ ఘటన జరిగింది. ఉసా శషభిషలు లేకుండా దళిత్ మహాసభ, దళిత ఉద్యమం వైపు నిలిచాడు. తనతో విభేదించిన యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్) తర్వాత ఉసాను పార్టీ నుంచి బహిష్కరించింది. ఉద్యమంలో తనతో పాటు పనిచేసిన సహచరితో పాటు బయటకు వచ్చిన ఉసా ఆనాటి నుంచి సామాజిక సంస్కరణల్లో, కుల వ్యతిరేక పోరాటాల్లో పాల్గొంటూ వచ్చారు. శ్రీకాకుళం జిల్లాలోని లక్ష్మీపేట దళితులపై వేధింపు ఘటన చోటు చేసుకున్నప్పుడు కే.జీ. సత్యమూర్తితో కలిసి అక్కడి శిబిరంలో పాలుపంచుకున్నారు.

ఆ తర్వాత 1987–89 మధ్య కాలంలో మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రత్యేకించి కృష్ణానది గట్టుపై ఉన్న గ్రామాల్లో కరువుబారిన పడిన ప్రజలకు సహాయం చేసే కృషిలో నాతో పాటు పనిచేశారు. ఆ గ్రామాల్లో తోటి కార్యకర్తలతో కలిసి రెండున్నర సంవత్సరాలు గడిపి ప్రజల బాగోగులు పట్టించుకున్నారు. ఈలోగా మండల్ ఉద్యమం పొడసూపింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఓబీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ప్రజలను కూడగట్టడంలో ఉసా అత్యంత క్రియాశీలక పాత్ర పోషించారు. కేజీ సత్యమూర్తి మావోయిస్టు పార్టీ నుంచి బయటకి వచ్చాక ఇరువురూ కలిసి 'ఎదురీత' పత్రిక స్థాపించారు. అటు మార్క్సిజం, ఇటు అంబేద్కరిజం రెండింట్లోనూ ఉసా కీలకమైన సిద్ధాంతవేత్తగా, గొప్ప వక్తగా పరిణమించారు. ఆయన రచనలు, ప్రసంగాలు మారోజు వీరన్న వంటి విప్లవోద్యమ కార్యకర్తలను సైతం ప్రభావితం చేశాయి. తెలంగాణ మలి దశ ఉద్యమం మొదలైంది. ఉసా ఆంధ్రప్రాంతంలో కూడా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలపరుస్తూ అనేక సమావేశాలు నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు సీపీఎం మద్దతుతో ఏర్పడిన టి–మాస్, బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్‌లో ఉసా భాగమయ్యారు.

కులాంతర వివాహాలకు ఉసా గొప్ప మద్దతుదారు. తాను స్వయంగా పార్టీలో పనిచేస్తున్న బ్రాహ్మణ కార్యకర్త పద్మను వివాహమాడారు. కొన్నేళ్ల క్రితం ఆమె చనిపోయారు. తమ ఏకైక కుమార్తెను చక్కగా చదివించారు. పార్టీనుంచి బయటకొచ్చాక పద్మ ఉద్యోగం చేయడం మొదలెట్టి సహచరుడికి మద్దతుగా నిలిచారు. సూరేపల్లి సుజాతతో కలిసి బహుజన సాంస్కృతిక సంస్థను ప్రారంభిం చిన ఉసా భావజాల ప్రచారం కోసం దేశి–దిశ అనే పేరిట యూట్యూబ్ ఛానల్ మొదలెట్టారు. కులపరమైన అత్యాచార ఘటనలు ఎక్కడ జరిగినా మొట్టమొదటగా అక్కడికి వెళ్లేవారు. స్వయంగా అనేక కులాంతర వివాహాలను జరిపించారు. మహిళల హక్కులు, సమానత్వం పట్ల తాను చూపిన నిబద్ధత

☞ మిగతా 28వ

# కుల, వర్గ జమిలి పోరాట సిద్ధాంతకర్త ఉసా



**సుజాత సూరేపల్లి**
సామాజిక కార్యకర్త 'దేశి దిశ' పత్రిక ఎడిటర్

## స్మరణ

ఉ.సా (ఉప్పుమావులూరి సాంబశివరావు 1951–2020) తెలుగు రాష్ట్రాలలో, మార్క్సిస్టు లెనినిస్ట్, బహుజన ఉద్యమాలలో పరిచయం అక్కర్లేని పేరు. ఆయన గురించి ఒక్క వ్యాసంలో, ఒక్క మీటింగ్‌లో చెప్పడం, రాయడం అసాధ్యమైన పని. ఒక విధంగా అది ఒక పెద్ద సాహసం అనే చెప్పాలి. జీవితాంతం ప్రజా ఉద్యమాలని నమ్మి, ఆ క్రమంలో అనేక ఉద్యమ శ్రేణులని కలిసి, ఉద్యమాలని నిర్మించి, ఉద్యమకారులని తయారు చేసిన ఆయన ఒక్కో సమయంలో, ఒక్కో సందర్భాన్ని బట్టి తీసుకున్న చారిత్రకమైన నిర్ణయాలు నేటి తరం వాళ్ళకి చాలా సులువుగా ముందుకు పోవడానికి దోహదపడుతున్నాయి.



**ఉ.సా. (ఉప్పుమావులూరి సాంబశివరావు)**

ఉసా స్వస్థలం బ్రాహ్మణ కోడూరు, బాపట్ల తాలూకా, గుంటూరు జిల్లా. అయినా తెలంగాణలో ఉంటూ, అనేక పోరాటాలలో భాగస్వామి అయి, తనదంటూ ఒక శైలి, బాణీ, సిద్ధాంతం నిలుపుకున్నవాడు. ఒకే మనిషిలో ఇన్ని పార్శ్వాలుండడం చాలా అరుదు. అది కూడా ఒక బహుజన జీవితాల నుంచి ఎదిగిన వ్యక్తిలో. కవి, గాయకుడు, రచయితా, కార్యకర్త , సిద్ధాంత కర్త, పరిశోధనా కారుడిగా విప్లవోద్యమాల నుండి కుల ఉద్యమాల వరకు అనేక చారిత్రక అనుభవాల సారాన్ని ఒడిసిపట్టుకున్న మహా మేధావి. ఉద్యమాలకారులకి, ఉద్యమాలకి దశ దిశా చూపిన గురువు. విద్యార్థులకి, కుల సంఘాలకి, ప్రజా, రాజకీయ సంఘాలకి రాజకీయ తరగతులని, పూలే అంబేద్కర్ సిద్ధాంతాలని భోదిస్తూ ఉద్యమాల ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకున్నాడు. మాట ప్రాస, లోతైన అవగాహన, ఆయనకున్న భాష పై పట్టుని తెలియచేస్తాయి.

ఉసా తెలుగు నేలపై అడుగిడని నేల, సృజించని సామాజిక అంశాలు ఉన్నాయంటే అనుమానమే నాకు. కొండమొదలు గిరిజనుల భూ పోరాటం నుండి నిన్నటి నల్లమల యురేనియం తవ్వకాలు, గ్రానైట్ తవ్వకాలలో మాయం కానున్న కరీంనగర్ సర్వాయి పాపన్న గుట్టలు, పౌరసత్వ చట్టం, కాశ్మీర్, రామజన్మ భూమి అంశం వరకు ఆయన ప్రయాణం సాగుతూనే ఉంది. కుల నిర్మూలనకి సంబంధించిన ఏ పోరాటం అయినా, ఎంత కష్టం అయినా ఎప్పుడూ ముందుండే నడిపించేవాడు. నేను 'ఉసా సార్' (నేను ఇష్టంగా, గౌరవంగా పిలిచే పేరు) గురించి నాలుగు ముక్కలు రాయడం అంటే కేవలం నాకు పరిచయం ఉన్న మేరకు మాత్రమే రాసే సాహసం చేయగలను. నాలాంటి శిష్యులు ఎందరో. కానీ తానెప్పుడూ బొటన వేలు దక్షిణ అడగలేదు. నాకంటే ముందుగా అనేక ఉద్యమాలలో అనేక మంది రచయితలని, సామాజిక కార్యకర్తలని, నాయకులని తయారు చేశారు. వాళ్ళందరూ వాళ్ళ వాళ్ళ ఉద్యమానుభవాలను రాస్తే బహుశా ఒక చరిత్ర క్రమం తయారవుతుంది. నిర్మాణం జరుగుతుంది. ఒక్కో కాలానికి, ఒక్కొక్క ప్రాంతానికి, నాయకులని తయారు చేసిన ఘనత, మిగిల్చి పోయిన అనుభవ పాఠాల గౌరవం ఉసా సార్ కే దక్కుతుంది.

నేను రాసే ఈ కొద్దీ మాటలు సముద్రంలో నీటి బిందువు లాంటి ప్రయత్నం మాత్రమే. ఎవరు రాసినా సంక్షిప్త అనుభవం లోంచి మాత్రమే రాయగలరేమో. అయితే మొదటి నుండి చివరి వరకు పరిచయం ఉండి పని చేసి, పరిశోధిస్తున్న వాళ్ళు సమగ్రంగా రాసే వీలుంటుంది.

### గాయకుడు, కవి :

ఉసా ఉద్యమ క్రమాన్ని, జీవితాన్ని తెలంగాణ ఉద్యమానికి ముందూ తరువాత 1986కి ముందు తరువాత అంటే కారంచేడుకి ముందు తరువాతగా ఉసా గారిని చూస్తే బాగుంటుందేమో. మొదట తరిమెల నాగిరెడ్డి గారికి కొరియర్‌గా పని చేస్తూ ఎమర్జెన్సీలో జైలు జీవితం(1975) గడిపేటప్పుడే జైలులో తనని నేరస్తుడిగా అక్కడ అందరూ చూస్తున్నప్పుడు 'మేమెందుకిలా మారామో తెలుసా...? అన్న పాటని జైలు గోడల మీద రాసి పాడితే అక్కడ ఉన్న వాళ్ళందరూ కదిలిపోయి బాగా చూసుకున్నారు అని ఈ మధ్య కాలంలో రాజమండ్రి దగ్గర బక్కి

శ్రీను అనే దళితుడిని మామిడికాయలు దొంగతనం చేశాడన్న నెపంతో చంపి వేసినప్పుడు నిజ నిర్ధారణ కోసం వెళ్ళినప్పుడు చెప్పారు. పాత రోజులు గుర్తుకు తెచ్చుకుని అప్పుడప్పుడు బాగా పాటలు పాడేవారు.

ఉస్మానియా యూనివర్సిటీలో బీఫ్ ఫెస్టివల్ జరుగుతున్నప్పుడు విద్యార్థులకి మద్దతుగా వెళ్లడం, 'ఆహార సంస్కృతి' గురించి అయన చెప్పే అద్భుత విశ్లేషణ వేరే వారికి చెప్పడం సాధ్యం కాదు. ఒకసారి అయన ఉపన్యాసం వింటే ఇంకా మరిచిపోవడం అంటూ కుదరదు ఎవరికైనా. ఎపుడో రాసిన 'ఎద్దు కూర తిన్నోడే భలే ముద్దు ముద్దుగున్నాడే' పాట పాడేవాడు. ఆయన పాటలు, నాటక రచనలు పుస్తకంగా తీసుకురావాల్సి ఉంది. ఇంకా అందరికీ నచ్చిన, చాలా ప్రాచుర్యంలోకి వచ్చిన పాట 'జోలాలి పాడాలి ..'. రైతాంగ గిరిజన పోరాటాలు, వెట్టి చాకిరీ, తెలంగాణలో కరువుపై పని చేసిన ఉసా అనుభవం కారంచేడు నుండి కులం వైపు మళ్లిందని చెపుతుంటాడు.

1985 'కారంచేడు దళితులపై అగ్రకుల 'కమ్మ' భూస్వాముల మారణ కాండ' అని కరపత్రం తెచ్చినందుకు, 'కమ్మ' భూస్వాముల దాడి అని కులం ప్రస్తావన తెచ్చినందుకే ఆయనని పార్టీ నుండి (యూ.సి. సి.ఆర్. ఐ (ఎం ఎల్ ) బహిష్కరించారన్నది అందరికీ తెలిసిన విషయం. చాలాసార్లు ఆయన మాతో పంచుకున్నారు.

సాధారణంగా ఒక సిద్ధాంతాన్ని నమ్మి, దాంట్లో ఇమిడే అంశం వచ్చినప్పుడు మాత్రమే అక్కడికి పోయి, పాల్గొని, స్పందిస్తారు చాలామంది. కానీ ప్రతి అంశం కూడా అన్ని కోణాలలో చూడాలని, విడిగా ఏది ఉండదని ముందుకు పోయే దృక్పథం ఉసా సార్ కి మాత్రమే ప్రత్యేకం. ఒక సంస్థలో విభేదించి కానీ, అనేక కారణాల వల్ల కానీ బయటకి వచ్చిన వాళ్ళు అప్పటి వరకు తాము నమ్ముకున్న సిద్ధాంతం మీద దుమ్మెత్తి పోస్తూ ఉంటారు. కానీ సార్ ఎప్పుడు విప్లవ పార్టీల గురించి సద్విమర్శనే చేసేవాడు కానీ తప్పుగా కానీ, అవసరం లేదని కాని ఎప్పుడు ఎవరికీ చెప్పలేదు.

ఉసా తో దాదాపు రెండు దశాబ్దాల పరిచయం. కానీ పోలేపల్లి 2007 ప్రత్యేక ఆర్థిక మండల్లపై జరిగిన భూ పోరాటం నుండి ఇప్పటి వరకు దాదాపు కలిసే పని చేస్తున్నాం. మాలాంటి వాళ్లకి ఉద్యమ తీరుతెన్నులు చెపుతూ, ఉద్యమ క్రమంలో రాజ్యంతో, ఇతర సంఘాలతో సమస్యలు ఎదురైనప్పుడు ఆయన తనకున్న అపార అనుభవంతో చాలా సులువుగా సమాధానం చెప్పేవారు. అట్లా మాలాంటి వాళ్లకి, ఉద్యమాలకి పెద్ద దిక్కు అయినాడు. మాలాంటి వాళ్లకి సైద్ధాంతిక అవగాహన, ఉద్యమ నిర్మాణం, ముందు తరువాత చేసే పనులు అన్నిటిలో ఉసా గారున్నారు. ఆయన నిరంతరం చాలా ఉత్సాహంగా ఉండటానికి కారణం వ్యక్తిగత జీవితం నుండి కాక ప్రజలని, ఉద్యమాలని విపరీతంగా ప్రేమించడమే కారణం కావచ్చు. కుల నిర్మూలన దృక్పథం లేనిదే ఈ దేశంలో ఏ ఉద్యమం ఫలితాలివ్వదని బలంగా నమ్మిన వారు ఉసా. దాని కోసం అన్ని ఉద్యమ శ్రేణుల్ని ఐక్యం చేయడానికి నిరంతరం శ్రమించాడు.

ఆయన ఉద్యమ ప్రయాణం మొదట నాస్తిక వాదం. తరువాత హేతువాదం. మావో వాదం నుండి పూలే, అంబేద్కర్ వాదం వరకు వచ్చి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రాజకీయ పోరాటాలే బహుజనులకు కుల పీడన నుండి కాపాడుతాయి అని చెప్పేవారు. అదే ఆచరణలో కూడా పెట్టారు. తెలంగాణలో కమ్యూనిస్ట్, విప్లవ పార్టీలలో కులం ప్రస్తావన తెచ్చింది మారోజు వీరన్న. అప్పుడు వచ్చిన నినాదం దొరల తెలంగాణ కాదు, బహుజన తెలంగాణ కావాలని. దళిత బహుజన శ్రామిక విముక్తి పార్టీ స్థాపనలో కీలక పాత్ర వహించి, బహుజన కమ్యూనిస్ట్ పార్టీ అవగాహనలలో మార్పుకి దోహదం చేశారు. కారంచేడు నుండి నేటి పాతపల్లి, కందికట్కూరు దళితుల భూ పోరాటం, సెంట్రల్ యూనివర్సిటీ రోహిత్ వేముల హత్య, గూడూరు శుశ్రుత, దేవాంశ్, మిర్యాలగూడెం ప్రణయ్, అమృత నుండి నిరంతరం కొనసాగుతున్న దళిత ఉద్యమాలలో ముందున్నారు.

తెలంగాణా రాష్ట్రం తరువాత పూర్తిగా కుల నిర్మూలన కొరకు, కులాంతర, ప్రేమ వివాహాల హత్యలపై నిత్యం స్పందిస్తూ రావడమే కాకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చార్టర్ అఫ్ డిమాండ్స్ పెట్టి, ఒక చిన్న పుస్తకం వేసినరు. అదే క్రమంలో కులాంతర వివాహాల ద్వారా కుల నిర్మూలన సాధ్యం అని విపరీతమైన ప్రచారం చేయడమే కాకుండా, హై కోర్ట్ లో పిల్ కూడా వేసి సుదీర్ఘ పోరాటానికి తెరతీయడం ఒక్క ఉసా కమిట్‌మెంట్‌కి నిదర్శనం. తెలంగాణాలో జరిగిన అనేక కుల హత్యలు, హింస, దోపిడీ పోరాటాలో పాల్గొంటూనే వాటిని దేశీ దిశ యూట్యూబ్ ఛానెల్ ద్వారా డిజిటల్ మాధ్యమంలోకి వెళ్ళేటట్టు చూసేవారు. పోలేపల్లి నుండి నేను నేర్చుకున్నది ముఖ్యంగా తెలంగాణ జరిగే ఉద్యమాలు అన్ని డిజిటైజ్ చేయడం, భావి తరాలకి అందించడం, చరిత్రని భద్రపరచడం. బహుజన ఉద్యమాలు, కుల నిర్మూలన ఉద్యమాలు ఎప్పుడూ అనుకున్న స్థాయిలో రికార్డ్ చేయబడలేదు. చేయరేమో కూడా. ఆ బాధ్యతని దేశీ దిశ యూట్యూబ్ ఛానెల్ ద్వారా పూర్తి చేసే ప్రయత్నం మాత్రం 2017 నుండి ప్రారంభం అయింది.

## బహుజన ప్రతిఘటన వేదిక :

ప్రొఫెసర్ ఐలయ్యపై హిందూత్వ దాడులను ఖండిస్తూ అటు ఆంధ్రాలోనూ ఇటు తెలంగాణలోను ఉసా ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. బహుజన ప్రతిఘటన వేదిక బ్యానర్ పై జిలుకర శ్రీనివాస్, పసునూరి రవీందర్, నేను ఇతర మిత్రులు మొదటి కార్యక్రమం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అనేక సంఘాలు, వ్యక్తుల మధ్యలో జరపడం తరువాత దాని కొనసాగింపు తెలంగాణ సాంస్కృతిక వేదిక కేంద్రంలో ఒక సమాఖ్యగా దాదాపు 60 సంఘాలకి పైగా భాగస్వామ్య సంఘాలతో జరిగింది. దానికి నన్ను కన్వీనర్‌గా, ఉసా గారిని కూడా కోఆర్డినేటర్‌గా కంచె ఐలయ్య గారు ఇతరులు ప్రతిపాదించారు. అక్కడ మొదలైన బ.ప్ర. వే నేటి వరకు అనేక కార్యక్రమాలని చేస్తూ ఉంది. యూనివర్సిటీలో లెఫ్ట్ విద్యార్థులకి, మనువాద విద్యార్థి సంఘాలకి ఘర్షణ జరిగినప్పుడు ఉసా హుటాహుటిన వెళ్లి అక్కడ పోలీసు వారితో, ప్రెస్ వారితో మాట్లాడి ధైర్యాన్ని నింపే వాళ్ళు. బహుజన ఉద్యమాలని ఈ వేదిక ద్వారా అంతర్జాతీయ స్థాయిలో కూడా తీసుకుపోవడమే కాకుండా అనేక పరిశోధనలు జరపడానికి ఉపయోగపడుతున్నది కూడా.

ప్రయివేట్ చదువులు, విద్యా సంస్థలలో ఇదివరకు లాగా రాజకీయ విద్యార్థి సంఘాలు కానీ లేకపోవడం, వాళ్లకి ఇతరత్రా వేరే అంశాలపై అవగాహన ఉండడం ఈ కాలంలో కష్టం. ఇట్లాంటి సందర్భంలో ఉసా లాంటి వారు సమాజానికి, విద్యార్థుల చైతన్యానికి, ఎదుగుదలకి అవగాహన కల్పించడానికి చాలా అవసరం. తెలంగాణ వచ్చిన తరువాత తెలుగు అకాడెమి వాళ్ళు తెలంగాణ ఉద్యమం పై పోటీ పరీక్షల కోసం పుస్తకం ఒక వేస్తే అందులో తెలంగాణ ఉద్యమం భోనగిరి, వరంగల్, సూర్యాపేట డిక్లరేషన్ పై తప్పులున్నాయని గమనించి అవి రాస్తున్న ప్రొఫెసర్లకు అవగాహన కల్పించడం నాకు ఇంకా గుర్తు ఉంది. వెంటనే సూర్యాపేట డిక్లరేషన్‌పై ఒక పుస్తకం కూడా తీసుకొచ్చారు.

ఆయన కుల వర్గ సిద్ధాంతాలకు వారధిగా ఉంటూ, సమకాలీన ఉద్యమాలలో మమేకమయ్యే వారు. బ్రాహ్మణ భావజాలానికి వ్యతిరేకంగా జ్ఞానం ఎప్పుడు పది మందికి పంచాలన్నది ఆయన ముఖ్యోద్దేశ్యం. ఎప్పుడూ సమాజానికి సంబంధించిన పుస్తకాలు కొనిస్తూనో, పంచి పెడుతూనో, భోదిస్తూనో ఉండే వాడు. ఇప్పటికి ఇతర దేశాలలో ఉన్న వాళ్ళు కులం, వర్గం మీద పరిశోధన కొరకు వస్తే ఖచ్చితంగా ఉసా దగ్గరికి రావాల్సిందే. ప్రతి ఒక్కళ్ళు చెప్పేది ఆయన పేరే. రెండు ఉద్యమాలలో ప్రత్యక్ష అనుభవం అపారంగా ఉండడం, ఎటువంటి భేషజాలు లేకుండా అన్ని వయసు వాళ్ళని దగ్గరికి తీసుకుంటూ, నిరంతరం తనని తానూ అందరికి అందుబాటులో ఉంటూ, అతి సులువైన భాషలో అందరికి అర్థం అయేటట్టు మాట్లాడుతూ, ఉపన్యసిస్తూ, ఆర్థికంగా, హార్థికంగా అండగా ఉంటూ ఉద్యమకారుగాడిగా, మేధావిగా కొనసాగుతున్నది ఉసా ఒక్కడే.

## పరిశోధనా రంగం :

ఉసా గురించి చాలా మందికి తెలియని విషయం, ఆయన ఒక గొప్ప స్కాలర్. కుల వర్గ దృక్పథం మీద ఏ యూనివర్సిటీ, పరిశోధనా సంస్థలలో రీసర్చ్ జరుగుతుందో జరగదో గానీ ఉసా ఆఫీసులో, ఇంట్లో 30, 40 ఏళ్ల క్రితం నుండి చర్చలు, కరపత్రాలు, వ్యాసాలూ, పుస్తకాలు మాత్రం దొరుకుతాయి. దాదాపుగా ఇంగ్లిష్, తెలుగు పది పేపర్లు, పత్రికలూ తెప్పించి ప్రతి రోజు అన్ని చదవడమే కాకుండా, ముఖ్య అంశాలకి సంబంధించిన వాటిని ఒక దగ్గర పెట్టి బైండింగ్ చేయించడము, విడిగా డిజిటైస్ కూడా చేయించేవారు. రేపటి తరానికి అన్నీ ఒక దగ్గర దొరకాలని అయన తపన. ఉదాహరణకి ఒక పౌరసత్వ చట్టం మీద ఉద్యమం జరుగుతుంది అంటే దాని మీద లోతైన అవగాహన కోసం అనేక పత్రికలూ, గ్రంథాలు తెప్పించి చూసేవారు, రాసేవారు. చిన్న వేదికలో మాట్లాడడానికి అయినా పూర్తి సమాచారంతో, నోట్స్‌తో ఉండేవారు. అది కూడా నేటి తరం నేర్చుకోవాల్సిన ముఖ్య విషయం. సత్యమూర్తి కాలం నాటి ఎదురీత నుండి నేటి దేశీ దిశ త్రైమాసిక పత్రిక దాకా ఒక సుదీర్ఘ ప్రయాణం చేస్తూ కుల, వర్గ సమస్యలపై వచ్చిన భిన్న దృక్పథాలను ఆన్‌లైన్ లో అందరికి అందుబాటులో ఉంచే ప్రయత్నం జరుపుతున్నారు. ఇన్ని పనుల మధ్య ఒక పత్రికకి సంపాదకుడుగా ఉండడం అంటే మామూలు విషయం కాదన్నది మనకి తెలుసు. ఒక వైపు పత్రిక పని, అనేక పుస్తకాల రచన, ప్రచురణ చేపట్టేవారు. బహుశా ఉసా గారికి 24 గంటలు సరిపోవేమో అనిపించేది.

## విస్తృతమైన వ్యక్తిత్వం :

ఉసా గారు కనిపించే మనిషి వేరు, ఆయన వచ్చిన కుటుంబ నేపథ్యం, ఉద్యమ నేపథ్యం చూస్తే ఒక విధమైన భావన కలుగుతుంది. కానీ మనకి కనిపించని ఎన్నో భిన్న కోణాలు ఉన్న మనిషి ఉసా. ఆయన మార్క్సిస్టు శిబిరం నుండి పూలే, అంబేద్కర్ శిబిరం వరకు వచ్చి మద్దతు నివ్వడం, ఆంధ్ర ప్రాంతానికి చెందినా తెలంగాణాకి అది కూడా సామాజిక తెలంగాణ నినాదంతో తెలంగాణ ప్రాంతం అంతా తిరిగి పరిచయం చేయడం, సామాజిక తెలంగాణ ఎందుకు, ఏమిటి అని ఒక పుస్తకం తేవడం, ముఖ్యంగా ఎస్సిలకు బీసీలకు మధ్య

ఘర్షణ జరిగితే బీసీ అయి కూడా ఎస్సీల వైపే ఉండడం ఉసా గొప్ప పర్సనాలిటీకి నిదర్శనం. తన వయసుకు తగ్గ ఆలోచనలు ఉన్నా లేకపోయినా అన్ని వయసు వాళ్లకి దగ్గర అవడం, సమానంగా చూడడం, తన ఆలోచనల వైపు మళ్లించడం చూడొచ్చు. ఇక స్త్రీల ఉద్యమంలో మగవాళ్ళు ఫెమినిస్ట్ దృక్పథంతో పని చేయడం కూడా చాలా అరుదు. అందుకే కుల, వర్గ, జెండర్, మతాలకి భిన్నంగా ఉసాకు అభిమానులు ఉండడంలో ఆశ్చర్యం ఏమి లేదు.

దాదాపుగా 60 సంఘాలకి పైగా స్థాపించి పని చేశారని చెపుతుంటారు అంటే అన్ని శ్రేణుల్ని, అన్ని సందర్భాలని కల గలుపుకు పోవాలని ఆరాటం. మొన్నటికి మొన్న కాపులని బీసీలలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం నిర్మించడం, ఒక పుస్తకం కూడా తీసుకొచ్చారు. తరువాత బీసీ మానిఫెస్టో రెండు సార్లు ముద్రణ అయింది. బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్‌లో సామాజిక అవగాహన తరగతులు నిర్వహించే వారు కూడా. కమ్యూనిస్టు కార్యకర్తలంతా మన వాళ్ళే కదా అనే వాళ్ళు.

ఈ దేశంలో వర్గ పోరాటాలు మాత్రమే విప్లవ పోరాటాలు అని, రక్తపుటేరులు పారనిదే ఉద్యమం కాదనే వాదాన్ని బుద్ధుడు, పూలే అంబేద్కర్ వాదులు ఒప్పుకోవడం కష్టం. పైగా సామాజిక పోరాటాలని అస్తిత్వ ఉద్యమాలకి కుదించి, ఆర్థిక అంశాలు పునాది అని, కులం సామాజిక అంశాలు ఉపరితలానికి చెందినవని సూత్రీకరణ చేసారు. అట్లా అయితే పూలే, అంబేద్కర్ ల ఉద్యమాలని ఎట్లా అర్థం చేసుకుందాం? అక్కడ రక్తపాతం లేదా అంటే నిరంతరం ఉంటుంది. ఈ వ్యాసం రాసే సమయంలో కూడా దళిత, ఆదివాసీలపై ఎక్కడో ఏదో ఒక నేరం, ఘోరం జరుగుతూనే ఉంటుంది.

### దేశీ దిశ -2015 :

2015లో మార్క్స్, పూలే, అంబేద్కర్ సైద్ధాంతిక అవగాహన తోని, ఎదురీతకి కొనసాగింపుగా ఒక పత్రిక ఉండాలని దాదాపు ఒక ఆరు నెలలు చర్చోపచర్చలు చేసి ఒక త్రైమాసిక పత్రికని తాను వ్యవస్థాపక సంపాదకుడిగా, నన్ను సంపాదకురాలిగా పెట్టి పత్రిక తీసుకు రావడం జరిగింది. సత్యమూర్తి ద్వారా నేను ఎదురీతకి ఎడిటర్‌ని అయ్యాను, నా ద్వారా నువ్వు దేశీ దిశకు అవుతున్నావు, నా కొనసాగింపు నువ్వు అని ఎన్నో సార్లు చెప్పేవారు. ఈ పత్రిక ఆవిర్భావ సభకి పూణేలో ఉన్న సామాజిక కార్యకర్త విలాస్ సోనావానే, ఆంధ్ర జ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్, అల్లం నారాయణ వచ్చి మొదటి పత్రిక విడుదల చేశారు. పెద్ద నోట్ల రద్దు, హిందుత్వ శక్తుల దాడులు, నయీమ్ హత్య పై కొన్ని సంచికలు తీసుకుని రావడం తరువాత యూట్యూబ్ ఛానెల్ , వెబ్‌సైట్, స్టూడియో కూడా అనేక వ్యయ ప్రయాసలకోర్చి పెట్టారు. తెలుగు రాష్ట్రాలలో జరిగే అన్ని ప్రజాస్వామిక పోరాటాలని, సమావేశాలని ఒక దగ్గర పెట్టాలని ఇద్దరం కోరుకునే వాళ్ళం. పాత పుస్తకాలు, ఎదురీత సంచికలు అన్ని కూడా డిజిటైస్ చేసే కార్యక్రమం నిత్యం జరుగుతుంది. ఎన్నో అరుదైన పుస్తకాలతోని ఒక ఉచిత లైబ్రరీ కూడా పెట్టారు. ప్రజలకి అందుబాటులో ఉండాలని తన కోరిక.


నిరంతర పఠన శీలిగా ఉంటూ, అన్ని సమకాలీన అంశాలపై పత్రిక రావాలని అనేవాడు, భాస్కర్ బొడ్డు గారు వర్కింగ్ ఎడిటర్‌గా వచ్చాక వెబ్‌సైట్ తెలుగు పాఠకులకి జాతీయ, అంతర్జాతీయ వార్తలని అందించేదిగా తయారు అవుతుంది. ఇంగ్లీష్ లో వచ్చిన చాలా ముఖ్యమైన సమాచారం ఉన్న పుస్తకాలు, ఆర్టికల్స్ తెలుగులో రావాలని, ఎంత ఖర్చు అయినా వెనకాడకుండా తెలుగులోకి తీసుకొచ్చి వెబ్‌సైట్‌లో పెట్టేవారు. ఈ మధ్య కాలంలో అనేక అంశాలపై స్టూడియోలో చర్చలు desidisa.comలో చూడొచ్చు.

ఇంకొక ముఖ్యమైన విషయం, ఇప్పటి తరం వారు తమకు, తమ కుటుంబానికి తరతరాలకు సంపాదన మిగుల్చుకోవాలని చూస్తే, తనకు ఉన్న ప్రతి పైసా కూడా ప్రజా ఉద్యమాలకి, సహాయం కోరి వచ్చే వారికి, దేశదిశ కి ఖర్చుపెట్టడం ఉసాకే సాధ్యం. ఎంత వెతికినా, చూసినా మళ్ళీ రారు అటువంటి మహానుభావులు అనిపిస్తుంటుంది. ఆయన జీవితంలో 24 గంటలు ప్రజలకే అంకితం.

చివరి సంభాషణలో కోవిడ్ టెస్ట్ కోసం పోతున్నా అని చెపుతూ 'అమ్మా నువ్వు కోవిడ్ అవగాహన కొరకు పని చేస్తున్నావు కదా మన దేశీ దిశలో కూడా ఒక ప్రత్యేకమైన విభాగంగా ప్రజలకి అవగాహన కొరకు పెడదాం' అని చెప్పారు. బహుశా కోవిడ్‌కి బలి అయితా అని సార్ అనుకోని ఉండక పోవచ్చు. ఇంతకన్నా తన నిబద్ధతకి ఏమి తార్కాణం చెపుతాం. తెలుగు, బహుజన సమాజం ఒక మేధావిని కోల్పోయింది. వ్యక్తిగతంగా, సామాజిక ఉద్యమాలకి పెద్ద లోటు. కానీ ఖచ్చితంగా ఆయన ఆశయాలని కొనసాగిస్తాం. అందరు ప్రాజాస్వామికవాదులు కుల, వర్గ జమిలి దృక్పథంతో పని చేయడంపై ఆలోచిస్తే అదే ఆయనకి ఘన నివాళి. ❑

# కోవిడ్ మన సమాజ రోగలక్షణాల్ని కూడా ప్రతిబింబిస్తున్న అద్దం

**అవిజిత్ పాథక్**
జె యన్ యూ లో సోషియాలజీ ప్రొఫెసర్



లోలోపల మనం నలిగిపోయి పగిలిపోయి ఉన్నాం. ఈ మహమ్మారి సృష్టిస్తున్న వినాశనానికి అంతు దరి కనిపించకపోవడంతో జీవితమ్మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలుపుకోవడం రోజురోజుకీ కష్టమై పోతోంది. దానికి బదులు మన సామూహిక చైతన్యంలోకి భయం, నిరంతర ఆందోళన, ఏకాంతం, మానసిక వైకల్యం చొరబడిపోయాయి. రాజ్యం లాక్‌డౌన్‌ను సడలిస్తున్న కొద్దీ మనం భిన్నమైన ప్రపంచంలోకి మేలుకుంటున్నాం. ఆ ప్రపంచంలో రేపు బతికి బట్టకడతామన్న నమ్మకం లేదు. మన ఉద్యోగం నిలబడుతుందనే హామీ లేదు. మన పిల్లల స్కూళ్లూ కాలేజీలూ ఎప్పుడు తెరుస్తారో తెలీదు. మన మిత్రుణ్ణి ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని ఓ కప్పు కాఫీ తాగడం సాధ్యం కాకపోవచ్చు. బస్సుల్లో రైళ్లల్లో ఆఫీసుల్లో ఒకరిని చూసి ఒకరం అనుమానిస్తాం. జీవన సంరంభం కంటే మాస్కుల శానిటైజర్ల హంగామా పెరిగిపోతుంది. ఇట్లాంటి ప్రపంచంలో మానవ సంఘటన (solidarity) చారిత్రక అవశేషమౌతుంది.

కానీ, రాతి గుట్టల మధ్య కూడా పువ్వు వికసిస్తుంది. కాబట్టి తాత్వికంగా రసాత్మకంగా ఉండగలిగిన వాళ్లు అంత తొందరగా తూలిపోరు. బహుశా వారి ధ్యాన, తదేక దృష్టి వారిని వ్యతిరేక భావనల నుంచీ మానసిక వైకల్యం నుంచీ బయట పడేస్తుంది. బహుశా వారు ఒక నీరవ నిశ్శబ్దం లోంచి ఈ 'మాయ' సృష్టిస్తున్న జీవన్మరణాల సయ్యాటను చూస్తారు. బహుశా మెలకువ కల్గిన కళ్లతో అజ్ఞాతం గురించిన చింత లేకుండా అద్భుతమైన సూర్యాస్తమయాన్నో, ఆకు చెట్టు నుంచి రాలిపడడాన్నో చూస్తూ ఈ క్షణాన్ని ఇక్కడే ఇప్పుడే జీవిస్తారు. వాళ్లు మరణానికి ముఖమూ, పేరూ లేని ఈ స్థితిలో కూడా బుద్ధుణ్ణీ, రూమీని ఆవాహన చెయ్యగలుగుతారు. 'నాకు ప్రతి అంగుళమూ అద్భుతమే' అన్న వాల్ట్ విట్మన్ ను ఉటంకించడంలో ఉద్దీపన పొందుతారు. వాళ్లు 'ఇది కూడా అన్నిటి లాగే గతించిపోతుంది' అనగలిగే వివేకాన్ని ప్రదర్శిస్తారు.

జ్ఞానఫలం అని ఆధునిక విజ్ఞాన శాస్త్రం దేన్ని పరిగణిస్తుందో దాన్ని నేను కూడా తిన్న వాణ్ణే అయినా ఈ ధ్యానాన్వేషణకున్న విముక్తశక్తికి విలువనిస్తాను నేను. ఇవన్నీ ఒక నిరపేక్ష వాస్తవికతను చూడడంలో ఉన్న వేర్వేరు గుణాత్మక దారులే నంటాను! నువ్వూ నేనూ చావుభయంతో కుంచించుకు పోయినపుడు కూడా బుద్ధుడు దాన్ని మరొక సాధారణ సూర్యాస్తమయంగా చిర్నవ్వుతో చూడగలడు. అవును, మెలికలు పడిన విషాదమార్గాన ప్రయాణించడానికి ధ్యాన నిశ్శబ్దం, ఆత్మస్వచ్ఛతలు కావలసిన – శాంతిని, బంధన విముక్తి (detachment)ని, తాదాత్మ్యత (harmony) నూ, ప్రేమనూ ఇస్తాయి. ఈ సామాజిక మనో వైకల్యాన్ని ఒక రాజకీయ సామాజికాంశంగా కూడా పరిగణిస్తాను. సామూహిక నివారణా చికిత్సలో భాగంగా, నేనంటానూ, ధ్యాన దృష్టీ సామాజిక రాజకీయ దృక్పథాల కలయిక అవసరమౌతుందని. ఉదాహరణకు అంతటా పరివ్యాప్తమైన నిరాశ, అందోళనల నుంచి బయటపడేందుకు నాకు వియత్నమీ బౌద్ధ సన్యాసి తిచ్ నాహ్ హన్ అభిభాషణలు దోహదం చేసి రసాత్మకమైన క్షణాల్ని మిగిల్చాయి. శ్రామిక రైళ్లలోని దైన్యం వెనుక ఉన్న సమాజశాస్త్రం నాకు తెలియంది కాదు. బుద్ధుడి ధ్యాన నేత్రాలు బలీయమైన ప్రేమనీ దయనీ నాలో వికసింప చేస్తున్నప్పుడు మనం సృష్టించిన సమాజ నిర్మాణం ఇంత హింసాత్మకంగా ఉండడాన్ని ఎలా కాదనగలను ? ఈ మహమ్మారి కేవలం వైద్య అత్యవసరస్థితి మాత్రమే కాదు, అది మన సామాజిక రోగ లక్షణాల్ని ప్రతిబింబిస్తున్న అద్దం కూడా. అందుకని రాజకీయ నైతికతకీ, ధ్యాన నిమగ్నతకీ మధ్య వైరుధ్యం ఉండనవసరం లేదు.

కోవిడ్ సమాజ నాడీవ్యవస్థని నిర్వీర్యం (న్యూరోసిస్) చేసింది. ఛిద్రమైన భావప్రసారానికి మానవరూపం ఈ న్యూరోసిస్. నన్ను నమ్మండి, మన సమాజం ముక్కలై మొరటుగా విభజితమై పోయింది. ఇటువంటి సమాజం లో సమాజ శాస్త్రవేత్త ఎమిలీ డర్క్ హీం దర్శించిన 'సంఘటితతత్వం' కానీ, సామూహికానందం కానీ సాధ్యం కాదు. గాంధీ సర్వోదయ తత్వాన్ని గానీ, అంబేద్కర్ ఆశించిన స్థాయీ భేదాలు లేని సమానత్వం కానీ కనిపించే సమాజం కాదు మనది. బదులుగా ఇదొక ఆశపోతు ఉదార పెట్టుబడిదారీ వ్యవస్థ. నిచ్చెనమెట్ల రోగంతో కునారిల్లుతున్న అనాగరిక వ్యవస్థ. మచ్చలు పూసే వెలివేతల వ్యవస్థ. తన ప్రయోజనాల కోసం వంకర వాదనలు చేసే భ్రష్టవ్యవస్థ. 'దూరం పాటించడం' మహమ్మారి వల్ల వచ్చిందనుకోకండి. అది ముందు

నుంచే ఉంది. మనం కొంతకాలంగా 'తట్టుకుని నిలబడ్డవాడే మనుగడ సాగిస్తాడ' (survival of the fittest) నే సూత్రం ఆధారంగా 'యుద్ధవీరు'ల పాత్రను పోషిస్తున్నాం. ఒక వైపు భూస్వామ్య, కులవ్యవస్థలు మన గ్రామ సమాజాల్ని ముక్కలు చేస్తే మరోవైపు నగరాల్లో మనుషుల మధ్య ఇంతింతెత్తు విభజన గోడలు నిర్మితమౌతున్నాయ్. గేటెడ్ కమ్యూనిటీలొకవైపు పేదల మురికివాడలింకొక వైపు. ఎవరికి ఎవరూ తెలియని అజ్ఞాత స్థితి ఒక వైపు తెలిసినా వైముఖ్యం మరోవైపు. లోపలంతా శూన్యం, బయటంతా బడాయితనం. టీ యస్ ఇలియట్ ఐతే వీళ్లని 'డొల్ల మనుషులు' అని తప్పక అని ఉండేవాడు. ఈ తరహా సమాజంలో స్నేహితులుండరు. ఇరుగు పొరుగు ఉండరు. కలయిక ఉండదు. ఇక్కడ రాజకీయం మనుషులు గురయ్యే దారుణ మోసక్రీడ. విద్య కొందరి చేతి పనిముట్టు. డబ్బు అన్నిటికీ కొలమానం. నిరాడంబరం తెలివితక్కువతనం. సమాచార విప్లవం కేవలం నిస్సారమైన ఉత్సవమని ఎవరూ గుర్తించరు. పబ్లిక్ ప్రదేశాల్లో కనిపించేదంతా ఏకాంత సమూహాలే ! రోజు వారీ జీవితం యుద్ధభూమే!

అందువల్ల ధ్యానస్థితిలో ఉండడం అంత తేలికేం కాదు. ఈ సామాజిక న్యూరోసిస్ వ్యక్తి చైతన్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఓ వలస కార్మికుడి కోసం ఏ బుద్ధుడు ఎదురుచూడడు. అతడు ఎదుర్కోవలసింది హృదయం లేని కాంట్రాక్టర్లనూ, జులుం చేసే పోలీసులనూ. ఉదాహరణకు ముంబయి అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా నివసించే ముదుసలికి సహాయం చెయ్యడం కోసం 'నీ పొరుగు వానిని ప్రేమించుము' అనే జీసస్ వాక్యం విని ఎవరూ రారు. ఆశ్చర్యం లేదు, అప్పటికే ఉన్న సామాజిక న్యూరోసిస్‌ను మహమ్మారి తీవ్రం చేసింది. అందరూ కొత్త వాళ్లో లేదా యుద్ధవీరులో అయిన ప్రపంచంలో, నిషూ సంస్కృతి కన్న వేరేదీ నిజం కాని ప్రపంచంలో మనోఫలకం మకిలి పట్టిపోతుంది. అందుకే నేను చెప్పినట్టు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆంతరిక ప్రపంచాన్ని నిరంతరం శుభ్రపరచుకుంటూ ఉండాలి. అయితే సామూహిక విముక్తి కోసం ఆ ధ్యాన స్థితి రాజకీయమై కూడా ఉండాలి. అది ఒక మౌలిక సామాజిక పరిమార్పుకు కావలసిన ఎరుకను కలిగించాలి. అది ఉదార పెట్టుబడిదారీ ఆశపోతు తత్వం నుంచి పర్యావరణ స్పృహ కల్గిన సామ్యవాదం వైపుకు నడిపించాలి, లేదా నిర్దయా పూర్వకమైన నిర్లక్ష్యం నుంచి మానవ స్పర్శలోని మధురానుభూతి వైపుకు సాగాలి.

ఇది మనకు మేలుకొలుపా?

కొవిడ్ అనంతర ప్రపంచంలో ధ్యాన కళనీ రాజకీయాల్ని పునర్నిర్వచించుకో గలమా?!

(ది ట్రిబ్యూన్, 02 జూన్ 2020) ❑

## చరిత్ర అంటే కొందరికి ఎందుకంత భయం?

**(7వ పేజీ తరువాయి)**

అన్ని భాషల్లాగా సంస్కృతం అంత వరకు ఒక మామూలు భాషే. కాని, దాని స్థాయి అనూహ్యంగా పెంచి, దాన్ని దైవ భాషగా, వేదభాషగా ప్రకటించుకున్నారు. పైగా శూద్రులు ఆ భాష చదివితే నాలుకలు కోశారు. ఆ భాష వింటే చెవుల్లో సీసం పోశారు. వేదాల సృష్టికర్తలయిన నాటి ఆర్య బ్రాహ్మణుల అకృత్యాల జాబితా చాలా పెద్దది. కులాలు, మతాలు, వర్ణాలు, వర్గాలు, గోత్రాలు పక్కన పెట్టి, ఆధునిక యుగ వైజ్ఞానిక స్పృహతో ఆలోచించగల మానవ వాదులకు విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఇంకా ఎదగలేనితనంలో కొట్టుమిట్టాడుతున్న వారికి గత చరిత్ర విప్పి చెప్పితే కోపాలే వస్తాయి. అందుకే చరిత్ర గ్రంథాల్ని తిరగరాయించాలన్న కోరిక కొందరిలో బలంగా ఉంది.

పుస్తకాలు, సిలబస్‌లు మార్చుకున్నంత మాత్రాన అసలు చరిత్ర మారదు కదా? ప్రస్తుత పరిస్థితుల్లో మైనార్టీల మీద విపరీతంగా జరుగుతున్న దాడుల్ని రోజూ మనం చూస్తున్నాం. హిందూత్వను బలోపేతం చేయాలనుకునేవారు మైనార్టీలను హింసిస్తే లాభమేమిటీ? వారే ఆలోచించుకోవాలి. హిందూమత ఛాందసానికి తట్టుకోలేక వారి వారి పూర్వీకులు ఒకప్పుడు మతాలు మార్చుకున్నారు. వారి వారసుల్ని ఇప్పుడు అదిరించి, బెదిరించి, హింసకు గురిచేస్తే వారు హిందూత్వాన్నెలా సమర్థిస్తారు? 'ఘర్ వాపసీ' ఎలా సాధ్యం? విశాల దృక్పథంతో స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొల్పాల్సింది పోయి, సంకుచితత్వంతో హత్యలు చేస్తూపోతే ఎవరైనా గాని హిందూత్వ వైపు ఎలా ఆకర్షింప బడతారూ? దేశంలో అధికారపార్టీ నిర్వహిస్తున్న ఒకరకమైన ఉగ్రవాద చర్యల్ని హిందువులే వ్యతిరేకిస్తున్నారు కదా? అందుకే పురాణ గాథల్ని ఎద్దేవా చేస్తూ నార్ల ఇలా అన్నారు.

"భూమి బల్ల పరుపు పాము దానిని మోయు/
పాల కడలి కలదు పాడె కలదు /
పాత పుస్తకాల పాండిత్య మింతె రా!
నవయుగాల బాట నార్లమాట!"

❑

# అస్తవ్యస్త కాలంలో ఆన్‌లైన్ విద్య

**అవిజిత్ పాథక్**
జె యన్ యూ లో సోషియాలజీ ప్రొఫెసర్

ప్రపంచం సజావుగా సాగిపోతూ ఉంటుందనే భ్రమల్ని కరోనా వైరస్ బద్దలు కొట్టింది. అది అందర్నీ విపరీతమైన ఆందోళనకీ, అస్తిత్వ అస్థిరతకూ గురిచేసిన విషమ సమయంలో ఉపాధ్యాయులం విద్యావేత్తలం దారుణ వైఫల్యానికి గురికావడం నన్ను విషాదానికి లోను చేసింది. విద్య అర్థాన్నీ, అవసరాన్నీ పునరాలోచించుకోవాల్సిన ప్రహేళిక లాంటి సందర్భంలో ఆన్‌లైన్ బోధనకు ఎట్లాంటి యాప్‌ను ఉపయోగించాలీ, సామాజిక దూరం వంటి ప్రతిబంధకాల్ని దాటుకుని విద్యాబోధన ఎట్లా కొనసాగించాలీ అనే సాంకేతిక సమస్యల మీద మాత్రమే దృష్టి పెడుతున్నాం. మన జీవితాల్లో మౌలికమైన మార్పేమీ రాలేదని నటిస్తూ , ఒక కృత్రిమ సాధారణస్థితిని నెలకొల్పుకుని అవే పాఠ్య పుస్తకాలు, అదే సిలబస్, అవే ఏకోన్ముఖ ప్రసంగాలు, అవే పరీక్షలు, అవే అసైన్‌మెంట్లు కొనసాగించుకోవాలనుకుంటున్నాం, కాకపోతే ఈ సారి ఆన్‌లైన్ బోధన అనే ఇంద్రజాలం లాంటి సాంకేతికశక్తితో.

కోవిడ్ సంక్షోభం మానసిక ప్రపంచంలోకి దిగబడి పోయింది. మరణం ఇప్పుడు నైరూప్యం కాదు. అదొక వాస్తవం. అది ఇక్కడే ఇప్పుడే ఉంది. వైరస్ ఏ క్షణాన్నైనా మన గేటెడ్ కమ్యూనిటీలోకి జొరబడవచ్చు. మనం హఠాత్తుగా దగ్గుతూ ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడవచ్చు. కానీ భయకంపితురాలైన ఒక కళాశాల విద్యార్థిని దీనికతీతంగా లాప్‌టాప్ తెరిస్తే ఆమె సోషియాలజీ ప్రొఫెసర్ snowball sampling నూ, సామాజిక పరిశోధనకు సంబంధించిన మెళకువలనూ చెబుతూ దర్శనమిస్తాడు. అదెంత అసంబద్ధం?! లేదంటే లాక్‌డౌన్ కారణంగా ఒక చిన్న గదిలో బందీ అయిపోయిన దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఓ పన్నెండేండ్ల కుర్రాడు ఇంట్లో తండ్రి వద్ద మాత్రమే ఉన్న స్మార్ట్‌ఫోన్‌ను బదులు తీసుకుని ఆన్‌లైన్ క్లాస్‌కు హాజరైతే ఆ రోజున వాళ్ల గణితం టీచర్ నిజజీవితం నిరాకరించే 'లాభము–నష్టము' అధ్యాయాన్నో, 'శాతము' అధ్యాయాన్నో ముగిస్తారు. ఎంత అమానవీయం! ఎంత మొద్దుబారిన తనం ! ఇది హింస తప్ప మరొకటి కాదు కదా!

విద్య నిజంగా జీవితానికి భరోసా నిచ్చేదే అయితే ఈ కోవిడ్ సంక్షోభంలో యువహృదయాలను మేల్కొలిపి వారి అంతశ్చేతనను స్పృశించి వారికి మానసిక దారుఢ్యాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. కాబట్టి భయం సర్వత్రా వ్యాపించి, బాధితులే నేరస్థులై పోయి, మనిషిని చూసి మనిషి దూరం జరిగిపోవడమే విధాయకమైన చోట ఉపాధ్యాయులుగా మనం విద్యార్థులతో లయాత్మకమైన సంభాషణ సాగించాల్సి ఉంది. తద్వారా వారి సమస్యలు సందేహాలు అర్థం చేసుకుని కలిసి పనిచేస్తూ ఆత్మకు ప్రపంచానికి ఉన్న సంబంధాన్ని పునర్నిర్వచించి వారికి తెల్లం చేయవలసి ఉంది. అందువల్ల ఇప్పటికిప్పుడు స్కూలు విద్యార్థి విషమబాహు చతుర్భుజ ఘనపరిమాణాన్ని లెక్కగట్టడం ఎట్లాగో నేర్చుకోక పోవడం వల్లనో, మొఘల్ సామ్రాజ్య పతనానికి గల పది కారణాలను గుర్తుపెట్టుకోకపోవడం వల్లనో జరిగే నష్టం ఏమీ లేదు. అసైన్‌మెంట్లనో ప్రాజెక్ట్‌వర్క్‌లనో అప్‌లోడ్ చెయ్యడం కాదు, వారికిప్పుడు కావలసింది ఒక మృదువైన స్పర్శ. అందుకని కళాశాల లేదా విశ్వవిద్యాలయ ఆచార్యులు రోజువారీగా ఇచ్చే క్లాడ్ లెవీ స్ట్రాస్ Structuralism మీదనో, thermodynamics theory మీదనో, ఉపన్యాసం లేకపోతే మన జ్ఞానానికి వచ్చే ముప్పేమీ లేదు. నిజానికి కావలసింది జాగృతమైన జ్ఞానం, లోతైన మతత్వం (religiosity) (మత తత్వం కాదు – అను), నిండైన ఇంద్రియ స్పృహల మిశ్రమం. ఉపాధ్యాయులుగా మనం అధికారిక పాఠ్య ప్రణాళికలను దాటుకుని ఈ క్రమంలో పాలుపంచుకోగలమా ?

ఈ సందర్భంగా మూడు విషయాలు చెప్పదలిచాను.

మొదటిది. ఆధునికత ప్రకృతి మీద మానవాధిక్యం స్థాపితమయ్యిందని భావించి తన సాంకేతిక విజ్ఞానంతో సాధించిన అపరిమిత అభివృద్ధి మీద స్వీయానురక్తిని ఏర్పరుచుకుంది. భవిష్యత్‌ను ఊహించడంలో, నియంత్రించడంలో అంతటా ఒక క్రమాన్ని స్థాపించడంలో ఉన్న తన శక్తిని కూడా బలపరుచుకుంది. కానీ, ఆధునికత తన మీద తాను రూపొందించుకున్న ఈ దృక్పథాలన్నిటినీ కోవిడ్ తుత్తునియలు చేసింది. అందుకని మనల్ని మనం నిజంగా ప్రతిఫలించగలిగే వాళ్లమైతే నూతన భావదృష్టి కలవాళ్లమైతే మనం కొత్త ప్రశ్నల్ని ఎదుర్కోవాలి. ఉదాహరణకు మనం గొప్ప యుద్ధ విజేతలుగా కన్న వినమ్రులమైన ద్రిమ్మరులుగా జీవించడం ఎట్లా నేర్చుకోవాలి? పర్యావరణంతో మన సజీవ సంబంధాన్ని ఎట్లా పునహ ప్రతిష్ఠించుకోవాలి ? మనం అపారమైన విశ్వాసంతో

ఆరాధించే శక్తి– అంటే మన అణ్వాయుధాలు, మన అంతరిక్ష పరిశోధనలు, మన మహా ఆసుపత్రులు, మన కృత్రిమ తెలివితేటలు– ఇవన్నీ భ్రమలనీ ఒక కంటికి కనిపించని వైరస్ ముందు దిగదుడుపేనని ఎట్లా అంగీకరించాలి ? అది అమెరికా లాంటి మహా బలశాలిని కూడ నిర్వీర్యం చేయగలదనే వాస్తవంతో ఎట్లా సమాధానపడాలి? ఒక్క మాటలో చెప్పాలంటే కొత్త ప్రపంచ అన్వేషణలో ఆధునిక జ్ఞానాన్ని ఎట్లా మరచిపోవాలి ?

రెండవది. కరోనా వైరస్ లేదా దాని అనుబంధ లాక్ డౌన్ మనల్ని మన లోపలి మనిషితో సమాధాన పడేటట్టు చేసింది. ఇంత కాలం బాహ్యావరణం మీద దృష్టి పెట్టి దాని మీద ఆధిపత్యం చెలాయించగల సాంకేతిక నైపుణ్యం సంపాదించిన మనం మన లోపలి ప్రపంచ గమనశీలతను – అంటే మన భయాల్నీ కోపాల్నీ, మన అహాన్నీ నిగ్రహాన్నీ, మన బాధనీ తాపాన్నీ, మన కలల్నీ ప్రార్థనల్నీ– గమనించే కళను మరచిపోయాం. నిజానికి మన బాహ్యావరణ ప్రేరిత చైతన్యానికి మన ఆంతరిక ఆవరణాన్ని నిర్వహించే శక్తి లేదు. ఆశ్చర్యం లేదు, ప్రపంచమంతా చిత్తచాంచల్యంతో, నిర్వ్యాపారం (boredom) గా, అర్థరాహిత్యం తో, గృహహింసతో నిండిపోయింది. కాబట్టి మన లోపలి వ్యక్తిత్వాన్ని సానబెట్టుకుని ఓర్పునీ నిలకడనీ రూపొందించుకుని, నిశ్శబ్దంలోని గాఢతను అభిమానించి, మనలో దాగి ఉన్న సాధ్యాల మడతల్ని విప్పాలి, ఎట్లా అంటే ఎర్నెస్ట్ హెమింగ్వే రచన The Old Man and the Sea లో సంక్షోభ సందర్భాన్ని దాటుకుని జీవనతీరాన్ని చేరుకున్నట్టు.

మూడవది. దూరం పాటించడంలో ఒక నిరంతర భయం మనల్ని నలిపివేస్తోంది. మన సామూహిక వివేకంలో భాగమైన పరవళ్లు తొక్కే ప్రేమ, నమ్మకం, మానవీయమైన స్పర్శలు ప్రశ్నార్థకమౌతున్నాయి. ప్రమాదమేమిటంటే ఈ పరిస్థితి నియంతృత్వ పాలనల బలాన్ని పెంచుతుంది. వారి నిఘా యంత్రాంగాలను విస్తృతపరుస్తుంది. అనుమాన ప్రవృత్తిని వ్యాపింపచేస్తుంది. ఈ నేపథ్యంలో మనం మానవ సాంగత్య సంరంభం లేకుండా కేవలం శరీరంతో వ్యూహాత్మకంగా జీవించడం ఎట్లా ? యాభై మంది సహచరులతో కూడిన సజీవమైన ఓ తరగతి గదీ, వేలాది సృజనాత్మక ఆత్మలతో నడిచే ఓ నిరసన ఊరేగింపూ, హద్దుల్లేని ఆనందంతో దద్దరిల్లే కాఫీ హౌస్ అడ్డా అన్నీ –హుళక్కేనా ! కొత్త ప్రపంచంలో మనం ప్రేమ శక్తినీ మానవ సాంగత్యబలాన్నీ పునఃస్థాపించగలమా ? అవును, స్వీయ నిర్బంధంలో నోళ్లు కట్టివేయబడిన స్కూలు పిల్లలూ, విశ్వవిద్యాలయ విద్యార్థులూ ఈ ప్రశ్నలే ఎదుర్కొంటున్నారు.

ఉపాధ్యాయులుగా విద్యావేత్తలుగా మనం మన విద్యా సంప్రదాయాల్ని ఈ అస్తిత్వ సంక్షోభానికి దగ్గరగా చేర్చలేకపోతే మన తీవ్ర నిర్లక్ష్యం, జడత్వం బట్టబయలౌతాయి. అర్థవంతమైన విద్య అంటే జూం లాభ నష్టాల బేరీజు కాదు. 'సకాలం' లో సిలబస్‌ను పూర్తిచెయ్యడమూ కాదు. అసలైన విద్య మనకు తెలిసిన మన ప్రపంచం కుప్పకూలిపోయి, పుస్తక జ్ఞానం అంతా నిరర్థకమై పోయినపుడు జీవనకళలో సాధించాల్సిన సున్నితమైన వైవిధ్యాన్ని తెలియచెప్పేదే! ❑

(మెయిన్ స్ట్రీం సంపుటి LVIII, సంచిక 23, తేదీ మే 23, 2020)

తెలుగు: **కొప్పర్తి వెంకటరమణమూర్తి**

---

## మార్క్సిజం నుంచి దళిత బహుజనం దాకా..

**(20వ పేజీ తరువాయి)**

సాటిలేనిది. పితృస్వామ్యం నుంచి మహిళ ఎలా విముక్తి చెందాలో చెబుతూ అనేక రచనలు చేశారు కూడా. గిరిజన ప్రాంతాల్లో కానీ, మోత్కూరు, కొల్హాపూర్ గ్రామాల్లో కానీ లేక దళిత్–బహుజన వాడల్లో వేధించబడిన ప్రతి ఒక్కరితోనూ ఆయన కలగలిసి పోయారు.


పూలే, అంబేద్కరిజంపై అనేక పుస్తకాలు, వ్యాసాలు రాశారు. కాలేజీ రోజుల నుంచి రాయడం ప్రారంభించారు. హేతువాదం, సైన్స్, బుద్ధిజం పట్ల విశ్వాసం ఉన్నవాడిగా మూఢనమ్మకాలు, అజ్ఞానం పట్ల బద్ధవిరోధాన్ని ప్రకటించేవారు. తన రాజకీయ, సైద్ధాంతిక కార్యాచరణలో భాగంగా ఆయన అనేక మంది ప్రజల ఇళ్లలో గడిపారు. ఒక విప్లవకారుడిగా, మానవ హక్కుల సమర్థకుడిగా, కులవ్యతిరేక ఆదర్శవంతుడిగా, మార్క్స్, మహాత్మాపూలే, అంబేద్కర్ అనుయాయిగా ఉసా వారసత్వం సాటిలేనిది. సామ్యవాద, శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలని కోరుకున్న వ్యక్తి ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమందిని బలిగొంటున్న కొత్త వైరస్‌ని నిరోధించలేకపోతున్న, అభివృద్ధి చెందని వైద్యశాస్త్రం కారణంగా మనల్ని వదిలి వెళ్లిపోయారు. ప్రపంచ వైద్యశాస్త్రం కరోనా వైరస్‌ని మార్క్సిజం నుంచి దళిత బహుజనం దాకా.. నిర్మూలించిన రోజు మాత్రమే.. అన్నిరకాల సాంక్రమిక వ్యాధులపై శాస్త్ర విజ్ఞానం జయించడం సాధ్యమవుతుందని విశ్వసించిన ఉసా ఆకాంక్ష నెరవేరుతుంది. మానవ సమానత్వం కోసం అలుపులేని పోరాటం సాగించిన ఉసా రెండు తెలుగు రాష్ట్రాల్లో బలమైన పాదముద్రలు వదిలి వెళ్లారు. ❑

# ఉపశ్రేణుల ప్రవక్త గ్రాంసీ

కొప్పర్తి వెంకటరమణమూర్తి



'పాతప్రపంచం మరణిస్తూ కొత్త ప్రపంచం జనిస్తున్న ఈ సంధి కాలంలో రాక్షసులు రాజ్యమేలుతున్నారు' అని ఫాసిస్టు, నాజీ పాలకుల్ని ఉద్దేశించి ఆంటోనియో గ్రాంసీ అన్న దాదాపు వంద సంవత్సరాల తర్వాత కూడా పరిస్థితుల్లో మార్పు లేకపోవడం గ్రాంసీని ప్రాసంగికం చేస్తున్నది. 1891 లో జన్మించి ముస్సోలిని ఫాసిస్టు ప్రభుత్వంచే నిర్బంధానికి గురై చివరి పదకొండు సంవత్సరాలు జైలులోనే రాపాడి నలభై ఆరు ఏళ్లకే మరణించిన ఈ ఇటాలియన్ మార్క్సిస్టు మేధావి రూళ్లకర్ర లాంటిదనుకున్న మార్క్సిస్టు సిద్ధాంతానికి వంగే గుణాన్ని ఆపాదించాడు. 1937లో మరణించిన గ్రాంసీ 1960ల తర్వాత, ముఖ్యంగా 1970ల తర్వాత జీవించడం ప్రారంభించి దశాబ్దాలు గడిచేకొద్దీ మరింత పఠనీయమూ, ఆచరణీయమూ అవుతున్నాడు. తీవ్రమైన అనారోగ్యంతో, దారుణ ప్రతికూల పరిస్థితుల మధ్య సాగిన జైలు జీవితంలో ఆయన రాసిన ముప్పైకి పైగా ప్రిజన్ నోట్ బుక్స్ రానున్న కాలానికి విజన్ నోట్‌బుక్స్ అయ్యాయి. 'ఈ బుర్రని ఇరవై సంవత్సరాల పాటు పనిచెయ్యకుండా ఆపాలి' అంటూ అన్నే ఏళ్లు జైలుశిక్ష విధించిన ఫాసిస్టు ప్రభుత్వం సూర్యుణ్ణి జైలు గోడల మధ్యకు రాకుండా ఆపగలిగింది కానీ, అతని ఆలోచనల్నీ అనంతరకాలంలో వాటి ప్రసారాన్ని అడ్డుకోలేకపోయింది.



మార్క్సిస్ట్ అయిన కారణంగా జైలుకెళ్లిన గ్రాంసీ మార్క్స్ ఆలోచనల మీద మౌలిక ప్రశ్నలు లేవనెత్తాడు. ప్రాథమిక సూత్రాలు కొన్నింటిని దిద్దడానికి ప్రయత్నించాడు. ఆ కారణంగానే మార్క్సిస్ట్ నియతివాదాన్ని వ్యతిరేకించి మార్క్సిస్టులు కానివారు సైతం అధ్యయనం చేయవలసిన వాడయ్యాడు.

గ్రాంసీ రాజకీయ సామాజిక అంశాల మీద చేసిన కొత్త ఆలోచనలు ఇరవయ్యొకటో శతాబ్దపు మనుగడకు సూచికలయ్యాయి. గ్రాంసీని చదివి కొందరూ చదవకనే కొందరు అనుసరించడం దాదాపు తొమ్మిది దశాబ్దాల తర్వాత కూడా నిలబడిన అతని సిద్ధాంతాలలోని సమకాలీనతకు నిదర్శనం. మార్క్సిజానికి కొనసాగింపుగా గ్రాంసీ చేసిన ప్రతిపాదనలు ప్రపంచానికి కొత్తదారి చూపించాయి.

ఆర్థికసంబంధాలు పునాదిగా రాజకీయ సామాజిక మత సాంస్కృతిక సంబంధాలు నిర్మితమౌతాయనే రెండంచెల మార్క్సిస్ట్ దృక్పథంలో పౌరసమాజం అనే మధ్య అంచె ఉండడాన్ని గుర్తించాడు గ్రాంసీ. అది రాజ్య, న్యాయ, రక్షక వ్యవస్థల్లో భాగం కాని విభాగం. ఆర్థికసంబంధాలు మాత్రమే సామాజిక సాంస్కృతిక సంబంధాలని నిర్ధారించవనీ వాటి మధ్య ఆదానప్రదానా లుంటాయనీ అనడంతో గ్రాంసీకి కొత్త దారులు తెరుచుకున్నాయి.

సమకాలీన సమాజంలో విరివిగా వాడబడుతూ చర్చకు గురౌతున్న 'సాంస్కృతిక ఆధిపత్యం' (కల్చరల్ హెజిమొని) భావన ఆంటోనియో గ్రాంసీతో ముడిపడి వుంది. ఇటలీలో ఫాసిజం ఆవిర్భావం వెనుక పనిచేసిన రోమన్ సాంస్కృతిక పునరుజ్జీవన భావజాలం గ్రాంసీని ఆలోచింప చేసింది. ఫాసిజం పేరిట ప్రగాఢ జాతీయభావం ఏర్పడడంలో ముస్సోలిని ప్రేరేపించిన రోమన్ సంస్కృతీ ఔన్నత్యం నిర్వహించిన పాత్ర గమనంలోకి వచ్చింది.

అట్లాగే మొదటి ప్రపంచయుద్ధం తర్వాత ఇటలీలో ఏర్పడ్డ ఆర్థికమాంద్యం, రాజకీయ అస్థిరత, శ్రామికోద్యమాల వైఫల్యం నేపథ్యం లోంచి సాంస్కృతిక ఆధిపత్యం నిర్వహించగలుగుతున్న పాత్రను ఆయన అంచనా వేశాడు. ఆధిపత్యవర్గాలు ఆధిపత్య భావజాలాన్ని రాజకీయ రంగంలో బలప్రయోగంతో సాధించ గలిగితే సాంస్కృతిక రంగంలో పౌరసమాజం అంగీకారంతో సాధించ గలుగుతాయని సూత్రీకరించాడు. ప్రభుత్వవర్గాల సాంస్కృతిక భావజాలమే విధాయకమనీ, అనుసరణీయమనీ, అదే తమ భావజాలం కూడా అని పౌరసమాజం చేత కూడా ఆమోదింప చెయ్యడాన్ని కల్చరల్ హెజిమొనిగా నిర్వచించాడు. ఫాసిస్టు ప్రభుత్వాలే కాదు సోషలిస్టు వ్యవస్థలో శ్రామికవర్గాలు కూడ తమ సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పుకోగలగాలని సూచించాడు గ్రాంసీ. ఈ క్రమంలో కలుపుకు వెళ్లవలసిన సామాజిక ఉపశ్రేణుల్ని ప్రస్తావిస్తూ వారిని మొదటిసారిగా సబాల్టర్న్ వర్గాలుగా పేర్కొన్నాడు. ఈ వర్గాల ఐక్యత రాజ్యాధికార స్థాపనను సుగమం చేస్తుందని సూచించాడు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ సమాజంలోని ఒకానొక ప్రాథమికవర్గం ఇతర సామాజిక ఉపశ్రేణుల్ని సమీకరించడం ద్వారా సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పవచ్చుననీ, ఈ క్రమంలో వారి భాష, సంగీతసాహిత్యాలూ, కళలూ, జానపద సంప్రదాయాలూ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాయనీ అన్నాడు.

గ్రాంసీ మేధావుల్ని రెండు రకాలుగా వర్గీకరించాడు. ఇతరుల్ని సంప్రదాయ మేధావులుగా పేర్కొన్న గ్రాంసీ ఆయా వర్గాల నుంచీ ఉపశ్రేణుల్నించీ రూపొందే మేధావుల్ని సవర్గ మేధావులని (ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్) అన్నాడు. గ్రాంసీ అభిప్రాయంలో రాజకీయకార్యకర్తలు, నిర్వాహకులు, ఉద్యమ నాయకులు కూడా మేధావులే. భౌతిక, బౌద్ధిక కార్యకలాపాల పట్ల గ్రాంసీ తేడా చూపలేదు. ఏ భౌతిక కార్యకలాపమైనా ఎంతో కొంత బుద్ధిని ఉపయోగించకుండా ఎట్లా సాధ్యపడదో దేన్నైనా అధ్యయనం ద్వారా గ్రహించడానికి కొంతైనా శారీరకశ్రమను వినియోగించాల్సిన అవసరాన్ని గుర్తించాడు. ఉద్యమాన్ని యుద్ధంగా భావిస్తూ యుద్ధవిన్యాసం, యుద్ధవ్యూహం అనే రెండు తంత్రాలను ప్రతిపాదించాడు గ్రాంసీ. శత్రువును సరాసరి ఎదుర్కోవడం యుద్ధ విన్యాసమైతే, ఇతరవర్గాలతో స్నేహ సంబంధాలు, పౌరసమాజ అంగీకారం పొందడం వంటివి యుద్ధవ్యూహంలో భాగాలు.

అనేక వైరుధ్యాలుండే లోకజ్ఞానం లేదా కామన్ సెన్స్ గురించి కూడా గ్రాంసీ రాస్తాడు. అనేక ప్రాపంచికదృక్పథాలు ఉన్నాయనీ అవి పరస్పర విరుద్ధ తత్వాలతో అసంపూర్ణ పూర్ణత్వాన్ని కలిగి వుంటాయనీ దాన్నే లోకజ్ఞానం అంటారనీ అన్నాడు. అసమానత్వం, అణచివేత వంటివి సహజమైనవీ, మార్చ వీలు లేనివీ అనే భావనలు ఈ కామన్ సెన్స్ నుంచే వస్తాయంటాడు. అయితే దీనిని విలోమచైతన్యంగానో వ్యతిరేకచైతన్యంగానో భావించడానికి వీల్లేదని అంటూ అందులో కొంత సత్యమూ ఉండకపోదంటాడు.

అనేక సందర్భాలలో జైలు అధికారుల సెన్సార్ నుంచి తప్పించుకోవడం కోసం మార్క్సిజంకు ఆచరణీయసూత్రాల తత్వం (ఫిలాసఫీ ఆఫ్ ప్రాక్సిస్) గా మారుపేరు పెట్టిన గ్రాంసీ దానిని ఒక నైరూప్య తాత్వికతగా భావించలేదు. అది ప్రజల స్థితిగతులు తాము అనుభవిస్తున్నంత సహజంగా వారి చైతన్యంలోకి కామన్ సెన్స్‌లోకి ఇంకిపోయేటట్లు చెయ్యగలిగేదిగా చూశాడు. ఫిలాసఫీ ఆఫ్ ప్రాక్సిస్ అంటే గ్రాంసీకి సమాజంలోని వైరుధ్యాలను గుర్తించే శాస్త్రమే కాదు, ఆ వైరుధ్యాల మీద అనుభవపూర్వక అవగాహన కూడా ఉండడం. అది అతనికి తాము జీవిస్తున్న కాలపు స్వీయ చారిత్రక అవగాహన.

గ్రాంసీ 1937లో చనిపోయినా ఫాసిస్టు ప్రభుత్వ పతనం తర్వాత 1945 నుంచే అతని రచనలు వెలుగు చూడడం ప్రారంభమైంది. 1971 వరకు వాటి ఇంగ్లీషు అనువాదమే వెలువడలేదు. 1980కి ఇటలీలో అతని సర్వలభ్య రచనల సంకలనం వచ్చింది. ఈ లోగా రష్యాలోనూ, తూర్పు యూరప్ లోనూ సోషలిస్ట్ వ్యవస్థల పతనం ప్రారంభమైంది. మార్క్సిస్ట్ సిద్ధాంతం ఆచరణ మీద నీడలు వ్యాపించాయి. కొత్త సామాజిక సమీకరణాలు రూపొందడం ఆరంభమైంది. ఈ నేపథ్యంలో గ్రాంసీ రచనల అధ్యయనం పెరిగింది. 1980 లకు ముందూ వెనుకా లేవనెత్తబడిన కొన్ని ప్రశ్నలకి గ్రాంసీలో సమాధానాలు దొరికాయి.

ఆర్థిక సంబంధాల పునాది మీద మాత్రమే రాజకీయ సామాజిక వ్యవస్థలు నిర్మితం కావనీ అవి పరస్పర ఆధారితాలనీ, ఆర్థిక సంబంధాలు రాజకీయ సామాజిక సంబంధాలను ఒకవైపు రూపొందిస్తూ మరో వైపు నిర్వహిస్తే, రాజకీయసామాజిక సంబంధాలు ఒకవైపు ఆర్థిక సంబంధాలను రూపొందిస్తూ మరో వైపున నిర్వహిస్తాయన్న గ్రాంసీ చాలామందికి

ఆమోదయోగ్యుడయ్యాడు. మతం ఆర్థికం మొదలైన అంశాల మీద ఆర్థికం ప్రభావం ప్రశ్నార్థకమైంది. గ్రాంసీ ప్రతిపాదించిన సాంస్కృతిక ఆధిపత్యం భారతదేశంలో వేర్వేరు కోణాల్లో చర్చకు వచ్చింది. బూర్జువాప్రభుత్వం తన భావజాలాన్నే ప్రజల భావజాలం గా అంగీకరింపచెయ్యడంలో విజయం సాధిస్తుందనీ దానికి ప్రత్యామ్నాయంగా శ్రామికవర్గాలు ఇతర సామాజికవర్గాలను కలుపుకుని తానే సాంస్కృతిక ఆధిపత్యం నెలకొల్పాలనే గ్రాంసీ భావనకు ప్రచారం వచ్చింది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ మెజారిటీ ప్రజల మత పార్టీ అయినందున అది సాంస్కృతిక ఆధిపత్యం సునాయాసంగా సాధించగలిగింది. గ్రాంసీ ప్రతిపాదించినట్టుగానే రాజకీయ ఆధిపత్యం వెనుక సాంస్కృతిక ఆధిపత్యం దన్నుగా నిలబడింది. ఈ నేపథ్యంలో దేశవ్యాపితంగా విస్తరిస్తున్న లౌకికోద్యమాలు గ్రాంసీని సజీవుణ్ణి చేస్తున్నాయి.

గ్రాంసీ ప్రయోగించిన వాటిల్లో ప్రపంచం మీద, భారతదేశం మీద విస్తారమైన ప్రభావం చూపిన పదం ఆయనే మొదటిసారి ఉపయోగించిన ఉపశ్రేణులు (సబాల్టర్న్). సబాల్టర్న్ గ్రూప్స్ అనీ, సబాల్టర్న్ క్లాసెస్ అనీ గ్రాంసీ ఉపయోగించిన మాటలు జైలు సెన్సార్‌ను తప్పించుకునేందుకు ప్రోలెటేరియెట్‌కు ప్రత్యామ్నాయంగా వాడాడని భావించినప్పటికీ అనేక సందర్భాలలో అది శ్రామికవర్గం ఇతర ఉపశ్రేణులతో కలవడం గురించిన సందర్భమే కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రోలెటేరియెట్‌లోని ఆర్థికకోణాన్ని సబాల్టర్న్‌లోని సామాజిక సాంస్కృతిక కోణంలోకి కొనసాగించడమే గ్రాంసీ తెచ్చిన విప్లవం. ఇది అంతర్జాతీయస్థాయిలో రణజిత్ గుహ వంటి చరిత్రకారుల సారథ్యంలో ఆదివాసీల స్త్రీల రైతుల దృష్టి నుంచి చరిత్రను పునర్నిర్మించడానికి దారితీస్తే దేశీయంగా స్థానికంగా అనేక అస్తిత్వ ఉద్యమాలు ఆవిర్భవించడానికి కారణమైంది. ఆర్థిక తారతమ్యం ప్రాతిపదికగా ఏర్పడిన శ్రామికవర్గం నుంచి సాంస్కృతిక వివక్షకు గురైన వర్గాలు విడిపోవడం గ్రాంసీ అవసరాన్ని ముందుకు తెస్తున్నది. ఉన్నవాళ్లు లేనివాళ్లూ అనే అడ్డుకోత విభజన నుంచి అగ్రవర్ణాలూ నిమ్నవర్ణాలూ, స్త్రీలూ పౌరుషులూ అనే నిలువుకోత విభజన జరుగుతున్నప్పుడు ఈ రెండురకాల విభజనలో ఎక్కువగా ఉన్నది శ్రామికవర్గాలు. కార్మికకర్షక వర్గంలో అధికంగా ఉన్నది దళిత బహుజనులైతే, దాదాపు దళిత బహుజనులంతా శ్రామికవర్గమే. కులం, వర్గం అనేవి రెండు వేర్వేరు సమస్యలైనా ఎదుర్కొంటున్న శ్రేణి ఒక్కటేనని గుర్తించడంలో గ్రాంసీ వర్తింపు ఉంది. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా అగ్రవర్ణస్వామ్యంగా కొనసాగుతున్న పరిస్థితి నుంచి మారడానికి కావలసిన పరిస్థితుల్లో ఉపశ్రేణుల మధ్య ఏర్పడవలసిన సంఘీభావం గ్రాంసీ ప్రస్తావించిన యుద్ధవ్యూహ స్థితికి సరిపోలుతుంది. దేశజనాభాలో అరవై ఆరు శాతం ఉన్న ఈ శ్రేణులు ప్రధానశ్రేణులుగా రూపొందడానికి రాజ్యాధికారసాధనే లక్ష్యమని గుర్తించడంలోనూ గ్రాంసీ ఉంటాడు. ఐదువేల సంవత్సరాల నాగరిక చరిత్రలోనే కాదు, ఏడు దశాబ్దాల గణతంత్రంలోనూ ఈ వర్గాలకు రాజ్యాధికారం అందని ద్రాక్షే అయ్యింది. అందలేదు కదా అని ద్రాక్ష పుల్లనిదని సరిపెట్టుకునే కాల్పనికతకు కాలం చెల్లిందను కోవడంలో గ్రాంసీ ఉంటాడు. అధికారం క్రమేపీ క్రిందివర్గాలకి అందడమే చరిత్రగమన లక్షణమని గుర్తిస్తే ప్రాచీనయుగంలో రాచరికవర్గానికీ, మధ్యయుగంలో భూస్వాములకూ, ఆధునిక యుగారంభంలో ఉన్నత మధ్య తరగతికీ అందివచ్చిన అధికారం ఇప్పుడు దళిత బహుజన శ్రామిక వర్గాలకు దక్కవలసి ఉందనుకోవడంలో గ్రాంసీ అస్తిత్వం ఉంటుంది.

ఈ నేపథ్యంలో చూసినపుడు గ్రాంసీ– అంబేద్కర్ ల మధ్య ఎన్నో పోలికలు కనిపిస్తాయి. ఇద్దరూ 1891 లోనే జన్మించారు. ఇద్దరూ తమ వర్గం చైతన్యీకరింపబడడంలోనే ఆ వర్గం భవిష్యత్తు ఉందని గుర్తించారు. ఇద్దరూ రాజ్యాధికార స్థాపన వెనుక సాంస్కృతిక ఆధిపత్య స్థాపనలో తమతమ వర్గాలు నాయకత్వం వహించాలని కాంక్షించారు సైద్ధాంతికంగా సవర్గ మేధావుల గురించి గ్రాంసీ రాస్తున్నపుడే అంబేద్కర్ అందుకు గొప్ప ఉదాహరణగా ఆవిర్భవించడం వారిద్దరి మధ్య బలీయమైన బంధాన్ని సృష్టిస్తోంది. వారి తులనాత్మక అధ్యయన అవసరాన్ని సూచిస్తోంది.

గ్రాంసీ గతం కాదు. అతను ప్రస్తుతం. బీమాకోరేగావ్ కేసులో వరవరరావు, తెల్తుంబ్డే తదితరుల్ని నిర్బంధంలోకి తీసుకోవడం ఫాసిస్టు నియంత ముస్సోలిని మీద హత్యాప్రయత్న నేరారోపణ మీద గ్రాంసీని నిర్బంధంలోకి తెసుకోవడాన్ని గుర్తుకు తెస్తున్నది. అందుకే గ్రాంసీ అన్న ఈ వ్యాస ప్రారంభ వాక్యాల్నే ఇక్కడ పునరుల్లేఖించవలసి వస్తున్నది.

'పాతప్రపంచం మరణిస్తూ కొత్త ప్రపంచం జనిస్తున్న ఈ సంధికాలంలో రాక్షసులు రాజ్యమేలుతున్నారు.' ❑


# మార్క్సిజాన్ని సుసంపన్నం చేసిన ఎంగెల్స్



డి వి వి ఎస్ వర్మ

ఫ్రెడరిక్ ఎంగెల్స్ కేవలం మార్క్సుకు సహచరుడు మాత్రమే కాదు, ఆయన చేసిన అనేక రచనలకు భాగస్వామి. అంతకు మించి ఎంగెల్స్ తన స్వీయ రచనలతో మార్క్సిజాన్ని పరిపుష్టం చేసినవాడు.

1820 నవంబరు 28న నాటి జర్మనీలోని ప్రష్యా రాష్ట్రంలో బార్మెన్ పట్టణంలో జన్మించిన ఎంగెల్స్‌కి ఇది ద్విశతజయంతి సంవత్సరం. ఎంగెల్స్ కంటే రెండేళ్ళు పెద్ద అయిన మార్క్స్ ద్విశతజయంతి ఉత్సవాలు 2017 నుండి 2018 వరకు ప్రపంచమంతటా జరిగాయి. సంక్షోభంలో కూరుకుపోయిన ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థం చేసుకోడానికి, ప్రత్యామ్నాయాలను అన్వేషించడానికి తగిన మార్గాలు మార్క్స్ రచనలతోనే ఉన్నాయని చివరకు ఉదారవాద ఆర్థికవేత్తలు కూడా ప్రకటించాల్సి వచ్చింది. ఈ వ్యవస్థను మార్చాలన్న భావనలకు, ఉద్యమాలకు మార్క్స్ ద్విశత జయంతి ఉత్సవాలు సరికొత్త ఉత్తేజాన్ని కలిగించాయి. ఇప్పుడు ప్రారంభమౌతున్న ఎంగెల్స్ ద్విశత జయంతి ఉత్సవాలు దానికి కొనసాగింపుగా జరగాలి. మార్క్సిజంలోని చారిత్రిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో కొన్నింటికి పునాదినీ, మరికొన్నింటికి పరిపుష్టినీ కల్పించిన ఎంగెల్స్ రచనలు, సాగించిన విప్లవ కార్యకలాపాలు మరోమారు ప్రపంచాన్ని నిస్సందేహంగా ప్రభావితం చేస్తాయి.



మార్క్స్ గురించి ఏంగెల్స్ "కొన్ని ప్రత్యేక రంగాలలో నేను చేసిన కృషిని మినహాయిస్తే ఇతర రచనలలో నేను సమకూర్చిన అంశాలను నేను లేకపోయినా మార్క్స్ తనంతటతానే చేయగలిగే వాడు. కానీ మార్క్స్ సాధించిన అంశాలను నేనుగా అందుకోలేక పోయి వుండేవాడిని. ఆయన మాకంటే చాలా ఎత్తులో ఉన్నందున చాలా దూరంగా వున్న వాటిని కూడా చూడగలగడమే కాదు మరింత సమగ్రంగా అత్యంత శీఘ్రంగా వాటిపై అభిప్రాయాలను చెప్పగలిగేవాడు. మార్క్స్ గొప్ప మేధావి. మేము మహా అయితే ప్రావీణ్యం గల వ్యక్తులం మాత్రమే . ఆయనే ఉండి ఉండకపోతే ఈ సిద్ధాంతం ప్రస్తుత స్థితికి ఎంతో దూరంలో వుండివుండేది" అందుచేత మార్క్స్ పేరుతో ఈ సిద్ధాంతం ఉండడమే సరైంది" అని చెప్పిన ఈ మాటలు ఆయన నమ్రతను సూచిస్తాయే కాని అవి పూర్తి సత్యాలు కావు. ఎందుకంటే ఎంగెల్స్ చేసిన కృషి కేవలం "కొన్ని రంగాలకు" మాత్రమే పరిమితమైంది కాదు. మార్క్స్‌తో భాగస్వామ్యం వహించి చేసిన సిద్ధాంతపరమైన రచనలు ఏక పక్షంగా సాగినవి కావు. అవి ఆదాన ప్రదానాలు

ఎంగెల్స్ జీవిత చిత్రణ చేసిన చాలా మందిలో ఆయనను ఒక వ్యాపారవేత్తగా, మార్క్స్‌కు జీవిత కాల మిత్రునిగా, ఆర్థికంగా సహాయపడిన వ్యక్తిగా చూపే ప్రయత్నాలే కనిపిస్తాయి. అంతకు మించి శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతానికి ఎంగెల్స్ సమకూర్చిన భూమికను అవి తక్కువ చెయ్యడం జరిగింది. ఎంగెల్స్ కేవలం మార్క్స్ నీడతో మెరిసిన చంద్రుడు కాదు. మార్క్స్‌లాగే ఆయన కూడా స్వయంప్రకాశం గలవాడే. ఇది మార్క్స్‌ను తగ్గించి చూపడం ఎంత మాత్రమూ కాదు. వారు సమఉజ్జీలు అయినందునే అది వారి చిరకాల స్నేహానికి, పరస్పర పూరకమైన రచనల భాగస్వామ్యానికి, శాస్త్రీయ దృక్పథాన్ని పలు రంగాలకు అన్వయించడానికి స్థిరమైన పునాది అయ్యింది

ఎంగెల్స్ చదువు హైస్కూల్ మధ్యలోనే ఆగిపోయింది. స్వయంకృషితోనే అర్థశాస్త్రం, మానవ పరిణామ చరిత్ర అధ్యయనంతో పాటు తత్వశాస్త్రం, సైన్స్, సాహిత్యం, మిలటరీకి సంబంధించిన విషయాలతో పాటు అనేక రంగాలలో మంచి పరిజ్ఞానం పొందారు. ఇంగిలీషులో ప్రావీణ్యంతో పాటు దాదాపు 20 భాషలు నేర్చుకున్నారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు మొదటసారి 1842లో కొలోన్‌లో కలుసుకున్నారు. ఈ సమావేశంలో వారు ఒకరిని గురించి మరొకరు ప్రత్యేకంగా తెలుసుకున్నది ఏమీ లేదు. 1844 లో పారిస్ నుండి యంగ్ హెగెలియన్ ఆర్నాల్డ్ రూజ్ ప్రచురిస్తున్న "ది జర్మన్, ఫ్రెంచ్ ఇయర్ బుక్" రూపకల్పనలో భాగస్వామిగా మార్క్స్ అక్కడికి వెళ్లారు. దీనిలో ప్రచురణ కోసం ఎంగెల్స్ రాసిన "అవుట్ లైన్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" వ్యాసం మార్క్స్‌ను విశేషంగా ఆకట్టుకుంది. ఇది ఒక పురోగామి మేధావి రచనగా పేర్కొన్నాడు. జర్మనీ వెళ్ళేటప్పుడు తనతో పారిస్‌లో కొన్ని రోజులు ఉండేలా రమ్మని ఎంగెల్స్ ను కోరాడు. అలా వారిద్దరూ 1844 ఆగస్టులో పారిస్‌లో పది రోజుల పాటు కలిసి వున్నారు.

ఈ పది రోజులలో వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు . చారిత్రకాభివృద్ధి క్రమంలో బూర్జువా సామాజిక వ్యవస్థ ఒక దశ మాత్రమేనని అది మారి తీరుతుందనీ కార్మిక వర్గం ఆ మార్పును సాధించే విప్లవకర వర్గమనీ అదే సోషలిజానికి లేదా కమ్యూనిజానికి మార్గం అని ఉభయులూ భావించారు. ఇవి చర్చల నుండి వచ్చిన భావ సారూప్యత కాదు. అంతకు ముందే ఎవరికి వారుగా వచ్చిన నిర్ధారణలు. పైగా వేర్వేరు మార్గాల ద్వారా పొందినవి. బ్రిటీష్ క్లాసికల్ అర్ధశాస్త్రాల, బ్రిటీష్ లేబర్ ఉద్యమాల అధ్యయనం ద్వారా ఎంగెల్స్, మరో పక్క మార్క్స్ ఫ్రెంచ్ విప్లవాన్ని, దాని నుండి ఉత్పన్నమైన కార్మికవర్గ రాడికలిజం, సోషలిస్టు సమానత్వ భావజాలాల అధ్యయనం నుండి పై నిర్ధారణలకు చేరుకున్నారు. ఇలా మార్క్స్, ఎంగెల్స్‌లు భిన్న మార్గాలలో ఒకే లక్ష్యానికి చేరుకున్న మేధాసంపన్నులు.

ఈ దిగ్గజాల కలయికతో మార్క్సిస్టు సిద్ధాంతం రూపు దిద్దుకోడానికి మూలాధారాలైన బ్రిటీష్ క్లాసికల్ అర్ధశాస్త్రం, ఫ్రెంచ్ ఊహాజనిత సోషలిజం, జర్మన్ క్లాసికల్ ఫిలాసఫీలు ఒక్కచోటికి చేరినట్లయింది. ఒకే లక్ష్యంకోసం ఏకమైన ఈ ఇద్దరూ చివరిదాకా అదే బాటలో నడిచారు. ఒకపక్క విప్లవ సిద్ధాంతాలకు పదును పెట్టడం, మరోపక్క దానిని ఆచరణలో పెట్టగల విప్లవ కార్మికోద్యమాన్ని నిర్మించే పనిలో పూర్తిగా నిమగ్నమయ్యారు.

ఎంగెల్స్ పారిస్‌ను వదిలి వెళ్లే ముందే "ది హోలీ ఫ్యామిలీ – ఎ క్రిటిసిజం ఆఫ్ క్రిటికల్ క్రిటిసిజం" పుస్తకంలో తొలి ప్రకరణం రాసి ఇచ్చాడు. మార్క్స్ దానిని పూర్తి చేశారు. తర్వాత 1848లో కమ్యూనిస్టు లీగ్ కోసం ఎంగెల్స్ ముందుగా "కమ్యూనిస్టు సూత్రాలు" పేరుతో, ప్రశ్నలు జవాబుల రూపంలో ముసాయిదాను రాశారు అది మార్క్స్ – ఎంగెల్స్‌ల ఉమ్మడి రచనగా నేటికీ ప్రపంచ ప్రసిద్ధమైన 'కమ్యూనిస్టు ప్రణాళిక'కు ప్రాతిపదిక అయ్యింది. మార్క్స్ రచనలలో చాలా వాటికి అర్ధవంతమైన ముందు మాటలను ఎంగెల్స్ రాశారు. మార్క్స్‌కు తీరిక దొరకనప్పుడు న్యూయార్క్ ట్రిబ్యునల్‌కు ఆయన పేరుతో ఎంగెల్స్ కొన్ని వ్యాసాలు కూడా రాశారు. అలా విడదీయరాని భావజాల అనుబంధం వారిది.

ఎంగెల్స్ స్వీయ రచనలు కూడా చాలా ప్రసిద్ధమైనవి. మార్క్సిజాన్ని పలు రంగాలకు వర్తింపజెయ్యడం ద్వారా దానిని మరింత సుసంపన్నం చేశాడు.

"యాంటీ డ్యూరింగ్" గ్రంథంలో మార్క్సిస్టు తత్వశాస్త్రపు మూల సూత్రాలు విస్పష్టంగా, హేతుబద్ధంగా విపులీకరించాడు. ఆర్థిక సిద్ధాంతానికి శాస్త్రీయమైన పునాదులు వేశాడు. తర్వాత కార్మికుల కోసం ఈ పుస్తకం లోని కొన్ని భాగాలను వేరుచేసి "సోషలిజం : ఊహాజనితము శాస్త్రీయము" అన్న పేరుతో ప్రచురించారు. సోషలిజానికి శాస్త్రీయ పునాదిని ఆవిష్కరిస్తూ గతితర్కాన్ని, చారిత్రిక భౌతికవాదాన్నీ విపులీకరించాడు. ఎంగెల్స్ రచనలలో ఈ పుస్తకం ప్రపంచ వ్యాపితంగా అత్యంత ప్రాచుర్యాన్ని పొందింది.

**ఎంగెల్స్ వర్ధంతి వ్యాసాలు**

ఎంగెల్స్ మరో రచన "ప్రకృతి గతితర్కం". ఇందులో ఆయన తన కాలపు ప్రకృతి విజ్ఞాన శాస్త్రాలు సాధించిన అతి ముఖ్య విజయాలన్నింటికీ తాత్విక పరమైన సాధారణీకరణలు చేశాడు

అలాగే "లుడ్విగ్ ఫ్యూయర్ బాక్ – సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి" అనే పుస్తకంలో తత్వశాస్త్రపు మౌలిక సమస్య చైతన్యానికీ అస్తిత్వానికీ, పదార్థానికీ భావానికీ మధ్య ఉన్న సంబంధాలకు సంబంధించినదే అన్న ప్రధానాంశాన్ని ఎంగెల్స్ శాస్త్రీయంగా నిరూపించాడు.

జర్మనీలో రైతు యుద్ధం పేరుతో రాసిన పుస్తకంలో కార్మిక వర్గానికి రైతాంగంతో గల విప్లవకర భాగస్వామ్యాన్ని చరిత్ర మూలాల నుండి ఆవిష్కరించాడు. కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం అన్న పుస్తకంలో చారిత్రకంగా సాగిన సామాజిక అభివృద్ధి క్రమాన్ని విశ్లేషించాడు.

వీటికి తోడు మార్క్స్ మరణానంతరం ప్రచురణకు సిద్ధంగా లేని కాపిటల్‌లోని రెండు, మూడు భాగాలను పరిష్కరించి ప్రచురించి తన చిరకాల మిత్రుని కలను సాకారం చేశాడు.

అదే కాలంలో అంతర్జాతీయ కార్మికోద్యమ నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశాడు. మార్క్స్ మరణానంతరం తానే సారధిగా కొత్త సోషలిస్టు ఇంటర్నేషనల్ స్థాపనకు పూనుకున్నాడు. 22 దేశాలకు ప్రాతినిధ్యం వహించే 407 మంది ప్రతినిధులు 1889 జూలై 14న పారిస్‌లో మార్క్సిస్టుల మొదటి మహాసభ జరిగింది. "సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!" అన్న నినాదంతో, ఎనిమిది గంటల పని దినాన్నీ, అంతర్జాతీయ కార్మికవర్గ సంఘీభావాన్ని సాధించుకొనేందు కోసం ఏటా మే 1 న ప్రదర్శనలు జరపాలని సూచించింది.

1895 మార్చిలో ఆయన అస్వస్థత తిరగబెట్టింది. 1895 ఆగస్టు 5న రాత్రి పదిన్నర గంటలకి ప్రముఖ పండిత విప్లవకారుడూ, శాస్త్రీయ కమ్యూనిజం మూల పురుషుల్లో ఒకడూ అయిన ఎంగెల్స్ హృదయ స్పందనం శాశ్వతంగా నిలిచిపోయింది

ఎంగెల్స్ ద్వి శతజయంతి ఉత్సవాలు అర్ధవంతంగా స్ఫూర్తి దాయకంగా జరుగుతాయని ఆశిద్దాం. ❑

# నేటికీ ఏంగెల్స్ కృషి శ్లాఘనీయమే



గుడిపాటి నరసింహారావు

నేడు ప్రపంచ వ్యాప్తంగా విద్య, వైద్యం, ఆరోగ్యం ప్రభుత్వ రంగంలో ఉండడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటో....ప్రభుత్వ రంగంలో లేని పక్షంలో ప్రజల ప్రాణాలకు ఏర్పడే ముప్పు ఏమిటో... కోవిడ్ మహమ్మారి హెచ్చరిస్తోంది. విద్య, వైద్యం ప్రభుత్వమే నిర్వహించాలని తన 27వ ఏటనే 'కమ్యూనిజం సూత్రాలు' రచనలో ఒక అంశంగా ప్రతిపాదించిన ఫ్రెడరిక్ ఏంగెల్స్ 200వ జయంతి సంవత్సరమిది. ఆయన పరిశోధించి రూపొందించిన సిద్ధాంత విషయాలను నేటి తరం, కమ్యూనిస్టులు తెలుసుకోవాలి.



జర్మనీలో పరిశ్రమలు, పెట్టుబడిదారీ విధానం వేగంగా పెరుగుతున్న 18వ శతాబ్దపు రోజులవి. 1820 నవంబరు 28న బార్మెన్ నగరంలో ఒక బట్టల మిల్లు యజమాని తొలి సంతానంగా ఏంగెల్స్ జన్మించాడు. తన చదువు పూర్తి చేసుకున్న రోజు నుండి మరణించే వరకు కార్మికవర్గం బాధలు పోగొట్టేందుకు, సమాజం ఉన్నతంగా ఉండేందుకు జరగాల్సిన మార్పుల గురించి కృషి చేశాడు. సిద్ధాంతం, ఆచరణ మేళవింపుగా ఏంగెల్స్ జీవితం మనకు కనపడుతుంది. ఏంగెల్స్ 1839-42 మధ్యకాలంలో 50 వ్యాసాలు, రాజకీయ, సాహిత్య విమర్శకుడిగా పత్రికలకు రాశాడు. 1843లో 'రాజకీయ అర్థశాస్త్ర విమర్శ-ఒక రేఖా చిత్రం' అనే వ్యాసాన్ని రాశాడు. 1845 లోనే ఏంగెల్స్ ఇంగ్లండులోని వివిధ నగరాలలోని కార్మికుల పరిస్థితులను, అక్కడి స్థితిగతులను అధ్యయనం చేసి 'ఇంగ్లండులో కార్మికుల పరిస్థితి' అనే గ్రంథాన్ని రచించాడు. మార్క్స్, ఏంగెల్సులు ఇద్దరూ కలిపి 'పవిత్రకుటుంబం' అనే గ్రంథాన్ని 1846లో ప్రచురించారు. వ్యక్తి ముందా? సమాజం ముందా? అనే దానికి సమాజమే ముందు అని రుజువులతో సహా వివరించారు. 1847లో కమ్యూనిస్టు లీగ్ తీర్మానం మేరకు మార్క్స్, ఏంగెల్సులు 'కమ్యూనిస్టు ప్రణాళిక' రచన బాధ్యత తీసుకున్నారు. అందుకోసం ఏంగెల్స్ తన అభిప్రాయాలను 'కమ్యూనిజం సూత్రాలు' పేరుతో ప్రశ్నలు-సమాధానాల రూపంలో కమ్యూనిస్టు లీగ్‌కు అందించారు. ఆ తర్వాత మార్క్స్‌తో చర్చించిన అనంతరం అందులోని విషయాలను మార్పులు చేర్పులతో 'కమ్యూనిస్టు ప్రణాళిక'గా తయారు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా వందల భాషలలో వేల ముద్రణలతో అత్యంత ప్రభావం చూపిన రచన అది. ఈతి బాధలు లేని సమాజ అవసరం, అందుకు కార్యకారణాలు వివరించేందుకు 'జర్మన్ సిద్ధాంత సంపుటి' గ్రంథాన్ని మార్క్స్‌తో కలసి ఏంగెల్స్ రాశాడు. దీనిలో మానవుడి చైతన్యం- అస్థిత్వంలలో అస్థిత్వం యొక్క ప్రాధాన్యతను వివరించాడు. తత్వశాస్త్రానికి శ్రామిక వర్గానికి అవినాభావ సంబంధంతోనే రెండూ అభివృద్ధి చెందుతాయని నిర్ధారించాడు. హెగెల్ గతితర్కాన్ని బలపరుస్తూనే ఆయన ప్రతిపాదించిన అఖండ భావం పేర భావవాదాన్ని ఖండించిన ఏంగెల్స్ 'దేవుడు మనిషిని సృష్టించలేదు. మనిషే దేవుడిని సృష్టించాడు' అని చెప్పి భౌతికవాదాన్ని సమున్నతంగా నిలిపాడు. ఇదే గతి తార్కిక, చారిత్రక భౌతికవాద సూత్రాలు రూపొందించడంలో ముఖ్య ఘట్టం. 1845 నుండి 1870 వరకు యూరప్ అంతటా సాగిన ప్రజా, కార్మిక తిరుగుబాట్లు ప్రపంచానికి ఏంగెల్స్ తన వ్యాసాలు, రచనల ద్వారా తేటతెల్లం చేసాడు. జర్మనీలో 1848-49లలో జర్మనీలో రైతాంగ విప్లవం జరిగింది. 300 సంవత్సరాల క్రితం జర్మనీలో జరిగిన రైతు యుద్ధం పేరుతో విప్లవం జరిగింది. రెండింటికీ పోలికలు, తేడాలు ఉన్నాయి. 1850లో 'జర్మనీలో రైతాంగ యుద్ధం' ఏంగెల్స్ రచించాడు. 1857లో పర్షియా-చైనా అన్న వ్యాసంలో విదేశీ దాడికి వ్యతిరేకంగా చైనా ప్రజానీకం ప్రతిఘటన నానాటికి పెరగటాన్ని నొక్కి చెప్పాడు. 1870-71

నాటి ఫ్రాన్సు-రష్యా యుద్ధాన్ని గురించి ధారావాహికంగా అనేక వ్యాసాలు రాసి మంచి జర్నలిస్టుగా ప్రాచుర్యం పొందాడు.

25 సంవత్సరాలు కృషి చేసి కారల్ మార్క్స్ రచించిన 'పెట్టుబడి' (దాస్ కేపిటల్) 1867లో విడుదల అయ్యింది. దాని రూపకల్పనలో అనేకసార్లు ఇరువురూ చర్చించి తుదిమెరుగులు దిద్దారు. 1870వ దశాబ్దంలో జర్మనీలో అద్దె ఇళ్ల సమస్య ముందుకు వస్తుంది. దానిపై జరిగిన చర్చలలో ఏంగెల్స్ అనేక వ్యాసాలు రాశాడు. పెట్టుబడిదారీ విధానంలో ఇంటి సమస్య పరిష్కారం కాదని ఏంగెల్స్ వివరించాడు. 1871లో మానవజాతి చరిత్రలో మొదటి కార్మికవర్గ తిరుగుబాటు పారిస్ నగరంలో జరిగింది. కార్మికులు అధికారంలోకి వచ్చారు. దాన్ని 72 రోజులలోనే రాజులు, పెట్టుబడిదారులు కూలగొట్టారు. వేల మంది విప్లవకారులు హత్య చేయబడ్డారు. 'పారిస్ కమ్యూన్' వివరాలు, దాని అనుభవాలు, గుణపాఠాలను మార్క్స్, ఏంగెల్స్ కలసి ఒక రచన ద్వారా తెలిపారు. కార్మికవర్గం విప్లవం ద్వారా అధికారంలోకి రావడం మాత్రమే చాలదు. పాత రాజ్యాంగ యంత్రాన్ని సమూలంగా రద్దు చేయాల్సిన అవసరాన్ని సిద్ధాంతీకరించారు. కార్మికవర్గం కర్షకులతో ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని దానిలో వివరించారు. ఈ పుస్తకం ఎంతో ప్రాచుర్యం పొందింది. పెట్టుబడి గ్రంథం మొదటి సంపుటి కంటే ఈ పుస్తకం ద్వారానే వారికి ఎక్కువ ప్రజాదరణ వచ్చింది.

1872లో 'ప్రకృతి-గతితర్కం' రచించాడు. అందులో 'మన మెదడు, రక్తమాంసాలు ప్రకృతిలో భాగమే' అన్నాడు. ప్రకృతిపై యుద్ధం శత్రువులపై దండయాత్రలా ఉండకూడదని, ప్రకృతి సూత్రాలను తెలుసుకుని వాటిని సరిగ్గా అన్వయించాలని చెప్పాడు. సైన్యోన్మాదం వలన ప్రజల సంక్షేమానికి వెచ్చించవలసిన ఖర్చును దెబ్బ తీస్తుందని 1877 లోనే ఏంగెల్స్ అంటాడు. దాంతోపాటు రాబోయే రెండు ప్రపంచ యుద్ధాలకు చెందిన ప్రాతిపదికలను కూడా తన రచనలలో హెచ్చరించాడు. 1878లో 'యాంటీ డ్యూరింగ్' పుస్తకాన్ని రచించారు. యుద్ధానికి, సైనిక శాస్త్రానికి సంబంధించిన మార్క్సిస్టు ప్రతిపాదనలను క్రోడీకరించి ఇందులో పొందుపరిచాడు. ప్రకృతి విజ్ఞాన శాస్త్ర అధ్యయన క్రమంలో తను సాధించిన తొలి ఫలితాలను ఏంగెల్స్ వివరించాడు. చారిత్రక ఘటనలలో ఎలా అయితే గతితార్కిక సూత్రాలు కనిపిస్తాయో అలాగే ప్రకృతిలో మార్పులలో కూడా గతితార్కిక నియమాలు ఉంటాయని నిరూపించాడు. 1880లో 'సోషలిజం ఊహాజనితం-శాస్త్రీయం' గ్రంథంలో 'వర్గపోరాటం, విప్లవకర మార్పులు లేకుండా పెట్టుబడిదారీ విధానం రద్దు చేయడం సాధ్యం కాని పని' అని వక్కాణించాడు.



'వానరుడు నరుడుగా మారిన క్రమంలో శ్రమ పాత్ర' ఏంగెల్స్ రాశాడు. మనిషి మెదడు పరిణామ క్రమంలో వేగంగా అభివృద్ధి చెందడానికి శ్రమతోబాటు ఆహారం తయారీలో నిప్పును ఉపయోగించడం ఎలా ఉపయోగపడిందో ఏంగెల్స్ వివరించాడు. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థ మానవుడి నుంచి శ్రమను వేరు చేయడానికి ప్రయత్నిస్తుంది. ఆ క్రమంలోనే నిరుద్యోగం పెరుగుతుంది. ఈ క్రమం శాశ్వతం కాదని తిరిగి మానవుడు, శ్రమ విడదీయలేని తీరులో కలిసిపోయి 'శ్రమైక జీవన సౌందర్య' వ్యవస్థ ఏర్పడడం తథ్యమని బలమైన విశ్వాసాన్ని ఈ రచన కల్పిస్తుంది. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం, మోర్గాన్ రాసిన పురాతన సమాజంలలో నిర్ధారణలను వినియోగించుకుని 'కుటుంబం-వ్యక్తిగత ఆస్థి-రాజ్యాంగ యంత్రం' అనే గ్రంథాన్ని 1884లో ఏంగెల్స్ రాశాడు. స్త్రీల మీద పురుషాధిపత్యం సమాజంలో ఏవిధంగా ఎలా పాతుకుపోయిందో వివరించారు. నిజమైన ప్రేమతో తప్ప స్త్రీ పురుషులు కలవడానికి ఉన్న ఆర్థిక కారణాలు ఎప్పుడు తొలగిపోతాయో... అప్పుడు ఈ సమస్యకు సమాధానం దొరుకుతుందని అందులో ఏంగెల్స్ వివరిస్తాడు. కారల్‌మార్క్స్ మరణానంతరం పెట్టుబడి గ్రంథం 2వ, 3వ భాగాలు మార్క్స్ స్ఫూర్తిని, ఆయన ఆలోచన, ప్రతిపాదనల రూపంగా ఏంగెల్స్ కృషితోనే ప్రచురించబడ్డాయి. ఇంగ్లండు, బెల్జియం, జర్మనీ, ఫ్రాన్స్ మరియు యూరప్‌లోని వివిధ దేశాలలో 1844 నుండి1850 వరకూ తిరుగుబాట్లు జరిగాయి. ఏంగెల్స్ ప్రత్యక్షంగా తుపాకి పట్టుకుని కొలోన్‌లో బారికేడ్ల వద్ద పోరాటంలో పాల్గొన్నాడు. ప్రభుత్వాలు పెట్టిన అనేక కేసులు ఎదుర్కొన్నాడు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏర్పాటులో కారల్‌మార్క్స్‌తో పాటు చురుకైన పాత్ర పోషించాడు. మార్క్స్ మరణానంతరం వివిధ దేశాలలోని కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమ నేతలతో సలహాలు, సంప్రదింపులు జరిపి వారికి అనేక రకాలుగా సహకారం అందించాడు. 1895 ఆగష్టు 5న ఏంగెల్స్ తన 75వ ఏట లండన్‌లో మరణించాడు. ❑

# మార్క్సిజం ఎందుకు మెరుగైన తత్వశాస్త్రం?

వస్తువులు వాస్తవంలో ఉన్నాయా? అవి ఎలా మార్పు చెందుతాయి? మార్క్సిజం ఈ అంశాన్ని చర్చిస్తుంది. మరొక మాటలో చెప్పాలంటే వాస్తవ ప్రపంచాన్ని గురించి, దాని మూలాలను గురించి, పరస్పర చర్యల గురించి, మార్పును గురించి అది వివరిస్తుంది.

సుప్రసిద్ధ బ్రిటిష్ తత్వవేత్త బెట్రాండ్ రస్సెల్ 1912లో "తత్వశాస్త్ర సమస్యలు" అనే గ్రంథాన్ని రచించారు. అది ఇప్పటికీ విశ్వవిద్యాలయాల్లో బోధిస్తున్నారు. దానిలో ఒక శీర్షిక "బాహ్య ప్రతిభాస మరియు వాస్తవికత". ఆయన ప్రశ్న ఇలా ఉన్నది... మనం కూర్చునే బల్ల మన ఇంద్రియానుభవాలకు తగ్గట్టుగా ఉన్నదా? ఇలా ముగించారు.." అనుమానం సూచిస్తున్నదేమంటే ఒక వేళ అక్కడ అసలు బల్లంటూ ఏదీ లేదేమో?"


ఆ గ్రంథం చివరి వాక్యం ఇలా ఉన్నది.." తత్వ శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి, ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు కొరకు కాదు, ఏమంటే నిజాన్ని తెలుసుకునేందుకు సూత్రప్రాయంగా కచ్చితమైన సమాధానాలు లేవు, కానీ ప్రశ్నల కొరకు అది (అధ్యయనం) చేయాలి."

ఈ వైఖరి – భావాలు ప్రాథమికమైనవి – ఇదీ తాత్విక భావవాదం

ఇక్కడ మార్క్స్ ప్రసిద్ధ వాక్యాన్ని పేర్కొంటున్నాం "తత్వవేత్తలు ప్రపంచాన్ని పలు విధాల వ్యాఖ్యానించారు. పాయింటేమంటే దానిని మార్చాలి".

బెట్రాండ్ రస్సెల్‌కు అస్థిత్వాన్ని గురించి ఎన్ని అనుమానాలు ఉన్నప్పటికీ ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నించారు. మొదటి ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకించాడు. అణ్వస్త్రాల నిరాయుధీకరణకు ప్రత్యక్ష కార్యాచరణకు దిగాడు. వియత్నాంలో అమెరికా యుద్ధ నేరాలకు వ్యతిరేకంగా ఉద్యమానికి నాయకత్వం వహించాడు. ఫలితంగా జైలు జీవితాన్ని అనుభవించాడు. చాలా మంది మార్క్సిస్టుల వలె ఆయన "ఆదర్శవాది". కానీ వ్యక్తిగత ఆదర్శవాదాన్ని భావ వాద తత్వశాస్త్రంతో గందరగోళపర్చకూడదు.

దీనికి భిన్నంగా, మార్క్సిజం ఒక భౌతికవాద తత్వ శాస్త్రం.



భౌతికవాదం అనే పదాన్ని తరచూ చెడు అర్థంలో ఉపయోగిస్తున్నారు. విలువలు, భావాలు లేని భౌతిక వస్తువులతో దానిని గందరగోళపరుస్తున్నారు. కానీ తత్వ శాస్త్రంలో భౌతికవాదం అనే పదం భిన్నార్థంలో వాడుతున్నారు.

భౌతికవాదం చెప్పేదేంటి? ఈ ప్రపంచం, విశ్వం, ప్రకృతి వాస్తవంలో ఉన్నాయి. సంఘటనలు, చైతన్యంతో సహా భౌతిక క్రమంలో అంతిమంగా ఉత్పన్నమైనవి. మానవులు ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకునేదానికి కృషి చేస్తున్నారు. అది అసంపూర్ణంగా కావచ్చు, పొరపాటుగా కావచ్చు, కానీ ఆ క్రమంలో మనం ఉమ్మడిగా వాస్తవాన్ని గురించి మెరుగైన విజ్ఞానాన్ని పొందగలం.

ఇది నేడు అంగీకరించిన విషయం. అయినప్పటికీ ఇంకా కొంత మంది చరిత్రను వేరుగా భావించేవారు ఉన్నారు.

మహాపురుషులు, మహామేధావులు భౌతిక వాతావరణంతో నిమిత్తం లేకుండా చరిత్ర నిర్మాతలుగా భావించేవారు ఉన్నారు.

మరొక విషయం... భౌతికవాదానికి నిఘంటువులు ఇచ్చే నిర్వచనానికి, మార్క్సిస్టు భౌతికవాదానికి తేడా ఉంది. "భౌతికానికి అతీతంగా ఏదీ ఉండదనే తాత్విక విశ్వాసాన్ని నిఘంటువులు నిర్వచిస్తున్నాయి.

ఆ సూచనను మార్క్సిస్టులు నిరాకరిస్తున్నారు. భావాలు, విలువలు, నీతిని గురించి మార్క్సిస్టులు ఎక్కువగానే చర్చిస్తున్నారు. అయితే భౌతిక ప్రపంచానికి సంబంధం లేకుండా స్వతంత్రంగా విజ్ఞానం, భావాలు, విలువలు, నీతి ఉండజాలవు. ప్రపంచంతో గతితార్కికంగా వాటికి సంబంధాలు ఉన్నాయి. అవి కూడా నిరంతరం మారుతున్నాయి. అలా వాటిని అర్థం చేసుకోవలసిన అవసరం ఉన్నది.

మార్క్సిస్టు గతి తార్కికవాదం చెప్పేదేంటి? మానవులు, ప్రకృతి ఎలా, ఏ విధంగా పనిచేస్తున్నాయో అర్థం చేసుకునే వైఖరిని అది తెలుపుతుంది. ఏదీ శాశ్వతంగా, స్థిరంగా ఉండదు. ప్రతిదీ నిరంతరం చలనంలో ఉంటుంది. మార్క్సుకు ముందే విజ్ఞాన శాస్త్రాల్లో ఈ భావాలు ఉన్నాయి.

భౌతిక శాస్త్రంలో, భూగర్భశాస్త్రంలో, పరిణామ సిద్ధాంతంలో ఈ భావాలు ఉన్నాయి. మార్క్స్, ఎంగెల్స్ ప్రాధాన్యత ఏమంటే ఈ సార్వత్రిక సూత్రం మానవ సంబంధ వ్యవహారాల్లో కూడా పని చేస్తున్నదని వివరించారు. ఉదాహరణకు ఫ్యూడలిజం నుండి కాపిటలిజం అవతరణ క్రమంలో ఆర్థిక, సాంకేతిక, సామాజిక మార్పుల అంతఃసంబంధాల్లో గతి తార్కిక క్రమాన్ని చూడవచ్చు. ఇంకా చెప్పాలంటే, పెట్టుబడిదారులు కార్మిక వర్గాన్ని దోపిడీ చేయడంపై కాపిటలిజం ఆధారపడి ఉంది. పెట్టుబడి అధికారాన్ని కార్మిక వర్గం సవాల్ చేసే చైతన్యాన్ని పెంపొందించుకుంటుంది. సమాజాన్ని మార్చే శక్తి దానిలో ఇమిడి ఉంది.

మార్క్స్, ఎంగెల్స్ ఉభయులు ఈ విషయాలను అర్థం చేసుకునే దానికే జీవితాంతం కృషి చేశారు. మానవ సమాజ అంతర్గత డైనమిక్స్ గురించే కాదు, విశ్వానికి, మానవులకు మధ్య ఉన్న సంబంధం గురించి తెలుసుకునేందుకు కూడా వారు కృషి చేశారు. కేపిటల్ గ్రంథంలో మార్క్స్ ఈ విషయాన్నే నొక్కి చెప్పారు. ప్రకృతిలో మానవులు భాగం. అదే సమయంలో వారు దానిని మార్పు చేస్తారు. ఒక్కోసారి విపత్కర పరిణామాలు జరగవచ్చు.

1883లో మార్క్స్ చనిపోయారు. ఆ తరువాత ఎంగెల్స్ గతి తార్కిక వైఖరిని అభివృద్ధిపరిచారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ముందున్న నాటి సమాజాన్ని గురించి చర్చించారు. కుటుంబం పుట్టుక, ప్రైవేటు ఆస్థి, రాజ్య వ్యవస్థను చర్చించారు. మరికొన్ని వ్యాసాల్లో మానవ సమాజం నుండి మానవేతర ప్రపంచానికి గతితర్కాన్ని విస్తరింపచేశారు. ప్రకృతి గతితర్కం గ్రంథంలో మరికొన్ని అంశాలు చర్చించారు. మానవ పరిణామంపై డార్విన్ భావాలు ప్రాతిపదికగా వాటిని చర్చించారు. ఆయన చనిపోయిన తర్వాత కొన్ని వ్యాసాలు వెలువడ్డాయి.

భౌతికవాదం, తాత్విక భావవాదానికి వ్యతిరేకమైనది. అలాగే, గతితార్కికవాదం యాంత్రిక భౌతికవాదానికి వ్యతిరేకమైనది. గతితార్కిక భౌతికవాదం ఒక విలువైన బోధనా శాస్త్రం. సమస్యల పరిష్కారానికి, విశ్లేషణకు, పరిశోధనకు, ఆచరణాత్మక వైఖరిని అది అందిస్తుంది. అది పర్‌ఫెక్ట్ అని గ్యారంటీ లేదు. కానీ, అది ఆచరణాత్మక విధానం. నిరంతరం అనుభవాల ప్రాతిపదికగా పరీక్షించుకుంటుంది. గతితార్కికవాదం గురించి ప్రత్యేక కష్టమంటూ ఏదీ లేదు. ఈ సందర్భంలో ఎంగెల్స్ అన్న మాటలు గమనించదగ్గవి. ప్రజలు గతితార్కికవాదం అంటే ఏమిటో తెలుసుకోకముందే గతితార్కికంగా ఆలోచించారు.

ప్రముఖ శాస్త్రవేత్తలు నేడు తమ వృత్తిలో భాగంగా గతితార్కిక వైఖరి విలువను వక్కాణిస్తున్నారు. ఉదాహరణకు గణితశాస్త్రం, సిస్టమ్స్ థీరి, చైతన్యానికి, మెదడుకు గల సంబంధం, మానవ పరిణామం, జన్యుశాస్త్రం, పర్యావరణం.

విప్లవ సిద్ధాంతానికి, ఆచరణకు గతితార్కికం పునాది. ప్రతి ఒక్క ప్రశ్నకూ సరైన సమాధానం ఇచ్చే మంత్రదండం లాంటిది కాదు గతితార్కికవాదం. సోషలిజం చరిత్రలో కొన్ని తీవ్రమైన పొరపాట్లు జరిగాయి. కారణం గతితార్కిక వాదాన్ని యాంత్రికంగా అనువర్తింపచేశారు.

మానవ సమాజం గురించి, ప్రకృతి గురించి ప్రశ్నించేందుకు సమాధానాలు కనుగొనేందుకు గతితార్కికవాదం ప్రయోజనకరమైన వైఖరి. ప్రపంచాన్ని వ్యాఖ్యానించేందుకు, మార్పు చేసేందుకు రెండింటికీ అది ముఖ్యమైనది. ❑

*(నేడు కార్ల్‌మార్క్స్ 137వ వర్ధంతి సందర్భంగా)*


*(లండన్, మార్క్స్ మెమోరియల్ లైబ్రరీ, వర్కర్స్ స్కూల్ నుండి స్వేచ్ఛానువాదం)*

# నీవూ మార్క్సిస్టువే

**పీటర్ కావుఫ్‌మన్**

నీవు సోషియాలజీ పరిచయ తరగతికి వెళ్ళినా, సోషియాలజీ సిద్ధాంత తరగతులకు వెళ్ళినా తప్పనిసరిగా సోషియాలజీ అభ్యాసన అంశాన్ని ప్రారంభించిన వాళ్ళలో కార్ల్‌మార్క్స్ ఒకరని విని ఉంటావు.

ఇది ఆశ్చర్యకరంగానూ, ఇబ్బందికరంగానూ అనిపించి ఉంటుంది. ఎందుచేతనంటే ఉన్నత పాఠశాల సామాజిక శాస్త్ర తరగతులలో మార్క్స్ గురించి వేరేగా విని ఉంటారు. నేను కార్ల్‌మార్క్స్ గురించి పాఠం చెప్పేటప్పుడు సాధారణంగా విద్యార్థులను మార్క్స్ గురించి వారికి ఏమి తెలుసనే ప్రశ్నతో ప్రారంభిస్తాను. వాళ్ళ సమాధానాలు మార్క్స్‌కు వ్యతిరేకంగా చెప్పేవే.



మార్క్స్ కమ్యూనిజం పితామహుడు, కమ్యూనిజం చెడ్డది.

మార్క్స్ సోవియట్ యూనియన్, క్యూబాలకు సంబంధించిన వాడు. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో వారు చాలా సంవత్సరాలు మనకు శత్రువులు.

మార్క్స్ అందరూ సమానంగా ఉండాలని కోరుకున్నాడు. ఎవ్వరికీ ఎటువంటి స్వేచ్ఛా ఉండదు.

మార్క్స్ ఒక రాడికల్. విప్లవం కోరుకున్నాడు.

మార్క్స్ భావాలు ఇప్పుడు పనికిరావు. ఎందుచేతనంటే కమ్యూనిజం ఓడిపోయింది. పెట్టుబడిదారీ విధానమే యిప్పుడు ఉంది.

2012వ సంవత్సరం ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ ప్రసార మాధ్యమ పండితులనూ, రాజకీయవేత్తలనూ వింటే మార్క్స్‌ను తిట్లతో ముంచెత్తడం గమనిస్తాం. నిజానికి ఇప్పటికీ ఎవరైనా మంచికీ, అమెరికాకూ వ్యతిరేకులని చెప్పాలంటే మార్క్సిస్టులని వారిని నిందించడం సర్వసాధారణం. రుజువు కోసం ఇంటర్నెట్‌లో మార్క్స్, ఒబామా అని వెదకండి. నేను చెప్పేది ఏమిటో మీకే తెలుస్తుంది.

ఇటువంటి అభిప్రాయాలు మార్క్స్ గురించీ, ఆయన భావాల గురించీ విస్తారంగా ప్రచారంలో ఉన్నప్పుడు విద్యార్థులు మార్క్స్ పట్ల వ్యతిరేకంగా ఉండడంలో వింతేమీ లేదు. మార్క్స్ 150 సంవత్సరాల క్రితం వెలిబుచ్చిన అభిప్రాయాలు అప్పటి కంటే ఇప్పుడే ఎక్కువ ప్రాసంగికత కలిగి ఉన్నాయని నేను చెప్పినప్పుడు విద్యార్థులు ఎంత ఆశ్చర్యపోయారో ఊహించండి. మార్క్స్ అభిప్రాయాలను సరిగా అర్థం చేసుకుంటే మనలో చాలా మందిని మార్క్సిస్టులుగా పరిగణించాలి.

దీనిని వివరించడానికి సామాజిక వర్గంతో జెఫ్ ఫాక్స్‌వర్దీ అనే ఆధునిక కామెంటేటర్‌ని ఉపయోగించుకుంటాను. ఈ కమెడియన్ రాజకీయ ప్రత్యర్థుల్ని గుర్తించే సాధారణ పద్ధతి మీకు బహుశా తెలిసే ఉంటుంది. కమెడియన్ ఫాక్స్‌వర్దీ పద్ధతిలోనే కార్ల్‌మార్క్స్ భావజాలంలో కొన్ని కీలక అంశాలను తీసుకుందాం.

'ప్రతీదీ అంతిమంగా డబ్బు సంబంధితమే' అని నీవు ఎప్పుడైనా అన్నట్లయితే లేదా ఆర్థిక విషయమే సమాజ చోదక శక్తి అని నమ్మినట్లయితే నీవు మార్క్సిస్టువే. మార్క్స్ దీనిని చారిత్రక భౌతికవాదంగా చెప్పారు. మన ప్రాథమిక అవసరం (తిండి,

గుడ్డ, గూడు మొ॥నవి) తీర్చుకోవడానికి చేసిన కృషి ఫలితంగా మన జీవితాలు అభివృద్ధి చెంది ఈ విధంగా రూపుదిద్దుకున్నాయి.

అమెరికాలోనూ, ప్రపంచమంతటా కూడా ధనవంతులు పేదల మధ్య అంతరాలు ప్రతి సంవత్సరం పెరుగుతుండడంపై విచారం, బాధ వ్యక్తం చేస్తే నీవు మార్క్సిస్టువే. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆదాయ అసమానతల వల్ల ప్రతి సంవత్సరం ధనవంతులు మరింత ధనికులుగానూ, పేదలు మరింత పేదలుగానూ అవుతూ అంతరాలు పెరుగుతాయని మార్క్స్ ఊహించాడు. అంతేకాక ఇది చివరకు విస్తృత సామాజిక కలతలకు కారణమవుతుందన్నారు.

ప్రపంచీకరణ కాలంలో మనం ఉన్నామని నమ్మినట్లయితే నీవు మార్క్సిస్టువే. అత్యంత ప్రసిద్ధి పొందిన అన్ని కాలాల్లోను అత్యంత ప్రముఖమైన రాజకీయ పుస్తకంగా ఉన్న కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్, అతని సహచరుడు ఎంగెల్స్ 1848లో పెట్టుబడిదారులు చౌకశ్రమనూ, తమ సరుకులను అమ్ముకోవడానికి క్రొత్త మార్కెట్టులను వెదుకుతూ ప్రపంచమంతా తిరగాల్సి వస్తుందని ఊహించారు. ప్రస్తుతం ఉన్న ప్రపంచీకరణ వాస్తవికత ప్రధాన అంశంగా దీనిని రాజకీయవేత్తలూ, ఆర్థిక శాస్త్రవేత్తలు అందరూ అంగీకరిస్తున్నారు.

చాలా మంది ప్రజలు తమ జీవితాలు సంబంధం లేనివిగా, విడిపడిపోయినవిగా, అసంతృప్తికరంగా, ఆసక్తులు లేనివిగా ఉన్నట్లు తలుస్తున్నారని అనుకున్నట్లయితే నీవు మార్క్సిస్టువే. మీ పాఠశాల కార్యకలాపాలలో, పనిలో అలాగే మీ సాంఘిక సంబంధాలు కొన్నింటిలో పూర్తిగా యిమడలేకపోతున్నట్లు లేదా వ్యక్తిగత సంబంధాలు ఏమాత్రం లేనట్లు భావించినట్లయితే నీవు మార్క్స్ చెప్పిన పరాధీనత లేదా పరాయీకరణను అనుభవిస్తున్నట్లే.

వస్తువులు తయారుచేసిన మనుషుల కంటే తాము కొన్న వస్తువుల పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు అంగీకరిస్తే లేదా ఆ వాస్తవాన్ని గుర్తించినట్లయితే నీవు మార్క్సిస్టువే. మనలో చాలా మంది మనం కొని, వాడే వస్తువులలో చేరిన మానవశ్రమ గురించి ఎప్పుడూ ఆలోచించం. దూరప్రాంతాలలో మన తినుబండారాలు తయారుచేసే, పరికరాలు తయారీలోని కార్మికుల దుర్భర పరిస్థితులు, స్థితిగతుల గురించి ఎప్పుడైనా ఆలోచించారా? లేదా మన సూపర్‌బజార్‌లో కనిపించే వాటిని పండ్ల తోటలలో, కూరగాయలు పండించడంలోని వలస కూలీల పరిస్థితి తెలుసా? తయారుచేసే ప్రజల గురించి పట్టించుకోకుండా తయారైన వస్తువులపైన దృష్టి పెట్టడాన్ని మార్క్స్ 'వస్తు ఆరాధన'గా పేర్కొన్నారు.

లింగ, జాతి, వర్గ, జాతీయత, సామర్థ్యం, మతం మొదలైన నీ సామాజిక స్థితి నీ ఆలోచన, నమ్మకం వంటి వాటిని నిర్దేశిస్తాయని నమ్మితే, కనీసం అనుకుంటే నీవు మార్క్సిస్టువే. కొందరు తమ భావాలు తమ సామాజిక స్థితి నుంచి స్వతంత్రంగా ఉంటాయని భావిస్తుంటారు. తమ భావాలు వారి జీవశాస్త్ర లేదా వ్యక్తిత్వానికి ఆపాదిస్తుంటారు. "నేను నేనే. నేను యిలాగే జన్మించాను" అనుకుంటారు. సామాజిక శాస్త్రవేత్తలు ఈ భావనను వ్యతిరేకిస్తారు. ఏ ఒక్కడూ రేపిస్టుగా పుట్టడు. ఎవ్వరూ నేరస్తుడిగా కాక డాక్టరుగా ఆశించి పుట్టరు. మన సామాజిక నిర్మాణ స్థితి మనం ఈ ప్రపంచాన్ని చూడడంలోనూ, ప్రపంచంలోని మన స్థానాన్ని కనుగొనడంలోనూ అత్యంత ప్రభావం చూపుతుంది. ఇది సోషియాలజీ ప్రాథమిక సూత్రం. ఈ సూత్రం మార్క్స్ నుంచి ప్రత్యక్షంగా వచ్చింది. "వ్యక్తుల చైతన్యం కాదు వాని ఉనికిని నిర్ణయించేది. వారి సామాజిక ఉనికే వారి చైతన్యాన్ని నిర్దేశిస్తుంది".

గొప్ప మేధావులు, రచయితలు వలెనే మార్క్స్ చెప్పినవి సత్యాలు కాకపోవచ్చు. ఆయన చెప్పిన ప్రధాన విషయం పెట్టుబడిదారీ వ్యవస్థను తొలగించి కమ్యూనిస్టు వ్యవస్థ వస్తుందని చెప్పినది రుజువు కాలేదు. కాని అలాగని మనం ఆయన చెప్పినవన్నీ తిరస్కరించవచ్చా? ఇది 'స్నానపుతొట్టిలోని నీళ్ళతో బిడ్డను కూడా విసరివేసినట్లు' అనే సామెతకు మంచి ఉదాహరణ కాదా ?

సోషియాలజీ దృష్టిలో మార్క్స్ నిజంగా కొన్ని భవిష్యత్తుకు సంబంధించిన సూక్ష్మ దృష్టి భావాలను వెల్లడించారు. రాజకీయ, ఆర్థిక అంశాలకు (రిపబ్లిక్/ప్రజాతంత్ర: పెట్టుబడిదారీ/ కమ్యూనిస్టు) సంబంధించి మీరు ఎక్కడున్నా 150 సం॥ క్రితం మార్క్స్ చెప్పినవి ఈ రోజుకూ చెవులలో మ్రోగుతూనే ఉన్నాయి. "నేను మార్క్సిస్టును. నన్ను ముద్దాడండి" అంటే చాలదు. కాని ఇక నుంచి ఎవరైనా వేరే వారిని మార్క్సిస్టు అని నిందిస్తే వారిని నీవు వారించవచ్చు. అద్దాల మేడలో ఉండి ఎదుటి వారిపై రాళ్ళు విసురుతున్నారని ఆశ్చర్యపోవచ్చు. ❑

**డా॥ బి. రమేష్ చంద్రబాబు**

**అనువాదం**

# మార్క్సిజాన్ని మించిన కరదీపిక లేదు



హెచ్చార్కె
'రస్తా' పత్రిక సంపాదకులు

ఇది కార్ల్ మార్క్స్ ద్విశత జయంతి సంవత్సరం. ఒక వుద్వేగం. ఒక వుత్సాహం. ఆలోచనల చరిత్ర చేసుకుంటున్న సంబరం.

వంతెన కింద చాల జలాలు ప్రవహించాయి. 'అయామ్ డన్ విత్ మార్క్సిజం' అనడం ఒక ఫ్యాషన్ అయిపోవడం, ఆ ఫ్యాషన్ అర్థరహితమయిపోవడం కూడా జరిగిపోయింది. 'మార్క్సిజంలో గ్యాప్స్' అనే విమర్శ కూడా... అది పుట్టినప్పుడు ఎంత బలహీనమో ఇప్పుడూ అంతే బలహీనం.

రాలేదని కాదు, కొత్త ఆలోచనలు చాల వచ్చాయి. గొప్ప ఆలోచనలు వచ్చాయి. తమ మేళ్ళు తాము చేశాయి. మునుపు మనం చూడని సమస్యల్ని సమస్యలుగా చూపి, ఆలోచింప జేశాయి.

సందట్లో సడేమియా అన్నట్లు కొందరు మేధావులు.. 'మరే.. మరే.. అందువల్ల మార్క్సిజం తప్పు' అంటో పాత గొణుగుడుకు కొత్త ముసుగులు తొడగబోయారు. 'ఎందువల్ల' అని ఎదురడిగితే నోరెళ్ళ బెట్టారు. ఎందుకంటే, కొత్త ఆలోచనలు మార్క్సు వ్యతిరేకులకు వుపయోగపడేవి కావు.

మెటీరియలిజం పునాది మీద నిలబడే గతితర్కం... మార్క్సు ఆలోచన.

దానికి మించి కొత్త ఆలోచనలు మౌలికంగా పురోగమించింది లేదు, ఆకుకు పోకకు పొందని కొన్ని చమత్కారాలు తప్ప.

ఓరియెంటలిజం, పవర్/నాలెడ్జ్, డీకన్స్ట్రక్షన్ వంటి పని కొచ్చే కొత్త ఆలోచనల్ని ముందుకు తెచ్చిన వాళ్లు కూడా మార్క్సిస్ట్ డయలెక్టిక్స్‌ను దాటి వెళ్ళారనిపించదు. అదే డయలెక్టిక్స్‌ను మరిన్ని కోణాలకు విస్తరించి జీవితాన్ని మరింత వెలిగించారయితే. సో,

'ఫలానా 'అందువల్ల', మార్క్సిజం తప్పు...' అనే వన్నీ కొన్ని విష్ఫుల్ కపాల పేటికల్లో పుట్టి అక్కడే మరణించిన తుపానులు. మానసిక చక్కిలిగింతలు.

సోవియెట్ రష్యాలో, చైనాలో మరో చోట జరిగినవి మార్క్సిజం నుంచి వైదొలగి చేసిన ప్రయోగాలు. మునుపటి, నేటి ప్రజా వీరుల తెగువలకు, వారి చర్యల్లోని నిజాయితీకి ఎర్రెర్రని సలాములు చెబుతూనే, మూడో ఇంటర్నేషనల్ పరిధిలో జరిగిన ప్రయోగాల వైఫల్యాల్ని గుర్తించక తప్పదు. గుర్తించడం ఎవరినీ తప్పు పట్టడానికి కాదు. సరైన ప్రజా చర్య కోసం వేదికను శుభ్రం చేయడానికి.

ఇది జీవితం. కాల్పనికత (రొమాంటిసిజం) కోసం మనం చేసే నిరంతర ప్రాణ త్యాగాలు ఎదిరి పక్షానికి మేలు చేస్తాయి. అవసరాల వేట కుక్కలచే తరుమబడే పేదలూ, మధ్యతరగతి ప్రజలకు మేలు చేయవు. ఇది మన వుద్దేశం కాకపోయినా, జరిగేది ఇదే, జరిగింది ఇదే.

మన పోరాట శక్తులు వ్యర్థంగా ఖర్చయిపోవడం ఎదిరికి మేలు చేస్తుంది. అలా మనతో ఖర్చు చేయించడం ఎదిరి సమర వ్యూహంలో ముఖ్య భాగం. ఇది తెలుసుకోడానికి ఎవరూ మిలిటరీ శాస్త్రాల్ని అధ్యయనం చేయనక్కర్లేదు. ప్రయోగ కర్తలు తమ వునికిని కాపాడుకోడానికి ఇంటలెక్చువల్ జగ్లరీతో యువజనం కళ్ళు మిరుమిట్లు గొల్పనక్కర్లేదు. అక్కర్లేదు నయా బ్రాహ్మణవాదం.

సోవియట్ రష్యాలో, చైనాలో ఏం జరిగిందో బెతల్ హ్యాం బాగానే చెప్పారు. 'మంచి మాట చెప్పడానికి మనోడయితేనేం మావో అయితేనేమ'ని ప్రజా కవి కాళోజీ అన్నాడని భలే మురిశాం అప్పుడు?! ఇప్పుడు మంచి మాట చెప్పడానికి మనోడయితేనేం పాశ్చాత్యుడయితేనేం అని అనరేం మనోళ్ళు? బెతల్ హ్యాం చర్మ వర్ణం వెనుక దాక్కుంటారెందుకు? 'వెస్టర్న్ ప్రాపగాండా' అని తప్పుకుంటారెందుకు, బెతల్ హ్యాం రష్యా డాక్యుమెంట్లను సైతం మన ముందుంచిన తరువాత కూడా?

ఒకసారి స్టాలిన్ ను తప్పు బడితే, ఇక మనం మన స్టాలినిస్టు పాలిటిక్స్‌ను సమర్థించుకోలేమని భయం కదూ?!

'ఉక్కు మనిషి' జోసెఫ్ స్టాలిన్ ఉక్కుపాదం కింద నలిగింది 'పెట్టుబడి' కాదు, శ్రామికులు.

ఆ ప్రభుత్వ ఛత్రం కింద ప్రవర్ధమానమయ్యింది సోషలిజం కాదు. ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానం.

మేలు పడింది రైతులు, కార్మికులు కాదు. వాళ్లు మరిన్ని పని గంటలు పని చేసి, మరింత నిర్బంధ శ్రమ బరువు కింద నలిగిపోయారు. హింసల పాలయ్యారు. ('లక్షల' మంది 'ప్రజా శత్రువుల'ట, వాళ్ళ మీద హింసలు, నిర్బంధం సరైనదట. అన్ని లక్షల మంది ప్రజా శత్రువులుండేది.. అదొక దేశమా, నరక లోకమా?)

డెబ్బయ్ ఏండ్ల తరువాత ఒక తెలుగు కవి వుపమించినట్లు... బ్యాండేజ్ విప్పి చూస్తే పుండు ఎక్కడున్నది అక్కడే వుంది. నిజానికి మరింత చీము పట్టి వుంది. మనోళ్ళంతా పార్టీ కార్డులే ప్లేన్ టిక్కెట్లుగా మాస్కో ప్రయాణాలు చేసొచ్చి, అక్కడ అంతా భూతల స్వర్గమని మనకు చెప్పింది పచ్చి అబద్ధమని లేదా కళ్ళకు గంతలు కట్టిన మచ్చిక గుర్రాల దృక్-పథమని తెలిసిపోయాక... ఇంకా.. ఇంకా... ఎందుకు వ్రేలాడ్డం మూడో ఇంటర్నేషనల్ పుచ్చిన

కొమ్ములు పట్టుకుని?!

ఏండ్లు పూండ్లు గడిచినా... మరి కొన్ని ఉడుకు నెత్తురు పొంగి పొర్లే యవ్వనాగ్నులు భగ్గున మండి ఆరిపోవడమే గాని... ఒక్క ఎకరా భూమి దున్నే వాడి పరం కాకపోయినా, అసలిపుడది ఒక పోరాడదగిన జీవన్మరణ సమస్యే కాకపోయినా... ఇంకెన్నాళ్లు వ్రేలాడతారు 'అర్ధ భూస్వామ్యం' అనే అర్థ రహిత నినాదం చూరు పట్టుకుని.

ఇంతకూ మన పోరాటాల ధ్యేయం ఏమిటి?

భూమి పంపిణీ కాదు. ఎందుకంటే, ఇప్పుడు ఫ్యూడల్ భూస్వాముల్లేరు, వాళ్ళ భూముల్లేవు.

ఫ్యాక్టరీలపై ప్రజా యాజమాన్యం కాదు. మన ట్రేడ్ యూనియన్లు అలాంటి ప్రయత్నం చేస్తున్నట్టు లేవు. అసలది మన అజెండాలోనే లేదు.

అందరి ధ్యేయం ఒక్కటే. రాజ్యాధికారం. అయితే ఓట్లూ సీట్ల లెక్క. లేకుంటే శవాల లెక్క. ధ్యేయం మాత్రం రాజ్యాధికారం. రాజ్యాధికారం ఎవరికి? కమ్యూనిస్టు పార్టీకి? పార్టీకి రాజ్యాధికారం ఎందుకు? సోషలిజం నిర్మించడానికి! అదీ సంగతి. తిరిగి తిరిగి తిరిగి స్టాలిన్ దగ్గరికే వస్తాం. రాజ్యాధికారంతో సోషలిజం అనే భావనకి. రాజ్యాధికారంతో సోషలిజం అంటే 'పై నుంచి సోషలిజం'. పైన ఎవరుంటే వారి సోషలిజం. పై వాడు శ్రామిక వర్గం వాడు కానక్కర్లేదు, పార్టీ వాడయితే చాలు. పార్టీలో నాయకుడు కాగలిగితే చాలు.

లెనిన్‌ని ఎందుకనవు అని అడగొద్దు. లెనిన్ బతికుంటే ఎలా వుండేదో తెలియదు. బహుశా ఆయన తలపెట్టిన 'న్యూ ఎకనామిక్ పోలసీ' ప్రజావసరాలకు అనుగుణంగా మరింత విస్తరించేది. ఎన్ ఈ పీ అనేది సోషలిజం కాదు. 'ప్రజాస్వామ్యం'.

'పై నుంచి సోషలిజం' అనే తబలా మీద స్టాలినిస్టు తరహా అపశృతులే పలుకుతాయి. ఆ అపశృతులను ఇప్పటి పార్టీలలోనూ వినొచ్చు, ఓపిక వున్న వాళ్ళు.

ఇటాలియన్ మార్క్సిస్టు ఆంటోనియో గ్రాంసీ చెప్పినట్లు మార్పు పైనుంచి కాదు, కింద పౌర సమాజం (సివిల్ సొసైటీ) నుంచి పెల్లుబుకాలి. నిలబడేది అదే. ప్రజలకు మేలు చేసేది అదే. సోషలిజానికి బాట వేసేదీ అదే.

అది ఎప్పుడో ఎక్కడో కాదు. వూరు, పట్నం, నగరం నడి బొడ్డున ఎగరాలి శ్రామిక పతాకం. ఎవరెవరం ఎక్కడున్నామో అక్కడే. ఎవరెవరం ఏయే పనులు చేస్తున్నామో ఆ పనుల చెమట మరకలతోనే ఎగరాలి జనం జెండా. ఇవాళ దానికి చాల ఆస్కారం వుంది. పేరు పెట్టి గాని, పెట్టక గాని 'పెట్టుబడిదారీ'ని, దాని క్రుయెల్టీని జనం ప్రశ్నిస్తున్నారు. 'పెట్టుబడి' కేంద్రమయిన అమెరికాలో శ్రీ డొనాల్డ్ ట్రంపు దొర గారిని గెలిపించిన 'ఎర్ర' (రిపబ్లికన్) రాష్ట్రాల్లోనే.. కేవలం తమ కోసం గాక, తమ చేతుల్లోని భావి ప్రపంచం కోసం టీచరమ్మలు... మైళ్లకు మైళ్ళు కదం తొక్కారు.

తమిళనాడు, తూత్తుకూడిలో 'వేదాంత' గారి స్టెర్లైట్ ఫ్యాక్టరీ మాకొద్దు, దాని ప్రాణాంతక కాలుష్యం మాకొద్దని ప్రజలు ప్రాణాలకు తెగించి నినదించారు.

మరి పలు చోట్ల మరి పలు పోరాటాలు...

ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ అన్యాయం వుందో, దోపిడి వుందో, ఎక్కడ ఆకలి అవమానాలున్నాయో అక్కడంతా ఎదిరింపు వుంది.

హరాకిరీలే కాదు; దుర్మార్గం మీద, అన్యాయం మీద పోరాడ్డానికి వేవేల మార్గాలున్నాయి.

మనకు చాల తక్కువ నష్టం ఎదిరికి చాల ఎక్కువ నష్టం కలిగించేదే మంచి పోరాటం అని ప్రజలకు తెలుసు. మార్క్సిజానికి తెలుసు.

బాగా వెనుకబడిన దేశం అనే బలహీనమైన లింకును తెగ్గొట్టడం... వింటానికి బాగుంది గాని, బాగా ముందు-పడిన దేశాల్లోనే... పెట్టుబడి కోటల్లోనే 'మొదట సోషలిజం' అన్న మార్క్సు భావన ఇప్పటికీ సత్యమని... ఇటీవలి చరిత్ర మనకు తెలియజేసింది. దానికి దోహదం చేయడమే సరి దారి.

ఔను, మార్క్సు వైపు, మార్క్సిజం వైపు ఇప్పుడు ప్రపంచ పవనాలు వీస్తున్నాయి. ఆరోగ్యప్రదమైన పవనాలు. ఈ పవనాలు జీవ దాయినులు.

కాల్పనికత పునాది మీద నిర్మించే గాలి మేడలు కూలి, పేద యువత నలిగిపోవడం కాదు, దానికి మన పద్య గద్యాలతో నిప్పులు ఎగదోయడం కాదు ఇవాళ జరగాల్సింది... అది నయా బ్రాహ్మణ వాదం...నియో ఇంటెల్లెక్చువలిజం.

సాంస్కృతిక విప్లవ కాలంలో చైనా పిల్లలు ప్రొఫెసర్ల నెత్తుల మీద పేడ తట్టలు ఎత్తడం వంటి 'అతి చర్యల' (ఎక్సెసెస్) కు పాల్పడ్డారని ఆనాడు ఈసడించినది మనలోపలి నయా బ్రాహ్మణవాదమే.

భౌతిక శ్రమ కన్న ఇంటలెక్చువల్ శ్రమ ఏమంత పవిత్రం కాదు. అందరూ అన్ని పనులూ చేయాలి, చేయగలరు. దానికి తగిన సంస్కారం మప్పేదే, అలాంటి సంస్కృతిని నిర్మించేదే మార్క్సిజం. మిగిలింది.. అది ఏ వేషం వేసుకున్నా, ఏ రంగు పూసుకున్నా.. మార్క్సిజం కాదు.

వాస్తవికత పునాది మీద మార్క్సు కన్న కల, స్వప్న శాస్త్రం మార్క్సిజం. అది పదిలంగానే వుంది. అడుగడుగున రుజువవు తున్నది. మన వాస్తవిక పునాది మీద మనమూ కొత్త కలలు కందాం.

ఆలోచించడానికి మార్క్సిజాన్ని మించిన కరదీపిక లేదు. మిగిలింది ఏదయినా ట్రంపులకు, మోడీలకు ఎర్రనివో మరే రంగువో తివాచీలు పరిచేదే.

మార్క్సుకు మనఃపూర్వక ద్విశత నివాళి! ❑

**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : DVVS Varma**